

ఆంధ్రజ్యోతి
ప్రకాశం
గురువారం 27, జూన్ 2024

టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు తీవ్ర ఒత్తిడితో కొట్టుమిట్టాడుతున్నారు. వారి పరిస్థితి 'కరవమంటే కప్పకు కోపం.. వదలమంటే పాముకు కోపం' అన్న చందంగా తయారైంది. తక్షణ ఉపాధి లభించే బాధ్యతలు, పోస్టుల కోసం కిందిస్థాయిలో పార్టీ నాయకులు, శ్రేణుల నుంచి వస్తున్న ఒత్తిడి గతంలో ఎన్నడూ లేని స్థాయిలో ఉంది. ఇటు పార్టీ శ్రేణులతోపాటు, అటు కూటమి భాగస్వామ్య పార్టీలకు ప్రాధాన్యమివ్వాల్సి రావడంతో అది మరింత పెరిగింది. ప్రధానంగా రేషన్ డీలర్లు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, పొదుపు సంఘాలలో వీవోలు, మెప్మాలో ఆర్‌పీలు, పాఠశాలల్లో కుకింగ్ ఏజెంట్ల బాధ్యతల కోసం గ్రామస్థాయిలోని అధికార పార్టీ నేతలు ఎమ్మెల్యేల వద్దకు క్యూ కడుతున్నారు. ఒక పోస్టుకు నలుగురైదుగురు గ్రూపులుగా ముందుకు వస్తుండటం ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెడుతోంది. కొన్నిచోట్ల కూటమి పార్టీల నేతల మధ్య పోటీపెరగటం ఎమ్మెల్యేలకు మరింత తలనొప్పిగా మారింది. దీంతో ఈ వ్యవహారంలో వారు ఎంతమేరకు సాఫీగా ముందుకుపోగలరన్న అంశం రాజకీయవర్గాలలో చర్చనీయాంశమైంది.

ఏం చేద్దాం?

రేషన్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీవోలు, ఆర్‌పీ పోస్టుల కోసం తీవ్రపోటీ

ఒత్తిడిలో టీడీపీ నేతలు

సీనియర్ శాసనసభ్యులు సైతం ఉక్కిరిబిక్కిరి

కింది స్థాయి నాయకులపై భారం మోపి

తప్పుకుంటున్న కొత్త ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు

జనసేనను విస్మరించవద్దంటూ ఆదేశాలు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

జిల్లాలో గెలుపొందిన టీడీపీ ఎమ్మెల్యేలకు, ఓటమి చెందిన పార్టీ అభ్యర్థులకు విజయోత్సవాలు ముగిసీము గియకముందే సమస్యలు ఎదురయ్యాయి. వారికి వెన్నుదన్నుగా నిలిచే గ్రామస్థాయి నాయకుల నుంచి ఒత్తిళ్లు పెరిగాయి. ఎన్నికల్లో విజయం కోసం ఇటు టీడీపీ, అటు కూటమి పార్టీల నాయకులను సమన్వయం చేసుకోవడం తోపాటు కలిసొచ్చిన ఇతర అన్నివర్గాల వారిని కలుపుకు పోవడంలో ఎక్కువమంది సఫలీకృతులయ్యారు. ఫలితంగానే జిల్లామొత్తంగా టీడీపీ కూటమికి ఓటింగ్ శాతం భారీగా పెరిగింది. దీంతో ఆయా నియోజకవర్గాలలో ఎమ్మెల్యేలు, ఆపార్టీ ఇన్‌చార్జిలు అందరికీ సమన్యాయం చేసే విషయంలో తీవ్ర ఒత్తిడికి గురవుతు న్నారు. గెలిచిన ఎమ్మెల్యేలు ఇంతవరకూ నియోజకవర్గాలలోని అన్నిప్రాంతాల్లో పర్యటించలేదు. మంత్రివర్గం ఏర్పాటు, ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాలు, అభినందనలు తెలిపేందుకు వచ్చిన పార్టీ శ్రేణులు, ప్రముఖులను కలిసేందుకే సమయం సరిపోయింది. ఇక మండలాలు, గ్రామాలవారీ కార్యక్రమాలు పెట్టుకోవాలని ఆలోచిస్తున్న తరుణంలో పొలోమని గ్రామస్థాయి నాయకులు వచ్చి డిమాండ్లు పెట్టడం ప్రారంభించారు.

ఐదు రకాల పోస్టుల కోసం డిమాండ్

రేషన్ డీలర్లు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు డిమాండ్ అధికంగా ఉంది. వాటికితోడు గ్రామాలవారీ పొదుపుసంఘాల నిర్వహణకు బాధ్యత వహించే విలేజ్ ఆర్గనైజర్ (వీవో), పట్టణాల్లో రిసోర్స్‌పర్సన్ (ఆర్‌పీ) పోస్టుల కోసం, పాఠశాలల్లో ఉండే కుకింగ్ ఏజెన్సీల కోసం కిందిస్థాయి నాయకులు రంగంలోకి దిగారు. ప్రత్యేకించి రేషన్ డీలర్లు వచ్చే నెల సరుకుల కోసం వెంటనే డీడీలు తీయాల్సి ఉంది. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు అధికారులకు ఎవరి పేరు సూచిస్తే వారినే డీలర్‌గా నియమించేందుకు పౌరసరఫరాల శాఖ సిద్ధంగా ఉంది. దీంతో వెంటనే మా పేరు చెప్పండి మేమే డీడీ కడతామంటూ గ్రామస్థాయిలోని టీడీపీ నాయకులు ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలపై ఒత్తిడి పెంచారు. ఒక్కో గ్రామం నుంచి ఒక డీలరు పోస్టుకు సరాసరిన ముగ్గురు టీడీపీ వర్గీయులు పోటీపడుతున్నారు. ఒక గ్రామంలో రెండు మూడు డీలర్ పోస్టులు ఉన్నప్పటికీ వీటికీ అదేస్థాయిలో పోటీ ఉంది. ఎక్కడా గ్రామనాయకులంతా కలిసి ఒక పేరునే సూచించిన దాఖలాలు లేవు. దీంతో కొత్త డీలర్ల ఎంపికపై ఎమ్మెల్యేలు విపరీతమైన కసరత్తు చేస్తున్నారు. కొంతమంది ఎమ్మెల్యేలు పాతడీలర్ల నుంచి డీడీలు తీసుకోవద్దని తాము కొత్తవారి పేర్లు ఇస్తామని అధికారులకు హుకుం జారీ చేశారు.

గ్రామాలలో అలజడి

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు కూడా డిమాండ్ ఉంది. ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఇతరత్రా ఆదాయాలు పక్కనపెట్టినా జీతం వస్తుంది. గ్రామానికి ఒకరిగా నియమితులయ్యే విలేజ్ ఆర్గనైజర్ పోస్టుకు ఎంపికైన వారికి నెలకు పదివేల జీతం వస్తుంది. మెప్మా ఆర్‌పీలకు, కుకింగ్ ఏజెన్సీల నిర్వాహకులకు కూడా నెలవారీ జీతాలు ఉంటాయి. ఆయా పోస్టులకు పోటీ పెరిగింది. ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు నేతలను అప్రమత్తం చేస్తున్నారు. గత వైసీపీలో వలే అక్రమాలకు పాల్పడాలంటే మన ప్రభుత్వంలో కుదరదని, అందుకని మీరు అనవసరంగా పోటీపడవద్దని చెబుతున్నారు. నాయకులు అధికారికంగా వచ్చే జీతాలే తమకుచాలని అంటూ ఎవరికి వారు తమవర్గం వారికే ఆపోస్టు దక్కాలన్న పోటీని, ప్రాధాన్యతను వివరిస్తున్నారు. మీలో మీరే నిర్ణయించుకుని రండన్న ఎమ్మెల్యేల సూచనతో గ్రామాలలో టీడీపీ శ్రేణుల్లోని ఆయా గ్రూపులలో అలజడి ప్రారంభమైంది. ఎక్కువ గ్రామాల్లో నాయకులు ఐక్యంగా ముందుకు రాకపోవడం సమస్యగా మారింది. దీనికితోడు ఈ పోస్టుల విషయంలో జనసేనను విస్మరించరాదని టీడీపీ అధిష్ఠానం నుంచి ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలకు సందేశం అందింది. జనసేన ఓటర్లు లేని గ్రామాల నుంచి కొందరు తాము జనసేన అన్న పేరుతో ఆయా పోస్టులకు దరఖాస్తులు చేస్తున్నారు. ఇక ఒంగోలు, దర్శి, మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాలలో అయితే జనసేన వైపు నుంచి ఈ పోస్టుల కోసం మరింత ఒత్తిడి ఉంది.

రేషన్ డీలర్‌ల కోసం తీవ్రపోటీ


మొదటిసారి గెలుపొందిన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఈనెలకు పాత డీలర్లనే కొనసాగించాలని, వచ్చేనెల నుంచి కొత్తవారి ఎంపిక చేస్తామని చెప్పి చేతులు దులుపుకున్నట్లు తెలిసింది. దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి భర్త లలిత్‌సాగర్ విస్తృత కసరత్తు చేసినా 30శాతం గ్రామాల్లో డీలర్ పోస్టులకు ఏకాభిప్రాయం కుదరక సతమతమవుతున్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో ఏకాభిప్రాయం రాక కొన్నిచోట్ల డీలర్ల ఎంపికను ఎరిక్ష న్‌బాబు పక్కనపెట్టినట్లు తెలిసింది. మంత్రి స్వామి ప్రాతినిధ్యం వహించే కొండపిలో ఆయన దామచర్ల పూర్ణచంద్రరావుకు డీలర్‌ల వ్యవహారాన్ని అప్పగించినా కొలిక్కిరాలేదు. మంత్రి రవికుమార్ అద్దంకి నియోజకవర్గంలో కసరత్తు చేపట్టి కొత్త డీలర్లకే అవకాశం ఇవ్వాలని చెప్పినట్లు తెలిసింది. ఆయన బాధ్యత ఇచ్చిన కిందిస్థాయి నాయకులు అనేక గ్రామాలలో పోటీపడ్డ నాయకులను సమన్వయం చేయలేక రవికుమార్ ముందే ఆ జాబితాను పెట్టినట్లు సమాచారం. పర్చూరులో కొంతమంది వైసీపీ నాయకులు పరోక్షంగానూ ఎమ్మెల్యే సాంబశివరావుకు సహకరించారు. దీంతో ఆయన ఇటు పార్టీ, అటు జనసేన, మరోవైపు వైసీపీ నుంచి సహకారం అందించిన నేతలను సంతృప్తిపరచలేక సతమతమవుతున్నారు. ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు జనార్దన్, విజయ్ కుమార్‌లు శని, ఆదివారాల వరకు అవకాశం ఇస్తున్నాం.. ఎక్కడికక్కడ ఏకాభిప్రాయాలకు రండి, లేదంటే మేము తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉండాలని చెప్పినట్లు తెలిసింది. కనిగిరి, మార్కాపురం ఎమ్మెల్యేలు ఉగ్రనరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి... మంత్రి స్వామి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి కూడా వెళ్లకుండా ఈ అంశాలపై కుస్తీ పడుతున్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి కిందిస్థాయిలో ఏకాభిప్రాయం రాని అంశాలపై ఆదివారం సమీక్ష చేసి ఫైనల్ చేస్తానని చెప్పినట్లు తెలిసింది. చీరాల ఎమ్మెల్యే కొండయ్య మూడురోజుల్లోపు మీలో మీరు ఏకాభిప్రాయానికి రాలేకపోతే ఆతర్వాత తాను తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉండాలని తేల్చి చెప్పినట్లు సమాచారం.

మంత్రిగా డోలా బాధ్యతల స్వీకరణ

సింగరాయకొండ గురుకుల పాఠశాలలో

సైన్సు కోర్సులు పునరుద్ధరిస్తూ తొలిసంతకం

హాజరైన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు



డాక్టర్ స్వామిని అభినందిస్తున్న మంత్రి రవి, ఎమ్మెల్యేలు, నేతలు

ఒంగోలు, జూన్ 26(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రిగా జిల్లాకు చెందిన డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలోని మూడో బ్లాక్ ఫస్ట్ ఫ్లోర్‌లో పలువురు సన్నిహితులు, శ్రేయోభిలాషుల సమక్షంలో శాస్త్రోక్తంగా ఆయన బాధ్యతలు తీసుకున్నారు. కొండపి నుంచి వరుసగా మూడుసార్లు విజయం సాధించిన డాక్టర్ స్వామికి ముఖ్యమంత్రి చంద్రబాబు తన కేబినెట్‌లో స్థానం కల్పించిన విషయం విదితమే. ఈనెల 12న మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన స్వామికి రెండు రోజుల అనంతరం సాంఘిక సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమం, సచివాలయాలు, వలంటీర్ల శాఖలను సీఎం కేటాయించారు. బుధవారం ఆ బాధ్యతలను ఆయన స్వీకరించారు. తన నియోజకవర్గ పరిధిలోని సింగరాయకొండ గురుకుల పాఠశాలలో గత ప్రభుత్వం రద్దు చేసిన ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులను పునరుద్ధరిస్తూ తొలి సంతకం చేశారు. అలాగే ఉమ్మడి జిల్లా పర్చూరు నియోజకవర్గం నాగులపాలెంలోని గురుకుల పాఠశాలలో సోలార్ విద్యుత్ ఏర్పాటు, కూరగాయలు నిల్వ చేసే కూలింగ్ చాంబర్‌ల ఏర్పాటు ఫైళ్లపైన కూడా ఆయన సంతకాలు చేశారు.

త్వరలో సాంఘిక సంక్షేమ శాఖ ప్రక్షాళన

బాధ్యతల స్వీకరణ అనంతరం మంత్రి స్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వం సాంఘిక సంక్షేమశాఖలో రూ.వేల కోట్లకుపైగా బకాయిలు పెట్టి వెళ్లిందన్నారు. దానివల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల ప్రభుత్వం అని చెప్పుకొని ఆ వర్గాలను మోసం చేసిందని మండిపడ్డారు. సాంఘిక సంక్షేమశాఖను ప్రక్షాళన చేసే చర్యలు త్వరలోనే చేపడతామన్నారు. పేద విద్యార్థులకు ఉపకరించే సంక్షేమ పథకలను సమర్థవంతంగా అమలు చేస్తామని చెప్పారు.

భారీగా హాజరైన టీడీపీ నేతలు, శ్రేణులు

డాక్టర్ స్వామి మంత్రిగా బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు, కొండపి నియోజకవర్గ శ్రేణులు భారీగా హాజరయ్యారు. రాష్ట్రమంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ఏలూరి సాంబశివరావు, బీఎన్ విజయ్‌కుమార్, ఎం.అశోక్‌రెడ్డి, ఎం.ఎం. కొండయ్య, మాజీ ఎమ్మెల్యేలు పోతుల రామారావు, నారపుశెట్టి పాపారావు, ఖైపాలెం, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జిలు గొట్టిపాటి లక్ష్మి, గుడూరి ఎరిక్షన్‌బాబు, టీడీపీ సీనియర్ నేత దామచర్ల పూర్ణచంద్రరావు దంపతులు హాజరై డాక్టర్ స్వామికి అభినందనలు తెలిపారు. యువనేత దామచర్ల సత్య ఆధ్వర్యంలో సచివాలయంలో మంత్రి స్వామి బాధ్యతలు స్వీకరణ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు జరిగాయి. కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి టీడీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో ఆ కార్యక్రమానికి తరలివెళ్లి పాల్గొన్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన ముఖ్య నాయకులు పలువురు స్వామిని కలిసి అభినందనలు తెలిపారు. అలాగే మంత్రికి ఓఎస్‌డీగా నియమితులైన జిల్లాకు చెందిన డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారైన శిరిగిరి కామేశ్వరరావు కూడా బుధవారం అక్కడ బాధ్యతలు స్వీకరించారు.

డీఆర్వో శ్రీలత 18 రోజులు సెలవు

ఇన్‌చార్జిగా విశ్వేశ్వరరావు

ఒంగోలు (కలెక్టరేట్), జూన్ 26 : జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.శ్రీలత సెలవుపై వెళ్లారు. వ్యక్తి గత కారణాలతో ఈనెల 27నుంచి వచ్చేనెల 14వతేదీ వరకు 18 రోజులు సెలవు పెట్టారు. దీంతో ఇన్‌చార్జి డీఆర్వోగా ఓడా వైస్ ఛైర్మన్ విశ్వేశ్వరరావును నియమిస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. వచ్చేనెల 15న శ్రీలత విధుల్లో చేరనున్నారు.

మళ్లీ పుంజుకున్న పొగాకు మార్కెట్

- **కిలో రూ.362 పలికిన గరిష్ఠ ధర**
- **బ్రౌన్ రకం రూ.310.. బోర్డు చరిత్రలో రికార్డు**
- **బేళ్ల కోసం పోటీపడుతున్న బయ్యర్లు**
- **ఇప్పటి వరకూ 83 మిలియన్ కిలోల విక్రయం**



ఒంగోలు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది పొగాకు మార్కెట్ మళ్లీ పుంజుకుంది. బుధవారం కిలో గరిష్ఠ ధర ఏకంగా రూ.362 పలికింది. ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది పొగాకు మార్కెట్ జోరుగా సాగుతోంది. పక్షం రోజుల క్రితం గరిష్ఠ ధర కిలో రూ.360కి చేరింది. అనంతరం నాలుగు రోజుల తర్వాత రూ.330కి పడిపోయింది. దాదాపు పది రోజులపాటు కిలో రూ.330నుంచి 338 వరకూ సాగుతూ వచ్చింది. మూడు రోజుల క్రితం రూ.343 పలికింది. అలా పెరుగుతూ బుధవారం మార్కెట్లో గరిష్ఠ ధర కిలో రూ.362కు చేరింది. ఒంగోలు-1 వేలం కేంద్రంలో ఈ రేటు దక్కింది. పలు ఇతర కేంద్రాల్లో గరిష్ఠ ధరలు కిలో రూ.360కి అటు ఇటుగా ఉన్నాయి. అంతేకాక లోగ్రేడ్‌లో నాణ్యమైనదిగా భావించే బ్రౌన్ రకానికి మరింత డిమాండ్ ఏర్పడింది. బుధవారం ఆ గ్రేడ్ బేళ్ల గరిష్ఠ ధర కిలో రూ.310 పలికింది. మూడు రోజుల క్రితం వరకూ ఆగ్రేడ్ గరిష్ఠ ధరలు కిలో రూ.260కి అటు ఇటుగా ఉన్నాయి. అయితే ఒక్కసారిగా కిలోకు రూ.50 వరకు ధర పెరిగింది. లోగ్రేడ్‌లో నాసిరకంగా భావించే వాటికి కూడా భారీ ధరలు పలుకుతున్నాయి. అటు మేలు, ఇటు బ్రౌన్ రకం బేళ్ల కోసం పలు కంపెనీల బయ్యర్లు వేలం కేంద్రాల్లో పోటీ పడుతున్నారు. పొగాకు మార్కెట్లో గుత్తాధిపత్యం వహించే ఐటీసీ బయ్యర్లకు కూడా అవసరమైన మేర బేళ్లు దొరకని పరిస్థితి కనిపిస్తోంది. దీంతో వారు కూడా బేళ్ల కోసం పోటీపడుతూ ధరలు పెంచక తప్పడం లేదు. ఈస్థాయి ధరలు మార్కెట్లో ఎంత కాలం ఉంటాయన్న విషయం అలా ఉంచితే పొగాకు బోర్డు చరిత్రలో గరిష్ఠ ధర కిలో రూ.362 పలకడం ఇదే ప్రథమం. ఇదిలా ఉండగా దక్షిణాది మార్కెట్లో ఇప్పటి వరకూ సుమారు 83 మిలియన్ కిలోల పొగాకు విక్రయాలు జరిగాయి. సగటు ధర కిలోకు రూ.354.50 లభించింది.



బాలికలదే పైచేయి

ఇంటర్ ఫస్టియర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో

బాలురకంటే ఏడుశాతం అధిక ఉత్తీర్ణత

రాష్ట్రంలో 13వ స్థానంలో జిల్లా

ఒంగోలు (విద్య), జూన్ 26 : ఇంటర్ మొదటి సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో బాలికలు పైచేయి సాధించారు. బాలుర కంటే ఏడుశాతం అధికంగా ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేటు కళాశాలల కంటే ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు 19శాతం ఎక్కువ పాస్ అయ్యారు. జిల్లాలో విద్యార్థులు 42శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 13వ స్థానంలో నిలిచారు. జిల్లాలో మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 6,445 మంది పరీక్షకు హాజరు కాగా 2,709 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ కోర్సుల విద్యార్థులు 753 మంది హాజరు కాగా 372 మంది పాసయ్యారు. జనరల్ కోర్సుల్లో బాలురు 3,446 మంది పరీక్ష రాయగా 1,342 (39శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 2,999 మంది పరీక్షకు హాజరు కాగా 1,367 (46శాతం) పాసయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 49శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 18వ స్థానంలో నిలిచారు. బాలురు 44శాతం, బాలికలు 57శాతం మంది ఉత్తీర్ణులయ్యారు,

ప్రభుత్వ కళాశాలల్లో అధిక ఉత్తీర్ణత

జిల్లాలో ప్రభుత్వరంగ కళాశాలల్లో మొత్తం 1,554 మంది పరీక్షకు హాజరు కాగా 882 (56.75శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రైవేటు కళాశాలల నుంచి 4,881 మంది పరీక్షకు హాజరు కాగా 1,827 మంది పాసై ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల కంటే 19శాతం తక్కువగా, జిల్లా సగటు ఉత్తీర్ణత కంటే 6.57శాతం తక్కువగా కేవలం 37.43శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరం జవాబు పత్రాల మూల్యాంకనం ప్రయోగాత్మకంగా డిజిటల్ విధానంలో నిర్వహించారు. ఫలితాలను ఇంటర్మీడియెట్ బోర్డు ఆర్‌ఐవో సైమన్ విక్టర్ పత్రికలకు విడుదల చేశారు.



హెచ్‌ఈసీలో కంభం విద్యార్థి స్టేట్ ఫస్ట్

కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్‌ఈసీ చదువుతున్న తమ్మినేని చాతుర్య 500కు 490 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచారు. చాతుర్యకు 100కు ఇంగ్లీషులో 96, హిందీలో 99, ఎకనామిక్స్‌లో 97, హిస్టరీలో 99, సివిక్స్‌లో 99 మార్కులు వచ్చాయి. చాతుర్యను ఆర్‌ఐవో సైమన్ విక్టర్ అభినందించారు.

కేజీబీవీలు టాప్

- జిల్లాలో ఉత్తీర్ణతలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు(కేజీబీవీలు) అగ్రభాగాన నిలిచాయి. వీటిలో అత్యధికంగా 66శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. కేజీబీవీల నుంచి పరీక్షకు 247 మంది హాజరు కాగా 165(66.80శాతం) మంది పాసయ్యారు. త్రిపురాంతకం, కొమరోలు, కె.బిట్రగుంట, అర్ధవీడు, దొనకొండ కేజీబీవీలు 100శాతం ఉత్తీర్ణత సాధించాయి.
- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 946 మందికి 532 మంది పాసై 56.73శాతం ఉత్తీర్ణత సాధించారు. తాళ్లూరు కాలేజీలో 100శాతం, ఉప్పుగుండూరులో 97.56శాతం మంది పాసయ్యారు.
- ఏపీ మోడల్ జూనియర్ కళాశాలల్లో 150 మందికి 61 (40.67శాతం)మంది పాసయ్యారు. దోర్నాల ఏపీ మోడల్ స్కూల్‌లో 96శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.
- హైస్కూల్ ప్లస్‌లో 86 మందికి 52 (60.46శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. హెచ్.నిడమానూరులో 85.71శాతం మంది పాసయ్యారు.
- ఏపీఎస్‌డబ్ల్యూఆర్/ఏపీటీడబ్ల్యూఆర్‌లో 103 మందికి 60 మంది పాసయ్యారు. 58.25శాతం ఉత్తీర్ణత సాధించారు. కొండపి, దూపాడులో 100 శాతం మంది పాసయ్యారు.
- ఎయిడెడ్ కాలేజీల్లో 22 మంది పరీక్షకు హాజరు కాగా 12 మంది పాసై 54.55 ఉత్తీర్ణత సాధించారు.

పది సప్లిమెంటరీలో మనమే ఫస్ట్

96.15శాతం ఉత్తీర్ణత

ఒంగోలు (విద్య), జూన్ 26 : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించి సత్తా చాటారు. 2,724 మంది పరీక్షలకు హాజరుకాగా, 2,619 (96.15 శాతం)మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్ర సగటు ఉత్తీర్ణత 62.21 కాగా, జిల్లా విద్యార్థులు 34 శాతం అధికంగా సాధించారు. జిల్లాలో బాలురు 1,590 మంది పరీక్షకు హాజరు కాగా 1,527 మంది పాసయ్యారు. బాలికలు 1,134 మంది పరీక్ష రాయగా 1,092 మంది ఉత్తీర్ణులయ్యారు. అత్యధిక ఉత్తీర్ణత సాధించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపినందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులను డీఈవో సుభద్ర అభినందించారు.

నేడు బాధ్యతలు స్వీకరించనున్న కొత్త కలెక్టర్

దినేష్‌కుమార్ రిలీవ్

జేసీకి చార్జి అప్పగింత



కొత్త కలెక్టర్‌కు పూలమొక్క అందిస్తున్న ఇన్‌చార్జి డీఆర్వో

ఒంగోలు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు కొత్త కలెక్టర్‌గా నియమితులైన తమీమ్ అన్సారియా గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆ మేరకు కలెక్టరేట్ అధికారులకు సమాచారం అందింది. జిల్లాకు 38వ కలెక్టర్‌గా అన్సారియాను నాలుగు రోజుల క్రితం ప్రభుత్వం నియమించిన విషయం విదితమే. ఇప్పటి వరకు ఇక్కడ కలెక్టర్‌గా పనిచేసిన దినేష్‌కుమార్ అల్లూరి జిల్లాకు బదిలీ కాగా బుధవారం సాయంత్రం ఆయన రిలీవ్ అయ్యారు. జేసీ ఆర్.గోపాలకృష్ణకు చార్జి అప్పగించారు. గురువారం ఆయన అల్లూరి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. కాగా రెండున్నరేళ్లు ఇక్కడ పనిచేసిన దినేష్‌కుమార్ చివరి రోజైన బుధవారం కూడా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వివిధ శాఖల్లో పనిచేస్తూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాల్లోని 16 మంది వారసులకు కారుణ్య నియామకాల పత్రాలను అందజేశారు. అలాగే ప్రకాశం భవన్‌లో ఇటీవల చేసిన మౌలిక సదుపాయాల ఆధునికీకరణ పనులను ప్రారంభించారు. కొత్త కలెక్టర్ అన్సారియా బుధవారం రాత్రికి ఒంగోలు చేరుకున్నారు.

రోడ్డునపడ్డ సర్పంచ్‌లు

జగన్ పాలనలో రూ.100కోట్లకు పైగా

బిల్లులు పెండింగ్

చంద్రబాబుపై ఆశలు పెట్టుకున్న పాలక వర్గాలు

ఒంగోలు (కలెక్టరేట్), జూన్ 26 : మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్వాకంతో జిల్లాలోని పంచాయతీ సర్పంచ్‌లు రోడ్డున పడ్డారు. చేసిన పనులకు మూడేళ్లుగా బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులపాలై అల్లాడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించింది. అధికారాన్ని అడ్డుపెట్టుకొని గ్రామ పంచాయతీల్లో అత్యధికం కైవసం చేసుకుంది. పాలకవర్గాల్లో 80శాతానికిపైగా వైసీపీ మద్దతుదారులే ఉన్నారు. తమ ప్రభుత్వమే అధికారంలో ఉందన్న నమ్మకంతో సర్పంచ్‌లుగా ఎన్నికైన వెంటనే గ్రామాల్లో పంచాయతీ అనుమతులు తీసుకొని అనేక అభివృద్ధి పనులు చేశారు.

బాబుపైనే ఆశలన్నీ...



జిల్లాలోని 730 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు రూ.50 వేల నుంచి రూ.15 లక్షల వరకూ పనులు చేశారు. వాటికి వైసీపీ ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకుండా నిలిపివేసింది. దీంతో అప్పులు తెచ్చి పనులు చేసిన వారు వడ్డీలు కడుతూ వస్తున్నారు. అలా జిల్లావ్యాప్తంగా సుమారు రూ.100 కోట్ల వరకూ బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. స్థానిక ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని అనేక పర్యాయాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పైసా ఇవ్వలేదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సంఘం నిధుల నుంచైనా బిల్లుల్లో కొంత జమ చేసుకొనేందుకు సర్పంచ్‌లు ప్రయత్నించినా రాష్ట్ర ప్రభుత్వం మోకాలడ్డింది. నిధులు డ్రా చేయకుండా ఆంక్షలు విధించింది. సార్వత్రిక ఎన్నికల సమయంలోనైనా వైసీపీ ప్రభుత్వం పెండింగ్ బిల్లులు ఇస్తుందని సర్పంచ్‌లు ఆశించారు. కానీ ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పొందడంతో ఆపార్టీ సానుభూతిపరుల్లో మరింత ఆందోళన నెలకొంది. టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో ఇప్పుడు సర్పంచ్‌లు ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఆశలు పెట్టుకున్నారు. చంద్రబాబు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇలా చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లింపులు చేసేవారు. దీంతో ఇప్పుడు తమకు కూడా బిల్లులు మంజూరు చేసి ఆదుకుంటారన్న నమ్మకంతో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఉన్నారు.

శ్రీసరస్వతి విద్యార్థుల విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ రమణారెడ్డి

ఒంగోలు(విద్య), జూన్ 26: ఇంటర్ మొదటి సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఒంగోలులోని శ్రీసరస్వతి విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఉత్తమ మార్కులు సాధించి విజయభేరి మోగించారు. ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో ముగ్గురేసి విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో మొదటి మార్కులు సాధించి సత్తా చాటారు. ఎంపీసీ విభాగంలో కె.ప్రతిమ, వై బాలనవీన్, ఐ.హాసినిలు 470కి 467 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచారు. 18 మంది 470కి 466 మార్కులు సాధించి రాష్ట్రంలో రెండో స్థానంలో, 76 మంది 465 మార్కులు సాధించి మూడో స్థానంలో నిలిచారు. 192మంది 460కిపైగా, 315 మంది 450 కిపైగా మార్కులు సాధించారు. అలాగే బైపీసీలో ఆర్.బ్రెస్సీ, ఆర్.సుకుమార్, సాయి, హారిక, జాయ్‌లు 440కి 436 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచారు. 9 మంది 430కిపైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, అందుకు కృషి చేసిన అధ్యాపకులను విద్యాసంస్థల చైర్మన్ ఏవీ.రమణారెడ్డి, డైరెక్టర్లు ఎ.గణేష్‌రెడ్డి, ఎ.గంగాశంకర్‌రెడ్డి, సీఈవో ఎన్‌వీ.సురేష్ ప్రత్యేకంగా అభినందించారు.

శ్రీప్రతిభ విద్యార్థుల జయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు

ఒంగోలు(విద్య), జూన్ 26: జూనియర్ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో ఒంగోలులోని శ్రీప్రతిభ విద్యాసంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఎంపీసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారు. గోర్ల శృతి 470కి 467మార్కులు, చిన్నపురెడ్డి వెంకటత్రిష 466, బి.యోగలక్ష్మి 465, అట్లా వెంకటప్రసాద్, ఎస్.బాలకృష్ణ, కె.వెంకటకళ్యాణ్‌రామ్, ఎం.శ్రీమహాలక్ష్మి, ఎన్.లక్ష్మీదీపిక, కె.వెంకటసాయి పూజిత 465 మార్కులు సాధించారు. అలాగే బైపీసీ విభాగంలో వి.హసిని 433, డి.స్నేహారెడ్డి 426 మార్కులు సాధించారు. 464కు పైగా మార్కులు 17మంది, 463 మార్కులు 26మంది, 462పైగా మార్కులు 33మంది, 461పైగా మార్కులు 47 మంది, 450కిపైగా మార్కులు 108మంది, 440కి పైగా మార్కులు 168 మంది, 430కిపైగా 227మంది, 420కి పైగా మార్కులు 279 మంది, 410పైగా మార్కులు 321 మంది, 400 పైగా మార్కులు 369 మంది సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను బుధవారం స్థానిక కళాశాలలో చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో నల్లూరి జయప్రకాష్‌నారాయణ్ అభినందించారు.

మంత్రి స్వామికి టీడీపీ నేతల శుభాకాంక్షలు

సింగరాయకొండ గురుకులంలో ఎంపీసీ, బైపీసీలకు 40 సీట్ల చొప్పున కేటాయింపు

బాధ్యతలు చేపట్టిన వెంటనే తొలి సంతకం పెట్టిన డాక్టర్ స్వామి

సింగరాయకొండ, జూన్ 26: అమరావతిలో బుధవారం సాంఘిక సంక్షేమశాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని నియోజకవర్గంలోని పలు గ్రామాలు నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం మంత్రి సింగరాయకొండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సైన్స్ గ్రూపులను పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించారు. మళ్లీ బైపీసీ, ఎంపీసీలకు 40 సీట్ల చొప్పున కేటాయిస్తూ తొలి సంతకం పెట్టారు. ఈ సందర్భంగా మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో నేతలు వేల్పుల సింగయ్య, చీమకుర్తి కృష్ణ, షేక్ సందానీబాషా, సన్నెబోయిన శ్రీనివాసులు, పాకల సర్పంచ్ సైకం చంద్రశేఖర్‌రెడ్డి, కూనపరెడ్డి సుబ్బారావు, చంటి, మందలపు గాంధీచౌదరి, రామారావు, గుదే వెంకటేశ్వర్లు, చిగురపాటి గిరి, గాలి హరిబాబు, మించల బ్రహ్మయ్య, నక్కా బ్రహ్మేశ్వరరావు, పులి మాలకొండయ్య, నర్రా రాంబాబు, భైరపనేని మోహన్‌రావు, యస్థాని, సనావుల్లా, మోటుపల్లి వెంకటేశ్వర్లు, సన్నెబోయిన మల్లికార్జున్ పాల్గొన్నారు.



మంత్రిని స్వామిని అభినందిస్తున్న కొండపి మండల నాయకులు



మంత్రితో కామేపల్లి మాజీ సర్పంచ్ ఏలూరి రాంబాబు



మంత్రిని అభినందిస్తున్న సత్య, నాయకులు

మంత్రి స్వామికి అభినందనలు

కొండపి, జూన్ 26 : రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి పలు మండలాల నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో నేతలు గొర్రెపాటి రామయ్యచౌదరి, బొడ్డపాటి యల్లమందనాయుడు, చాగంరెడ్డి నరసారెడ్డి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, బత్తుల నారాయణస్వామి, కొర్రపాటి వసంతరాయుడు, గోనుగుంట పున్నయ్యచౌదరి, కొమ్మాలపాటి రాఘవ, పోటు శ్రీనివాసరావు, మారెడ్డి సుబ్బారెడ్డి, మారెడ్డి అబ్బిరెడ్డి, పెట్లూరు ఉపసర్పంచ్ మూలె రామారావు, ఆరెతోటి బాబూరావు, మూలె కోటేశ్వరరావు, కందిమళ్ల లక్ష్మీనారాయణ, దామా మురళి, గుండపనేని రామ్మూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు. జరుగుమల్లి నుంచి పోకూరి రవీంద్రబాబు, పోటు శ్రీనివాసమురళి, ఏలూరి రాంబాబు, కొమ్మాలపాటి కృష్ణ, పాతూరి కోటేశ్వరరావు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు. పొన్నలూరు నుంచి అనుమోలు సాంబశివరావు, కొండ్రగుంట శ్రీనివాసరావు, మండవ ప్రసాద్, మండవ మురళి, గుమ్మళ్ల వెంకటరావు, రాజారమేష్ పాల్గొన్నారు.

టంగుటూరు నుంచి...

టంగుటూరు: రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన స్వామికి పలువురు నేతలు శుభాకాంక్షలు తెలిపారు. వారిలో మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, సీనియర్ నేత దామచర్ల పూర్ణచంద్రరావు, కామని విజయకుమార్, చదలవాడ చంద్రశేఖర్, బెల్లం జయంత్‌బాబు, ప్రభాకర్, తిరుపతి స్వామి, బొజ్జా శ్రీనివాసరావు, మొకలపల్లి కోటేశ్వరరావు, ఎంపీటీసీ నాగేశ్వరరావు, రామా గోపి, కాకుమాను శ్రీకాంత్, అంజిబాబు, హరిబాబు, దామచర్ల బసవయ్య, గడ్డం మాధవ, వెంకట్రామయ్య, సుధాకర్, మక్కెన వెంకట్రావు, కసుకుర్తి భాస్కర్, దావులూరి వేణుగోపాల్ ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● ఏఎస్పీ నాగేశ్వరరావు పిలుపు



అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఏఎస్పీ నాగేశ్వరరావు

ఒంగోలు(క్రైం), జూన్ 26: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఏఎస్పీ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మత్తుకు బానిసలై యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోరారు. బుధవారం మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని పోలీసు, ఎస్ఈబీ ఆధ్వర్యంలో ఒంగోలులోని ఎస్పీ కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ యువకులు డ్రగ్స్, గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు బానిసలు కావద్దని హితవు పలికారు. ఆరోగ్యమైన జీవనాన్ని అలవరుచుకొని బంగారు జీవితాన్ని నిర్మించుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైన గంజాయి, మాదకద్రవ్యాలు విక్రయాలు చేస్తుంటే 112,100, 9121102266 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ఎస్ఈబీ నంబరు 14500 కు తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్పీ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఈఎస్ రవికుమార్, డీఎస్పీ కిషోర్‌బాబు, సీఐ జగదీష్, ఆర్ఐలు పాల్గొన్నారు.

మద్దిపాడు మండలంలో..



హర్షిణి కాలేజీలో మాట్లాడుతున్న సీఐ అజయ్‌కుమార్

మద్దిపాడు: విద్యార్థులు జీవితంలో ఎదిగేందుకు పాఠశాల దశ కీలకమైందని, అందువల్ల మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ మహేష్ పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మద్దిపాడులోని ప్రభుత్వ హైస్కూలు, ఏడుగుండ్లపాడులోని హర్షిణి కళాశాలలో మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ అజయ్‌కుమార్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల జీవితం అంధకారం అవుతుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సింగరాయకొండలో..



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఈబీ సీఐ నరహరి

సింగరాయకొండ: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సింగరాయకొండ ఎస్ఈబీ సీఐ నరహరి సూచించారు. బుధవారం అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక అమృత డిగ్రీకళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వాడకం వలనే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్సై దయాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

చీమకుర్తిలో..



ర్యాలీలో పాల్గొన్న సీఐ దుర్గాప్రసాద్

చీమకుర్తి: అంతర్జాతీయ డ్రగ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా చీమకుర్తి పట్టణంలో బుధవారం పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాల పట్ల సీఐ దుర్గాప్రసాద్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ఉన్నతపాఠశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో సైతం ర్యాలీ జరిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్ఐ కృష్ణయ్య, ప్రిన్సిపాల్ వీవీ.శివారెడ్డి, ఎంఎస్ఆర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



నగదు బహుమతి అందజేస్తున్న అమరవాణి

నాగులుప్పలపాడు, జూన్ 26: చేకూరపాడులోని వేణుగోపాలస్వామి ఓరియంటల్ హైస్కూల్‌లో గత ఏడాది పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన ఎ.నాగజ్యోతికి రూ.3వేలు, బి.మహేంద్రబాబుకు రూ.2వేల నగదు బహుమతులను పాఠశాల పూర్వ విద్యార్థి నల్లూరి అమరవాణి తన తండ్రి ఈశ్వరయ్య జ్ఞాపకార్థం బుధవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం అనిత, పాఠశాల అధ్యక్షుడు వడ్డెళ్ళ భాస్కరరావు, కరస్పాండెంట్ సిరిగిరి వెంకట్రావు, తుమ్మల వీరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వైసీపీ నాయకుడిపై కేసు

నాగులుప్పలపాడు, జూన్ 26: దంపతులపై దాడికి పాల్పడిన వైసీపీ నాయకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ బ్రహ్మనాయుడు తెలిపిన వివరాల మేరకు.. కె.తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు కాకర్ల వెంకటేశ్వర్లు సోదరికి చెందిన పెంపుడు కోళ్ళు సమీపంలో నివసించే పాపాల హనుమంతరావు ఇంటి వద్దకు వెళ్లాయి. దీంతో పాపాల హనుమంతరావు, ఆయన భార్య రమాదేవి వాటిని తరమగా, వెంకటేశ్వర్లు వారిపై దాడికి పాల్పడంతో గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు వెంకటేశ్వర్లుపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే బీఎన్‌కు శుభాకాంక్షలు

మద్దిపాడు, జూన్ 26: సీతారామపురానికి చెందిన తెలుగుదేశం నాయకుడు వడ్డెంపూడి శివరామకృష్ణ, ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని విజయ్‌కుమార్ నివాసంలో కలిసిన శివరామకృష్ణ మాట్లాడుతూ విజయ్‌కుమార్ నేతృత్వంలో నియోజకవర్గం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి పాలకులు కృషి చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్‌హనీఫ్



మాట్లాడుతున్న సయ్యద్‌హనీఫ్

ఒంగోలు(కలెక్టరేట్) జూన్ 26: కేంద్ర ప్రభుత్వంతో ఉన్న సానుకూలతను రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకొని జిల్లా అభివృద్ధికి, పెండింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్‌హనీఫ్ పేర్కొన్నారు. ఒంగోలులోని సుందరయ్యభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో నూతనంగా ఎన్నికైన పార్లమెంట్, శాసనసభ్యులకు, జిల్లాకు చెందిన మంత్రి స్వామికి అభినందనలు తెలిపారు. ఉపాధి పనులు ఈనెల 4నుంచి నిలిచిపోయాయని, ఈ కాలంలోనే వ్యవసాయ కూలీల ఉపాధికి ఎంతగానో తోడ్పడే ఈ పథకం ఆగిపోవడం ఆందోళనకరంగా ఉందన్నారు. జిల్లాలో ఎండ తీవ్రత కారణంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గత రబీలో కరువు కారణంగా పంట నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని కోరారు. ఆంధ్రకేసరి యూనివర్శిటీలో అన్ని కోర్సులతో పాటు హాస్టల్ ఏర్పాటు చేయాలని, ట్రిపుల్‌ఐటీ కాలేజీకి సొంత భవనాలు నిర్మించాలని, మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని చెప్పారు. దోర్నాల గిరిజన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం, ఒంగోలులో ఈఎస్ఐ సూపర్ హాస్పటల్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో మౌలిక సదుపాయాలకల్పనతో పాటు రైల్వే లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సుబాబుల్, జామాయిల్ రైతులను ఆదుకోవాలన్నారు. జిల్లాను వెనుకబడిన జాబితాలో చేర్చి అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజిని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీవీ.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు పాల్గొన్నారు.

పశువుల్లో గర్భకోశవ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● జేడీఏ బేబీరాణి



మందులను అందిస్తున్న జేడీఏ బేబీరాణి

నాగులుప్పలపాడు, జూన్ 26: పశువుల్లో వచ్చే గర్భకోశవ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జేడీఏ బేబీరాణి సూచించారు. అమ్మనబ్రోలు పశు వైద్యశాలలో పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పశువైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. పశువుల్లో గర్భకోశవ్యాధులు సోకడం ద్వారా సకాలంలో ఎదకు రావని, అలాంటి వాటిని సకాలంలో గుర్తించి సమీపంలోని పశువైద్యశాలకు తరలించి చికిత్స అందించాలని ఆమె చెప్పారు. పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారని, తద్వారా సకాలంలో సూడికి వస్తామని పేర్కొన్నారు. పశుసంపదను పెంపొందించుకోవాలని సూచించారు. డీఎల్‌డీఏ కార్యనిర్వహణాధికారి కాలేషా మాట్లాడుతూ పశుపోషకులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 78 పశువులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఉపసంచాలకులు రమేష్‌బాబు, ఏడీఏ నాగభూషణరావు, పశువైద్యులు కృపారావు, జాస్మిన్, జీవీసురేఖ, లావణ్య, పాల్గొన్నారు.

కలెక్టర్‌కు జడ్పీచైర్‌పర్సన్ అభినందన



కలెక్టర్‌ను సత్కరిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 26: బదిలీపై వెళ్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్‌ను బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో పలువురు కలిసి కలెక్టర్‌ను అభినందించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు శాలువతో కలెక్టర్‌ను సత్కరించారు. విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ కలెక్టర్‌ను కలిసి సన్మానించారు.

పొగాకు కేజీ ధర రూ.360

కొండపి, జూన్ 26 : కొండపి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నాణ్యమైన ఎఫ్-1 రకం పొగాకు కేజీ 360 రూపాయల ధర పలికింది. వేలం కేంద్రానికి మండలంలోని నేతివారిపాలెం, జరుగుమల్లి మండలంలోని రామచంద్రాపురం గ్రామాలకు చెందిన రైతులు 921 బేళ్ల వేలానికి తీసుకురాగా వ్యాపారులు 884బేళ్లు కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

డీసీఈబీ కార్యదర్శిగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

ఒంగోలు(విద్య) జూన్ 26 : జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు(డీసీఈబీ) కార్యదర్శిగా జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మర్రిబోయిన శ్రీనివాసరావును నియమిస్తూ డీఈవో డి.సుభద్ర మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలులోని పాత రిమ్స్‌లోని డీసీఈబీ కార్యాలయంలో బుధవారం కార్యదర్శిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును పలువురు ప్రధానోపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పూర్వ కార్యదర్శి వై.వెంకట్రావు పాల్గొన్నారు.

29 నాటికి టీచర్ల సమస్యలు పరిష్కారం : డీఈవో

ఒంగోలు(విద్య), జూన్ 26: ఉపాధ్యాయుల సమస్యలు ఈనెల 29వ తేదీ నాటికి పరిష్కరిస్తామని డీఈవో సుభద్ర తెలిపారు. ఈ మేరకు బుధవారం తనను కలిసిన ప్రతినిధి బృందానికి ఆమె హామీ ఇచ్చారు. భాషాపండితుల సీనియారిటీ జాబితాలు, వివేకానంద విద్యా విహార్ ఇద్దరు టీచర్ల సస్పెన్షన కాలాన్ని రెగ్యులర్ చేసేందుకు కమిషనర్‌కు నివేదిక పంపాలని, అన్ని కేడర్ల సీనియారిటీ జాబితాలు ప్రకటించాలని, కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు వి.జనార్ధనరెడ్డి, డి.శ్రీనివాసులు, బి.రఘుబాబు, కె.తిరుమల, బి.శేషారావు, పి.హనుమంతరావు, ఖాదర్‌బాషా, టీబీ.మల్లికార్జునరావు, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రధాని మోదీని కలిసిన మాగుంట


ప్రధానమంత్రి నరేంద్రమోదీకి బొకే ఇస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 26: ప్రధానమంత్రి నరేంద్రమోదీని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ సభ్యులు బుధవారం ఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయంలో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రధానమంత్రికి బొకే ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి రావాల్సిన నిధుల పాటు పలు అంశాలను పీఎం దృష్టికి తీసుకెళ్లారు. అంతకు ముందు ఎంపీ మాగుంట లోక్‌సభస్పీకర్‌గా ఎన్నికైన ఓంబిర్లాను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

క్వారీలో రాయిపడి కార్మికునికి తీవ్రగాయాలు


సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ దుర్గాప్రసాద్

చీమకుర్తి, జూన్26 : రామతీర్థం సమీపంలో ఉన్న గెలాక్సీ గ్రానైట్‌క్వారీలో పనిచేస్తున్న కార్మికునికి రాయి తగిలి తీవ్రగాయాలయిన సంఘటన బుధవారం జరిగింది. జయ మినరల్స్ క్వారీలో మేట్‌గా పనిచేస్తున్న ఆనంద్‌బాబు అనే కార్మికుడు రోజులాగే బుధవారం సాయంత్రం క్వారీలో తన విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇదే సమయంలో పక్కనే ఉన్న క్వారీలో ముడిరాయి బ్లాస్టింగ్ చేపట్టారు. అక్కడ నుంచి రాయి ఎగిరి వచ్చి ఇక్కడ క్వారీలో ఉన్న ఆనంద్‌బాబు చేతికి బలంగా తగిలింది. దీంతో తీవ్రగాయాలైన ఆనంద్‌బాబును తొలుత ఒంగోలు ప్రైవేటు ఆసుపత్రికి తదుపరి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించారు. సీఐ దుర్గాప్రసాద్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

ఎంఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

చీమకుర్తి ,జూన్26 : ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాల్లో చీమకుర్తి ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారని ప్రిన్సిపాల్ వీవీ.శివారెడ్డి బుధవారం తెలిపారు. ఎంపీసీ విభాగంలో పోకల జయవర్షిణి 470 మార్కులకు 462, బల్లిపల్లి శివాణి 461, శాంబెల్ కిషన్ 460 మార్కులు సాధించి టౌన్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారు. బైపీసీ విభాగంలో ఎం. శ్రీవాణి 440కి 428మార్కులు, సీఈసీ గుంజి రిబ్కా 500కు 458మార్కులు సాధించా రు. వీరిని ప్రిన్సిపాల్ శివారెడ్డి, డైరెక్టర్స్ నాగార్జునరెడ్డి, గోపీకృష్ణారెడ్డి, వెంకారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

బాలికను తల్లిదండ్రులకు అప్పగింత

ఒంగోలు నగరం,జూన్ 26: తెలంగాణ రాష్ట్రంలో బాతులు మేపుకునే వారి వద్ద ఉన్న మైనర్ బాలికను జిల్లాలోని శింగరాయకొండ మండలం సుందర్‌నగర్‌లోని తల్లిదండ్రులకు జిల్లా బాలల సంరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అప్పగించారు. తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా పరిధిలో రెస్క్యూ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు ఓ మైనర్ బాలికను ఆ ప్రాంతంలో బాతులు మేపుకునే వారి వద్ద ఉన్నట్లు గుర్తించారు. సదరు బాలిక వివరాలు తెలుసుకోగా శింగరాయకొండ మండలం సుందర్‌నగర్‌లో తన తల్లిదండ్రులు ఉన్నట్లు తెలుసుకుని ఈ విషయాన్ని జిల్లా బాలల సంక్షేమ కమిటీకి తతెలిపారు. దీంతో సుందర్‌నగర్‌లో జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ వేము రామాంజనేయులు విచారణ జరిపి ఒంగోలు నగరం రామ్‌నగర్‌లో సీడబ్ల్యూసీ కార్యాలయంలో తల్లిదండ్రులకు మైనర్ బాలికను అప్పగించారు.

నిత్యావసర వస్తువుల వితరణ


సరుకులను అందిస్తున్న దాతలు

ఒంగోలు(కల్చరల్), జూన్ 26: ఒంగోలు నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శక్తిసదన్‌కు బుధవారం దాతలు కనపర్తి రాజ్‌కుమార్ సహకారంతో పలురకాల నిత్యావసర వస్తువులను అందజేశారు. సుమారు రూ.12 వేలు విలువైన బియ్యం, కందిపప్పు, చింతపండు, నూనె వంటి వాటిని అందించారు. ఈ సందర్భంగా ఏపీ మహిళాభ్యుదయ సమితి అధ్యక్షురాలు తేళ్ల అరుణ మాట్లాడుతూ నిస్సహాయులకు అండగా నిలిచి సూర్యశ్రీ ఛారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి సర్దార్‌బాషా, నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, తెలుగు మహిళ బీరం అరుణ, జనసేవ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహా సంకల్పానికి ముందడుగు..!

రూ.95 లక్షలతో రైతుబజార్ కాంప్లెక్స్ నిర్మాణం

భూమి పూజ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర


రైతుబజార్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి, జూన్ 26: మహాసంకల్పానికి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ముందడుగు వేశారు. రైతుబజార్ ఏర్పాటుకు కార్యరూపమిచ్చారు. కనిగిరిలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో రూ.95లక్షలతో రైతుబజార్ కాంప్లెక్సు నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా రైతుబజార్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తాను గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కూరగాయల మార్కెట్ నిర్మాణం చేయాలనే సంకల్పం ఉండేదన్నారు. ఇరుకు రోడ్లలో రోడ్లపై ఆడపడుచులు కూర్చుని కూరగాయలు, ఆకుకూరలు అమ్ముకున్న సన్నివేశాలు ఎంతో బాధించేవన్నారు. కనిగిరి మున్సిపాలిటీగా, డివిజన్‌గా రూపాంతరం చెందినప్పటికీ అభివృద్ధిలో ఇంకా వెనుకబడి ఉందన్నారు. ప్రజలందరూ తన సంకల్పాన్ని అర్థం చేసుకోవాలని కోరారు. కూరగాయల మార్కెట్ ఏర్పాటు కావటం వల్ల బొడ్డుచావిడి వద్ద ట్రాఫిక్ సమస్య తీరుతుందన్నారు. అదేవిధంగా ప్రస్తుతం నిర్మాణం కాబోతున్న ప్రాంతంలో రైతుబజార్ ఏర్పాటైతే ప్రజలందరికీ ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. దసరాలోపు రైతుబజార్ నిర్మాణం పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. అదేవిధంగా నగరంలో ట్రాఫిక్ సమస్య ఎంతో జటిలంగా మారిందన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అభివృద్ధి కార్యక్రమాల్లో ఒకటైన కూరగాయల మార్కెట్ 5నెలల్లో పూర్తి చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటానన్నారు. ప్రజలు, వ్యాపారులు, ఫుట్‌పాత్ వ్యాపారులు, తోపుడుబండి వ్యాపారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సమీపంలో ఉన్న అన్నక్యాంటీన్‌ను సందర్శించారు. క్యాంటీన్‌లోని సామగ్రిని పరిశీలించారు. క్యాంటీన్ నిర్వహణకు టీడీపీ పాలనలో వినియోగించిన పాత సామగ్రిని తెప్పించారు. క్యాంటీన్ శుభ్రం చేయించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రామరాజు, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ, ఏఎంసీ చైర్మన్ సాల్మన్‌రాజు, ఏఎంసీ ఆఫీసర్ రవిచంద్ర, టీడీపీ నాయకులు పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, నారపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, షరీఫ్, గుడిపాటి ఖాదర్, సద్గురు, ఐవీ.నారాయణ పాల్గొన్నారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

- ఆరుగురు నిందితుల అరెస్టు
- ఎస్ఈబీ ఈఎస్ రవికుమార్ వెల్లడి


మాట్లాడుతున్న రవికుమార్

ఒంగోలు(క్రైం)/చీమకుర్తి, జూన్ 26: రెండు కిలోలు గంజాయిని స్వాధీనం చేసుకొని ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ ఈఎస్ రవికుమార్ తెలిపారు. బుధవారం ఒంగోలులోని ఎస్ఈబీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చీమకుర్తి మండలం మర్రిచెట్లపాలెంలోని బండారు ఏసురత్తమ్మ ఇంటిపై దాడి చేసి రెండు కిలోలు గంజాయి, ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు. ఒడిశాకు చెందిన ఏస్తేరమ్మ భర్త దీపక్‌కుమార్‌మాలిక్ రెండు నెలల క్రితం ఒడిశాలోని బాద్రక్ జిల్లా తిడి మండలం దాపానియా గ్రామం నుంచి రెండు కిలోల గంజాయి తెచ్చి మరిచెట్లపాలెంలో దాచిపెట్టాడు. బుధవారం ఉదయం గంజాయిని చిన్నచిన్న పొట్లాలుగా కట్టి గ్రానైట్ క్వారీలలో పనిచేసే వారికి విక్రయించేందుకు సిద్ధం అవుతుండగా దాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అరెస్టు అయిన వారిలో దీపక్‌కుమార్‌మాలిక్, ఆయన భార్య ఏస్తేరమ్మ, నాగులూరి కోటయ్య, గురునాథం ఏలీషా, గురునాథంమోసా, పోలా నందు అలియాస్ ఆనందరావు ఉన్నారని ఈఎస్ రవికుమార్ వివరించారు.

ఓటు వేసేందుకు వెళ్లి మళ్లీ రాలేదు..!

- భర్త అదృశ్యంపై యువతి ఆందోళన


ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధితురాలు అనామిక

ఒంగోలు(క్రైం), జూన్ 26: తనతో మూడేళ్ళు కాపురం చేసి ఓటు వేసి వస్తానని తన స్వగ్రామం వెళ్ళి తరవాత కనిపించడం లేదని ఓ యువతి ఆదోళనకు దిగింది. స్థానిక ప్రకాశంభవన్ వద్ద రోడ్డుపై బైఠాయించింది. వివరాలలోకి వెళితే.. వినుకొండ మండలం వెల్లటూరికు చెందిన చప్పిడి నాని, ప్రస్తుతం ఒంగోలులోని దేవుడుచెరువులో నివాసం ఉండే అనామిక మూడేళ్ళ క్రితం ప్రేమ వివాహం చేసుకున్నట్లు బాధితురాలు చెబుతున్నారు. స్థానిక జక్రయ్యనగర్ చర్చిలో వివాహం అయిదని, అప్పటి నుంచి కలిసి జీవిస్తున్నామని పేర్కొన్నారు. గత నెల 11న ఎన్నికల సందర్భంగా ఓటు వేసి వస్తానని వినుకొండకు తన భర్త నాని వెళ్ళాడని, అప్పటి నుంచి తిరిగి తన వద్దకు రాలేదని వాపోయారు. అయితే నానికి ఫోన్ చేయగా ఆయన మేనమామ రాజేష్ మాట్లాడుతూ నీ భర్త ఇక నీ దగ్గరకు రాడని సమాధానం చెప్పాడని, దీంతో తన భర్త ఏమయ్యాడనే ఆందోళనగా ఉందని అనామిక వాపోయారు. అంతేగాకుండా తన భర్తను తనతో కాపురం చేయకుండా నాని బంధువులు అడ్డుపడుతున్నారని తెలిపారు. ఈ విషయంలో న్యాయం చేయాలని కోరేరు. దీంతో రోడ్డుపై బైఠాయించిన అనామికతో పాటుగా ఆమె బంధువులను పోలీసులు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు.

బాధ్యతతో విధులు నిర్వర్తించాలి : కలెక్టర్


ఉద్యోగ నియామకపత్రాలను ఇస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 26 : బాధ్యతతో విధులు నిర్వర్తించి పనిచేస్తున్న శాఖకు మంచి పేరు తీసుకరావాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వశాఖల్లో విధులు నిర్వర్తిస్తూ మరణించిన వారి కుటుంబసభ్యులకు బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కారుణ్య నియామకాల కింద 16మందికి ఆయన ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తమకు కేటాయించిన శాఖల్లో అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలత, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, సూపరింటెండెంట్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

శిలాఫలకం ఆవిష్కరణ

జిల్లాపరిపాలనా కేంద్రమైన ప్రకాశం భవనంలో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునికీకరణ పనులు చేపట్టినట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. అందుకు సంబంధించిన శిలాఫలకాన్ని బుధవారం కలెక్టరేట్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ దృష్ట్యా ప్రకాశం భవనానికి వచ్చే సందర్శకులు, ప్రజల సంఖ్య తగ్గినందున గ్రానైట్‌తో ఫ్లోరింగ్, విద్యుత్ వైర్ల మార్పిడి, మెట్ల రైలింగ్, ల్యాండింగ్, రంగులు వేసే పనులు, వివిధ సెక్షన్ సూపరింటెండెంట్ల చాంబర్ల మరమ్మతు పనులు చేపట్టామన్నారు. ఆయా పనులు దాదాపుగా పూర్తయినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో ఆర్.శ్రీలత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుమలనాథస్వామి రథోత్సవం



స్వామివారి రథాన్ని లాగుతున్న భక్తులు, అలరించిన మహిళల కోలాటం

పెద్దారవీడు(మార్కాపురం), జూన్ 26: మండలంలోని రాజంపల్లిలో గొబ్బాలికొండపై వెలసిన శ్రీతిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. స్వామివారి మూలవిరాట్‌ను ఆలయ ప్రధానార్చకులు భవానీప్రసాద్ ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితులు అభిషేకం, మహాన్యాసం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను రథంపై ఏర్పాటు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకునేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులను భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మహిళల కోలాటాలు, చిన్నారుల నృత్యాలను ఆకర్షించాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సీఐ రాములూనాయక్, ఎస్సై వెంకటసైదులు ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టారు.

హోరాహోరీగా ఎడ్ల బలప్రదర్శన


బండను లాగుతున్న ఎడ్ల జత

బ్రహ్మోత్సవాల సందర్భంగా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులుగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నారు. మూడవ రోజు బుధవారం సీనియర్ విభాగంలో పోటీలు నిర్వహించారు. గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం కాపురావూరుకు చెందిన తోటా శ్రీనివాసరావుకు చెందిన ఎండ్ల జత రూ. 70వేల ప్రథమ బహుమతిని, నంద్యాల జిల్లా ఈవెళ మండలం గుంపరుమనుదిన్నెకు చెందిన కుందురు రాంభూపాల్‌రెడ్డికి చెందిన ఎడ్ల జత రూ.50వేల ద్వితీయ బహుమతిని, గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం కాపురావూరు చెందిన తోటా శ్రీనివాసరావుకు చెందిన ఎడ్ల జత రూ.30వేల తృతీయ బహుమతిని, పెద్దారవీడు మండలం కలనూతలకు చెందిన కటికల జస్వంత్‌కు చెందిన ఎడ్ల జత రూ.20వేల చతుర్థ బహుమతిని, రాచర్ల మండలం జె.పి.చెరువుకు చెందిన బొర్ర రవితేజ ఎడ్ల జత రూ.10 ఐదవ బహుమతిని గెలుచుకొంది. కమిటీ ప్రతినిధులు బహుమతులు అందజేశారు.

హత్య కేసులో నిందితుడికి జీవత ఖైదు

మార్కాపురం, జూన్ 26: మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని స్వయానా అక్క భర్తను కత్తితో పొడిచి హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు విధిస్తూ బుధవారం మార్కాపురం ఆరవ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.శుభవాణి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు, అర్థవీడు మండలం పాపినేనిపల్లి గ్రామానికి చెందిన ఆలమూరి సుబ్బమ్మ, ఆమె భర్త రమణయ్యలు అదే గ్రామంలో ఆమె నాయనమ్మ కర్మకాండలకు హాజరయ్యారు. 2017 ఫిబ్రవరి 27వ తేదీన కర్మకాండ కార్యక్రమాలు జరుగుతుండగా సుబ్బమ్మ సోదరుడు పోలేపల్లి శ్రీనివాసులు బావ రమణయ్యను మద్యానికి డబ్బులు అడిగాడు. ఇప్పటికే ఫూటుగా మద్యం సేవించి ఉన్న శ్రీనివాసులుకు డబ్బులు ఇవ్వనని రమణయ్య గట్టిగా చెప్పాడు. దీంతో కోపోద్రిక్తుడైన శ్రీనివాసులు మద్యం మత్తులో బావ అని కూడా చూడకుండా కత్తితో కడుపులో పొడిచాడు. అక్కడ ఉన్న బంధువులు వెంటనే రమణయ్యను 108 వాహనంలో వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఈ మేరకు రమణయ్య భార్య సుబ్బమ్మ అర్థవీడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై జి.కోటయ్య కేసు నమోదు చేసుకున్నారు.

ఈ కేసులో సాక్షులను విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావడంతో దోషి శ్రీనివాసులకు యావజ్జీవ ఖైదుతోపాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.బాలునాయక్ వాదించారు.

వామ్మో..చిరుతపులి..!

దేవనగరం పరిసరాల్లో సంచారం ● హడలిపోయిన ప్రజలు

గుంతలో పడడంతో అక్కడే బంధించిన అధికారులు

గిద్దలూరు టౌన్, జూన్ 26 : గిద్దలూరు మండలంలోని దేవనగరం గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం చిరుతపులి సంచారం భయాందోళనలు రేకెత్తించింది. ప్రజలు దాన్ని చూసి హడలిపోయారు. అయితే చిరుతపులి అకస్మాత్తుగా గ్రామ సమీపంలోని ఓ గుంతలో పడిపోయింది. దీంతో స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అయితే చీకటి పడడంతో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించేందుకు అటవీశాఖ సిబ్బందికి ఇబ్బందులు ఎదురయ్యాయి. రాత్రి వేళ దానిని బయటకు తీయకుండా గుంతలో నుంచి బయటకు వెళ్లకుండా వలతో కట్టుదిట్టంగా కంచె ఏర్పాటు చేశారు. చిరుతపులిని రక్షించి అడవిలో విడిచి పెట్టేందుకు వీలుగా తిరుపతి నుంచి గురువారం ఉదయం ప్రత్యేక రెస్క్యూ టీంను తీసుకొస్తున్నట్లు స్థానిక అటవీశాఖ అధికారులు తెలిపారు. మొత్తం మీద చిరుత గుంతలో పడడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. రెండు రోజులక్రితం గిద్దలూరు-నంద్యాల మధ్యలోని నంద్యాల అటవీ ప్రాంతంలో వంటచెరకు తెచ్చుకొనేందుకు పచ్చర్ల సమీపంలో అడవిలోకి వెళ్లిన మహిళపై చిరుత దాడి చేసి చంపిన విషయం విదితమే. గుంతలో చిక్కుకున్నది ఆ చిరుతేనా? అన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

పామూరులో చోరీ

పామూరు, జూన్ 26 : పామూరు జాతీయ రహదారి వెంబడి ఉన్న ఇంటిలో ఎవరూలేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు బీరువా తాళాలు పగులకొట్టి బంగారం, వెండి, నగదును దోచుకొని పోయిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు రంజాన్‌బి తెలిపిన వివరాల ప్రకారం.. తన భర్త ఉద్యోగ రీత్యా బెంగళూరులో ఉంటున్నారని, సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి తాను పుట్టింటికి వెళ్లానని ఆమె తెలిపారు. బుధవారం ఉదయం తమ మామగారు పెద్దఖాసీం వచ్చి ఇంటిని పరిశీలించగా మెయిన్‌డోరు, పక్కనున్న కిటికీ అద్దాలు పగులకొట్టి ఉండటాన్ని గుర్తించారని, డోరు తీసి లోపలికివెళ్లి చూడగా ఇంటిలోని సామాను అంతా చిందరవందంగా పడి ఉండటంతో ఫోన్ చేయగా వచ్చి చూశానని తెలిపారు. ఇంటిలో దాచిన రూ.95వేల నగదు, బీరువాలోని 40 గ్రాముల బంగారు చైన్, 3 ఉంగరాలు, 1,130 గ్రాముల వెండి వస్తువులతోపాటు సీసీ కెమెరాలు చోరీ చేశారని వాపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్‌టీం సభ్యులు వచ్చి వేలిముద్రలు సేకరించారు.

29న ఒంగోలులో జాబ్‌మేళా

ఒంగోలునగరం, జూన్ 26: ఒంగోలులోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 29వ తేదీన జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఉపాధికల్పనాధికారి టి.భరద్వాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జ్యోతిగ్రూపు ఆఫ్ కంపెనీస్, స్టాఫ్ క్లౌడ్ సొల్యూషన్స్ కంపెనీ, ఎస్‌పీపీ ఆపరేటర్, డిస్ట్రిబ్యూటర్ ఆపరేటర్లు, మిక్సర్ ఆపరేటర్లు, ప్రెస్ అండ్ ఓపెన్ ఆపరేటర్లు, సహాయకులు, బ్యాంకింగ్ బిజినెస్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు, సూపర్‌వైజర్లు, డెలివరీ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి చేయటకు ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏదైనా విభాగంలో ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, ఎంబీఏ పూర్తి చేసిన వారు ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందన్నారు. ఎంపికైన వారికి నెలకు వేతనం రూ.13వేల నుంచి రూ.15వేల వరకు ఉంటుందని తెలిపారు. 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 08592-281776 నంబర్‌ను కార్యాలయం పనివేళాల్లో సంప్రదించాలని ఆయన కోరారు.

స్వయంఉపాధి యూనిట్లను విజయంతంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న మేనేజర్ రమేష్‌దేవ

కొత్తపట్నం(ఒంగోలు నగరం) జూన్ 26: మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు తగిన శిక్షణ తీసుకుని యూనిట్లను విజయవంతంగా నిర్వహించి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని లీడ్‌బ్యాంకు డిస్ట్రిక్టు మేనేజర్ రమేష్‌దేవ పేర్కొన్నారు. ఈతముక్కలలో బుధవారం జరిగిన మహిళా స్వయం సంఘాల సభ్యుల శిక్షణ ముగింపు సభలో ఆయన మాట్లాడారు. నాబార్డు ఆర్థికసహాయంతో ప్రేరణ స్వచ్ఛందసంస్థ మాంసాహార పచ్చళ్ళ తయారీ విధానంపై ఇస్తున్న శిక్షణ బుధవారంతో ముగిసింది. నాణ్యమైన పచ్చళ్ళ తయారీ, రుణాలు పొందటం, యూనిట్ స్థాపనకు అనుమతులు పొందటం వంటి అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం రవికుమార్, ప్రేరణ సంస్థ సీఈవో నాగలక్ష్మి, రూడ్‌సెట్ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తెల్లవారకముందే బార్లు బార్లా..!

- నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు
- వైసీపీ హయంలోని ఆనవాయితీని కొనసాగిస్తున్న ఎస్ఈబీ అధికారులు



కంభంరోడ్డులోని బార్ అండ్ రెస్టారెంట్‌లో ఉదయం 6.30 గంటలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్

మార్కాపురం, జూన్ 26: మార్కాపురంలో తెల్లవారితే పాలపాకెట్ల కోసం వెతుక్కోవాలేమో కానీ మద్యం మాత్రం పుష్కలంగా దొరుకుతుంది. ప్రజలకు నిత్యవసర వస్తువు గా మద్యం మారినట్లు బార్‌అండ్ రెస్టారెంటు యజమానులు కొందరు ప్రభుత్వ నిబంధనలంటూనే విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. గతంలో ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకూ అధికారికంగా, రాత్రి 11 నుంచి ఉదయం 10 వరకూ రహస్యంగా మద్యం విక్రయాలు జరుగు తుండేవి. కానీ ఐదేళ్ల వైసీపీ పాలనలో మద్యం విక్రయా లకు విధి విధానాలు మారాయి. ప్రైవేటు మద్యం దుకాణాల స్థానంలో ప్రభుత్వ దుకాణాలు వచ్చాయి. ఆయా దుకాణాల లో మద్య విక్రయాలకు నిబంధనలను తూ.చ తప్పక అమలు చేస్తున్న ఎస్ఈబీ అధికారులు ప్రైవేటు బార్ అండ్ రెస్టారెంట్ల విషయంలో ఓ సెటిల్‌మెంట్‌కు వచ్చారు..! దీంతో వైసీపీ హయాంలో ఉన్న ఆనవాయితీనే ఇప్పుడు కొనసాగిస్తుండడం గమనార్హం.

తెల్లారకముందు నుంచే...

మార్కాపురం తెల్లవారు జామున 4 గంటల నుంచే బార్ అండ్ రెస్టారెంట్ల కౌంటర్లలో మద్యం విక్రయాలు ప్రారంభమౌతున్నాయి. ముఖ్యంగా కంభం రోడ్డులోని ఓ రెస్టారెంటులో ప్రధాన కౌంటర్‌కు తాళం వేసి కిచెన్ వద్ద ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి విక్రయాలు చేస్తున్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న ఓ బార్‌అండ్ రెస్టారెంటులో ప్రధాన కౌంటర్‌లోనే విక్రయాలు సాగిస్తున్నారు. అక్కడ ప్రధాన వాకిలికి మాత్రం తాళం వేసి ఉంచుతారు. పక్కనే ఉన్న చిన్నగేటు నుంచి మద్యంప్రియులు వెళ్లి సేదతీరుతున్నారు. ఇలా ఒకటేమిటి మార్కాపురంలోని అన్నీ బార్లలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

లంచాల మత్తులో ఎస్ఈబీ అధికారులు

మద్యం అక్రమ విక్రయాలు, నిబంధనల మేరకు బార్లు, రెస్టారెంట్ల నిర్వహణ, మద్యం సరఫరా వంటి వాటిని నియంత్రించాల్సిన ఎస్ఈబీ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో మద్యం దుకా ణాల ఏర్పాటుతో అసలే తమ లంచాల రూపంలో వచ్చే ఆదాయం తగ్గిందని, బార్ల జోలికి వెళ్తే అసలేం ఉండదనే భావనలో ఎస్ఈబీ అధికారులు ఖీఉన్నట్లు సమాచారం. దీనికి తోడు వైసీపీ పాలనాకాలంలో రాజకీయ నాయకుల ఒత్తిడి కూడా వారిని ఆవైపు కన్నెత్తి చూడకుండా చేసింద నే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇకనైనా ఎస్ఈబీ అధికారులు స్వలాభేపేక్షను విడిచి వారి ఉద్యోగం వారు స్వేచ్ఛగా చేస్తే తప్ప వ్యవస్థలో వారికున్న చెడ్డ పేరు తొలగిపోదనేది



ఉదయం 7 గంటలకే అడ్డదారిలో మద్యం విక్రయాలు

అవీ..ఇవీ..

ఉచిత వాటర్ ప్లాంట్ ప్రారంభం



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న బాబురావు

బేస్తవారపేట,జూన్26:బేస్తవారపేట మండలంలోని జేసీ.అగ్రహారంలో రిలయన్స్ సంస్థ జిల్లా మేనేజర్ వెంకటబాబురావు బుధవారం గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభించారు. ఏకం సంస్థ అమెరికా ఆర్థిక సహకారంతో పీజీఎస్ఎఫ్ ఎఫర్ట్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శుద్ధి జలకేంద్రాన్ని జేసీ అగ్రహారంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలో ఫ్లోరిన్ సమస్య ఉందని, సంస్థ పెద్దలకు పెద్దలకు సమాచారం పంపంగా వారు గ్రామంలో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశారన్నారు. సంస్థ డైరెక్టర్ జేవీ.మోహన్‌రావు మాట్లాడుతూ గ్రామస్థులు ఫ్లోరిన్ బారిన పడకుండా నాణ్యమైన నీటిని తాగాలన్నారు.

వామ్మో.. చిరుతపులి

- దేవనగరం పరిసరాల్లో సంచారం
- హడలిపోయిన ప్రజలు
- గుంతలో పడడంతో అక్కడే బంధించిన అధికారులు

గిద్దలూరు టౌన్, జూన్ 26 : ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలంలోని దేవనగరం గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం చిరుతపులి సంచారం భయాందోళనలు రేకెత్తించింది. ప్రజలు దాన్ని చూసి హడలిపోయారు. అయితే చిరుతపులి అకస్మాత్తుగా గ్రామ సమీపంలోని ఓ గుంతలో పడిపోయింది. దీంతో స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అయితే చీకటి పడడంతో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించేందుకు అటవీశాఖ సిబ్బందికి ఇబ్బందులు ఎదురయ్యాయి. రాత్రివేళ దానిని బయటకు తీయకుండా గుంతలో నుంచి బయటకు వెళ్లకుండా వలతో కట్టుదిట్టంగా కంచె ఏర్పాటు చేశారు. చిరుతపులిని రక్షించి అడవిలో విడిచి పెట్టేందుకు వీలుగా తిరుపతి నుంచి గురువారం ఉదయం ప్రత్యేక రెస్క్యూ టీంను తీసుకొస్తున్నట్లు స్థానిక అటవీశాఖ అధికారులు తెలిపారు. మొత్తం మీద చిరుత గుంతలో పడడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. రెండు రోజులక్రితం గిద్దలూరు-నంద్యాల మధ్యలోని నంద్యాల అటవీ ప్రాంతంలో వంటచెరకు తెచ్చుకొనేందుకు పచ్చర్ల సమీపంలో అడవిలోకి వెళ్లిన మహిళపై చిరుత దాడి చేసి చంపిన విషయం విదితమే. గుంతలో చిక్కుకున్నది ఆ చిరుతేనా? అన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

పాఠశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కంభం, జూన్ 26 : కంభం పట్టణంలోని నాయక్ వీధిలోని మండ ల పరిషత్ ఉర్దూ పాఠ శాల విద్యార్థులకు విద్యా కమిటీ చైర్మన్ షేక్ ఖాశింపీరా బుధవారం పాఠ్యపుస్తకాలను, సంచు లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రుక్సాన, ప్రధానోపాధ్యాయురాలు సాహెరాబేగం, రహమున్నీసాబేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

దోర్నాలలో ఉచిత కంటి వైద్యశిబిరం

పెద్ద దోర్నాల, జూన్ 26: దోర్నాలలోని శివ సదన్‌లో ముస్లిం మైనార్టీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో నంద్యాలకు చెందిన శాంతిరామ్ వైద్యశాల వైద్య సిబ్బంది 180 మంది రోగులను పరీక్షించి 70 మందిని శస్త్రచికిత్సలకు సిఫారసు చేశారు. వీరిని వైద్యశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన వాహనంలో నంద్యాలకు తరలించి శస్త్రచికిత్సల అనంతరం తిరిగి దోర్నాలకు తీసుకు వస్తార న్నారు. కార్యక్రమంలో నాయకులు పూలబాబు, బాష పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు బానిస కాకూడదు



మాట్లాడుతున్న న్యాయవాది ఉషశ్రీ

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 26: యువత చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని న్యాయవాది ఆకుల ఉషశ్రీ అన్నారు. స్థానిక సిద్ధార్థ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూల్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం విద్యార్థులకు మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ఆశలను విద్యార్థులు వమ్ము చేయకుండా చదువుమీదనే దృష్టి సారించాలన్నారు. చెడువ్యసనాలు యువత జీవితాన్ని నాశనం చేస్తాయన్నారు. ఆ మత్తులో విచక్షణ కోల్పోయి ఉన్మాదులుగా మారుతారన్నారు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు సమాజం నుంచి వారు దూరం కావాల్సి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో అనర్థాలు



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పొదిలి : డ్రగ్స్ వలన ఎన్నో అనర్థాలు ఉంటాయని సెబ్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరయ్య అన్నారు. బుధవారం ఇంటర్నేషనల్ యాంటీ డ్రగ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులతో మానవహారం నిర్వహించి డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు, ఇబ్బందులను వివరించి ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. దానివలన అనర్థాలే కాకుండా కుంటుబాలను చిన్నాభిన్నం చేస్తాయని చెప్పారు. కనుక వాటికి దూరంగా ఉండి కుటుంబాలతో సంతోషంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానోపాధ్యాయురాలు తారావాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుమలనాథస్వామి రథోత్సవం

పెద్దారవీడు(మార్కాపురం), జూన్ 26: మండలంలోని రాజంపల్లిలో గొబ్రాలి కొండపై వెలసిన శ్రీ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. స్వామి వారి మూల విరాట్‌ను ఆలయ ప్రధానార్చకులు భవానీ ప్రసాద్ ప్రత్యేకంగా అలంకరించారు. వేద పండితులు అభిషేకం, మహాన్యాసం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను రథంపై ఏర్పాటు చేసి గ్రామోత్సవం నిర్వహిం చారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకునేందుకు ఉభయ తెలుగురాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులను భారీ ఎత్తున అన్న దాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మహిళల కోలాటాలు, చిన్నారుల నృత్యాలను ఆకర్షించాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుం డా సీఐ రాములూనాయక్, ఎస్సై వెంకట సైదులు ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టారు.





విశేష అలంకరణలో స్వామివారు, రథోత్సవం

హోరాహోరీగా ఎడ్ల బలప్రదర్శన

బ్రహ్మోత్సవాల సందర్భంగా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులుగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నారు. మూడవ రోజు బుధవారం సీనియర్ విభాగంలో పోటీలు నిర్వహించారు. గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం కాపురావూరుకు చెందిన తోటా శ్రీనివాసరావుకు చెందిన ఎండ్ల జత రూ. 70వేల ప్రథమ బహుమతిని, నంద్యాల జిల్లా ఈవెళ మండలం గుంపరుమనుదిన్నెకు చెందిన కుందు రు రాంభూపాల్‌రెడ్డికి చెందిన ఎడ్ల జత రూ.50వేల ద్వితీయ బహుమతిని, గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం కాపురావూరు చెందిన తోటా శ్రీనివాసరావుకు చెందిన ఎడ్ల జత రూ.30వేల తృతీయ బహుమతిని, ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం కలనూతలకు చెందిన కటికల జస్వంత్‌కు చెందిన ఎడ్ల జత రూ.20వేల చతుర్ధ బహుమతిని, రాచర్ల మండలం జె.పి.చెరువుకు చెందిన బొర్ర రవితేజ ఎడ్ల జత రూ.10 ఐదవ బహుమతిని గెలుచుకొంది. కమిటీ ప్రతినిధులు బహుమతులు అందజేశారు.







అలరించిన మహిళల కోలాటం, బారులు తీరిన భక్తులు, బండను లాగుతున్న ఎడ్ల జత

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

గిద్దలూరు, జూన్ 26 : 'అమ్మ కోసం ఒక్క చెట్టు' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని శ్రీ పాతాళనాగేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్కనైనా నాటి అది పెరిగేందుకు కృషి చేస్తే వాతావరణ సమతుల్యం ఏర్పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పిడతల సరస్వతి, కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్‌రెడ్డి, మేథోకమిటీ సభ్యులు రెడ్డి మల్లారెడ్డి, ఓబీసీ మోర్చ నాయకులు దూదేకుల బాదుల్లా, కొప్పుల నరసింహులు, అంజనేయులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు



బాదం శేఖర్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు : ప్రజాస్వామ్యానికి చీకటి రోజులైన ఎమర్జన్సీ కాలంలో జైలుకు వెళ్లిన బాదం శేఖర్‌ను స్థానిక బీజేపీ నాయకులు సన్మానించారు. నాడు కాంగ్రెస్ పార్టీ విధించి ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పనిచేసిన బాదంశేఖర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్య క్షులు బీవీ.రామాంజనేయులు, పట్టణశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్ శంకర్, ప్రచారకమిటీ కన్వీనర్ రాచర్ల కాసులు, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన

గిద్దలూరు టౌన్, జూన్ 26 : మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా స్థానిక సబ్ జైలులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ న్యాయాధికారి ఓంకార్ మాట్లాడుతూ మత్తుపదార్థాలు సేవించడం ద్వారా శరీరంపై ఆలోచనశక్తిని, పట్టును కోల్పోతారని, ఏమి చేస్తున్నామో తెలియని స్థితికి చేరుకుంటామన్నారు. అలాంటపుడు నేరాలకు కూడా పాల్పడతారన్నారు. కావున వాటి జోలికి వెళ్ల వద్దని హితవు చెప్పారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయవాది పిచ్చయ్యయాదవ్, సబ్‌జైలు సూపరింటెండెంట్ లింగారెడ్డి, పారాలీగల్ వలంటీర్ మధుసూదన్‌రావు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల ర్యాలీ

గిద్దలూరుటౌన్, జూన్ 26 : అంతర్జాతీయ డ్రగ్స్ నిరోధక దినోత్సవం సందర్భంగా పట్టణంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. డ్రగ్స్ వాడకూడదని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ కొండారెడ్డి, రూరల్ సీఐ దాసరి ప్రసాద్, ఎస్సై వెంకటేశ్వరరావు, ఏఎస్సై రంగయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన మిరపనారు అందించాలి

- ఉద్యాన శాఖ అధికారి రమేష్

కొనకనమిట్ల, జూన్ 26 : రైతులకు షేడ్ నర్సరీలలో నాణ్యమైన విత్తనాలతో మిరపనారు అందించాలని మార్కాపురం ఉద్యానవనశాఖ అధికారి రమేష్ అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో షేడ్ నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో ఆయన మాట్లాడారు. నాణ్యమైన నారు పెంచేందుకు ముందుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గుర్తింపు పొందిన కంపెనీలకు చెందిన విత్తనాలను మాత్రమే నారు పెంచాలన్నారు. అదేవిదంగా నూతన షెడ్లు ఏర్పాటు చేసుకొనే నర్సరీలను తప్పనిసరిగా రిజిస్టేషన్ చేయించుకోలన్నారు. రిజిస్టేషన్ లేని కొన్ని నర్సరీలకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. మిరపనారు నాణ్యతలో లోపంవస్తే అటువంటి నర్సరీలపై తగచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హత్య కేసులో నిందితుడికి జీవత ఖైదు

మార్కాపురం, జూన్ 26: మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని స్వయానా అక్క భర్తను కత్తితో పొడిచి హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు విధిస్తూ బుధవారం మార్కాపురం ఆరవ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.శుభవాణి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు అర్ధవీడు మండలం పాపినేనిపల్లి గ్రామానికి చెందిన ఆలమూరి సుబ్బమ్మ, ఆమె భర్త రమణయ్యలు అదే గ్రామంలో ఆమె నాయనమ్మ కర్మకాండలకు హాజరయ్యారు. 2017 ఫిబ్రవరి 27వ తేదీన కర్మకాండాల కార్యక్రమాలు జరుగుతుండగా సుబ్బమ్మ సోదరుడు పోలేపల్లి శ్రీనివాసులు బావ రమణయ్యను మద్యానికి డబ్బులు అడిగాడు. ఇప్పటికే పూటుగా మద్యం సేవించి ఉన్న శ్రీనివాసులకు నేను నీకు డబ్బులు ఇవ్వనని రమణయ్య గట్టిగా చెప్పాడు. దీంతో కోపోద్రిక్తుడైన శ్రీనివాసులు మద్యం మత్తులో బావ అని కూడా చూడకుండా కత్తితో కడుపులో పొడిచాడు. అక్కడ ఉన్న బంధువులు వెంటనే రమణయ్యను 108 వాహనంలో వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఈ మేరకు రమణయ్య భార్య సుబ్బమ్మ అర్ధవీడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై జి.కోటయ్య కేసు నమోదు చేసుకున్నారు. కేసులో సాక్షులను విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావడంతో దోషి శ్రీనివాసులకు యావజ్జీవ ఖైదుతోపాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.బాలునాయక్ వాదించారు.

వైభవంగా వేంకటేశ్వరుని పుష్పయాగం

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 26: బ్రహ్మోత్సవాలలో భాగంగా స్థానిక శివాజీ నగర్‌లో వెలసిన ప్రసన్న వేంకటేశ్వరుడి ఆలయంలో బుధవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అశ్వవాహనం, మహాపూర్ణాహుతి, శ్రీచక్రస్నానం, శ్రీపుష్పయాగం, స్నపన తిరుమంజనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

హైవోల్టేజీతో కాలిపోయిన గృహోపకరణాలు

గిద్దలూరు, జూ న్ 26 : రాచర్ల లోని బీసీ కాలనీ చివరి బజారులో విద్యుత్ హైవోల్టే జీతో పలు ఇళ్లలోని గృహోప కరణాలు కాలి పోయాయి. వేల్పు ల గోపాల్ గృహంలోని ఫ్రిడ్జ్, ఫ్యాన్లు, ఇంట్లోని సామాగ్రి హైవోల్టేజ్‌తో వచ్చిన మంటలతో కాలిపోగా ఇదే వీధిలోని పలు ఇళ్లలో ఫ్యాన్లు, కూలర్లు, లైట్లు కాలిపోయి నష్టపోయారు. హైవోల్టేజ్‌తో మంటలు చెలరేగడంతో వెంటనే విద్యుత్‌ను ఆపి స్థానికులు మంటలను అదుపులోకి తెచ్చారు. విలేజ్ రెవెన్యూ అధికారి శివయ్య ఏఎస్సై ఆదిశేషు విద్యుత్ శాఖాధికారులు కాలిపోయిన గృహోపకరణాలను పరిశీలించారు.

సర్పంచిగా మారునిబాయికి బాధ్యతలు

పుల్లలచెరువు, జూన్ 26: అనారోగ్య కారణాలతో సెలవు పెట్టిన ఐటివరం సర్పంచి బాణావత్ మారునిబాయికి సర్పంచి బాధ్యతలు ఇస్తూ జిల్లా పంచాయతీ అధికారి టి.ఉషారాణి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం ఆర్యోగంగా వుండంతో ఆమె సెలవును రద్దు చేసుకోవడంతో సర్పంచి బాధ్యతలు తిరిగి అప్పగించారు. ఉత్తర్వులు ఎంపీడీవో కార్యాలయానికి జిల్లా అధికారులు పంపించారు. రేపు సర్పంచిగా తిరిగి ఆమె విధుల్లో చేరనున్నారు.

గణపవరం వాసికి డాక్టరేట్

త్రిపురాంతకం, జూన్ 26: మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన మాకం చౌడయ్య ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డాక్టరేట్ అందుకున్నాడు. ప్రొఫెసర్ పి.జాన్సన్ కో గైడ్ డాక్టర్ జీపీ.రాజు పర్యవేక్షణలో ఎఫెక్ట్ ఆఫ్ ఎబిలిటీ డ్రిల్స్, స్పీడ్ రెసిస్టెన్స్ ట్రైనింగ్ ఇన్ కాంబినేషన్ విత్ ఎండ్యూరెన్స్ రన్ ఆన్ సెలెక్టెడ్ మోటార్ పిజియోలాజికల్, ప్లేయింగ్ ఎబిలిటీస్ పారామీటర్స్ ఆఫ్ ట్రైబల్ ఖో-ఖో ప్లేయర్స్ అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినట్లు రీసెర్చ్ కోఆర్డినేటర్ పి.కిరణ్మయి తెలిపారు. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయంలో డాక్టరేట్‌ను ప్రధానం చేశారు.

కిరాతక ఉపాధ్యాయుడి సస్పెండ్

కంభం, జూన్ 26 : దత్తతకు తీసుకున్న కుమార్తెను కిరాతకంగా కత్తితో గొంతు కోసిన దత్తత తండ్రి, ప్రభుత్వ ఉపాధ్యాయుడైన పుచ్చకాయల రమణరెడ్డిని సస్పెండ్ చేసినట్లు అర్ధవీడు ఎంఈవో అబ్దుల్‌సత్తార్ బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వుల మేరకు సస్పెండ్ ఉత్తర్వులు అమలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రమణారెడ్డి, ఆయన భార్య జైలులో ఉన్నారు.



ఆర్అండ్‌బీ మంత్రి జనార్దన్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలుపుతున్న డాక్టర్ లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే పాపారావు

మంత్రులను కలిసిన డాక్టర్ లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులు

దర్శి జూన్ 26 : రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడులను బుధవారం టీడీపీ దర్శి నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఆమె భర్త డాక్టర్ లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దర్శి నియోజకవర్గంలో అనేక రోడ్లు అధ్వానంగా మారాయని అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని మంత్రి జనార్దన్‌రెడ్డిని డాక్టర్ లక్ష్మి కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. అంచనాలు తయారు చేసి పంపాలని, వీలైనంత త్వరలో నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. అంతకముందు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామిని కలిసి అభినందనలు తెలిపారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న డాక్టర్ కృష్ణచైతన్య

పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం

కనిగిరి, జూన్ 26: ప్రముఖ గుండె వైద్య నిపుణులు కృష్ణచైతన్య బుధవారం పేద విద్యార్థికి ఆర్థిక సహాయం అందించారు. నియోజకవర్గంలోని పీసీపల్లి మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన గుండాబత్తుని రమణమ్మ, కొండలుకు చెందిన పూరి గుడిసె కాలిపోయింది. దీంతో వారి కుటుంబం నిరాశ్రయులయ్యారు. వారి కుమార్తె లావణ్య 10వ తరగతిలో మంచి ఫలితాలు సాధించింది. విద్యార్థిని తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉండటంతో ఆయా గ్రామస్థులు మదర్‌సేవాసమితి దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థిని విజేత ఐటీలో ఉచితంగా సీటు ఇప్పించటంతోపాటు విద్యార్థిని చదువుకు అయ్యే ఖర్చును కూడా కళాశాల యాజమాన్యం అందించేందుకు ముందుకు వచ్చింది. అంతేకాకుండా విద్యార్థినికి పుస్తకాలు, ఇతర సామగ్రికి అయ్యే ఖర్చుల కోసం డాక్టర్ రూ. 5వేలు ఆర్థిక సాయం అందించారు. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులు మదర్‌సేవాసమితికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజేత కళాశాల కరస్పాండెంట్ పసుపులేటి అరుణోదర్, మదర్‌సేవాసమితి నాయకులు రసూల్, యాసిన్, న్యాయవాది పాశం పిచ్చయ్య, పీర్ల మస్తాన్‌వలి పాల్గొన్నారు.

మహా సంకల్పానికి ముందడుగు..!

- రూ.95 లక్షలతో రైతుబజార్ కాంప్లెక్స్ నిర్మాణం
- భూమి పూజ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జూన్ 26: మహాసంకల్పానికి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ముందడుగు వేశారు. రైతుబజార్ ఏర్పాటుకు కార్యరూపమిచ్చారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో రూ.95లక్షలతో రైతు బజార్ కాంప్లెక్సు నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. వేద మంత్రాల నడుమ భూమి పూజ అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా రైతుబజార్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తాను గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కూరగాయల మార్కెట్ నిర్మాణం చేయాలనే సంకల్పం ఉండేదన్నారు. ఇరుకు రోడ్లలో రోడ్డుపై ఆడపడుచులు కూర్చుని కూరగాయలు, ఆకుకూరలు అమ్ముకున్న సన్నివేశాలు ఎంతో బాధించేవన్నారు. కనిగిరి మున్సిపాల్టీగా, డివిజన్‌గా రూపాంతరం చెందినప్పటికీ అభివృద్ధిలో ఇంకా వెనుకబడి ఉందన్నారు. ప్రజలందరూ తన సంకల్పాన్ని అర్థం చేసుకోవాలని కోరారు. కూరగాయల మార్కెట్ ఏర్పాటు కావటం వలన బొడ్డుచావిడి వద్ద ట్రాఫిక్ సమస్య తీరుతుందన్నారు. అదేవిధంగా ప్రస్తుతం నిర్మాణం కాబోతున్న ప్రాంతంలో



రైతుబజార్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

రైతుబజార్ ఏర్పాటైతే ప్రజలందరికీ ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. దసరా లోపు రైతుబజార్ నిర్మాణం పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా నగరంలో ట్రాఫిక్ సమస్య ఎంతో జటిలంగా మారిందన్నారు. రాష్ట్రస్థాయి నుంచి టీడీపీ పాలనలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అభివృద్ధి కార్యక్రమాల్లో ఒకటైన కూరగాయల మార్కెట్ 5నెలల్లో పూర్తి చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటానన్నారు. ప్రజలు, వ్యాపారులు, ఫుట్‌పాత్ వ్యాపారులు, తోపుడుబండి వ్యాపారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. క్యాంటీన్‌లోని సామగ్రిని పరిశీలించారు. క్యాంటీన్ నిర్వహణకు టీడీపీ పాలనలో వినియోగించిన పాత సామగ్రిని తెప్పించారు. క్యాంటీన్ శుభ్రం చేయించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రామరాజు, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ, ఏఎంసీ చైర్మన్ సాల్మన్‌రాజు, ఏఎంసీ ఆఫీసర్ రవిచంద్ర, టీడీపీ నాయకులు పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, నారపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, షరీఫ్, గుడిపాటి ఖాదర్, సద్గురు, ఐవీ నారాయణ, పెన్నా చిననాగయ్య యాదవ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతం పెంచాలి : ఉగ్ర

కనిగిరి, జూన్ 26: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని గురవాజీపేట గ్రామంలోని జిల్లాపరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు బుధవారం ప్రతిభా పురస్కారాలు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందించే విద్యపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలన్నారు. మెరుగైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లో అందించాలన్నారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయిస్తామన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. పాఠశాల ప్రహరీ నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలల మనుగడకు నాదెళ్ళ తిరుపతిరావు వంటి గ్రామస్థులు తోడ్పాటు అభినందనీయమన్నారు. ఈ ఏడాది మార్చిలో జరిగి 10వ తరగతి పరీక్షల్లో 550కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10వేలు, 500 మార్కులకు పైగా వచ్చిన విద్యార్థులకు రూ.5వేలు ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో దాత నాదెళ్ల తిరుపతిరావు, డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వర్, డీఎస్పీ రామరాజు, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ త్యాగరాజు, ఎంఈవోలు దేవిరెడ్డి రామిరెడ్డి, యూవీ నారాయణరెడ్డి, సుబ్బారావు, శ్రీనివాసులు, సంజీవి, హెచ్‌ఎం నాగలక్ష్మీ, మండలపార్టీ టీడీపీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, నాయకులు ముచ్చుమూరి చెంచిరెడ్డి, నారపరెడ్డి (యడవల్లి)శ్రీనివాసులురెడ్డి, భేరి పుల్లారెడి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన ఎంఎస్‌ఆర్ విద్యార్థినులు

కనిగిరి, జూన్ 26: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో స్థానిక ఎంఎస్ఆర్ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు బుధవారం విడుదలైనాయి. ఎంపీసీ ఇంగ్లీషు మీడియంలో అంపాబత్తుని తేజస్విని 470కి 465 మార్కులు, ఆర్షియా 459 , సౌమ్య 459 మాధవి 458 , లక్ష్మీప్రసన్న 458 మార్కులు సాధించారు. అదేవిధంగా బైపీసీలో అనూష 440కి 429 మార్కులు, సీఈసీలో భూలక్ష్మి 500కి 453 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపల్ టీ వెంకటరెడ్డి, అధ్యాపక బృందం అభినందించింది.

సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలి

- ప్రజా వినతులకు రశీదులు ఇవ్వాలి
- మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సూచన

పామూరు, జూన్ 26 : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని లేని పక్షంలో చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి హెచ్చరించారు. స్థానిక మండలపరిషత్ జనరల్ బాడీ సమావేశం ఎంపీపీ గంగసాని లక్ష్మీ అధ్యక్షతన బుధవారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఉగ్ర ప్రొటోకాల్ ప్రకారం సమావేశం నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఎంపీపీ లక్ష్మీ స్పందిస్తూ గతంలో తాను ఎంపీటీసీగా ఉన్నప్పుడు జడ్పీటీసీ, వైస్‌ఎంపీపీలు వేదిక మీద ఉండేవారని, అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామన్నారు. అదేం కుదరదని ప్రొటోకాల్ ప్రకారం వేదిక మీద జడ్పీటీసీ, వైస్ ఎంపీపీల లకు చోటు లేదని చెప్పడంతో అధికారులు కుర్చీలు తొలగించారు. చేసేదిలేక వారు నిరాశతో సభ్యుల వరుసలో కూర్చొన్నారు. సమావేశంలో బొట్లగూడూరు ప్రభుత్వ వైద్యాధికారి విజయకుమార్ మాట్లాడుతుండగా మీపై ఆరోపణలు ఉన్నాయని, డాక్టరుగా ఉండి ఆరోపణలు రావడం దురదృష్టకరమని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆరోపణలపై విచారణ చేపడతామని అన్నారు. జాతీయ రహదారుల నిర్మాణ భూసేకరణలో రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదని, పలుమార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తెచ్చినా స్పందించడం లేదని, కనీసం తీసుకొన్న డాక్యుమెంట్లను ఇవ్వడం లేదని పలువురు సర్పంచ్‌లు ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే ఉగ్ర స్పందిస్తూ అధికారులు పౌరులను గౌరవించాలి, కుర్చీలు లేని కార్యాలయం ఉంటే తన దృష్టికి తీసుకొని రావాలని సూచించారు. అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ చెట్లకు కొందరు వ్యక్తులు అక్రమంగా నరికి తరలించుకొని జేబులు నింపుకొంటున్నారని, అట్టివారిపై క్రిమినల్ కేసులు బనాయించాలని పోలీసులకు సూచించారు. నర్రమారెళ్ల గ్రామంలో దాతలు బోరు వేస్తే అధికారులు బిల్లులు చేసుకొన్నారని గ్రామ ఉప సర్పంచ్ జి. శ్రీను ఉగ్ర దృష్టికి తేగా ఆ బోర్లకు బిల్లులు ఎలా చేశారని, దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలని, అన్నిగ్రామాలకు సాగర్ పైప్‌లైన్ ద్వారా నీరు ఇవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. మాగ్రామ సర్పంచ్ సంవత్సర కాలం నుంచి కన్పించడంలేదని, సంవత్సరం రోజులు గడిచినా సమావేశం పెట్టలేదని, అధికారులు ఆయన ఆచూకీ తెలపాలని తూర్పు కట్టకిందపల్లి పంచాయతి వార్డుమెంబర్ పాలపర్తి వెంకటేశ్వర్లు సభ ద్వారా ఎంపీడీవోను కోరారు. మండలంలోని సమస్యలపై పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఏకరువు పెట్టారు. ఈ సమావేశంలో తహసీల్దార్ షాకీర్‌పాష, ఎంపీడీవో పుట్టారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ విశ్వనాథరెడ్డి, డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వరరావుతో పాటు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర



లేచిపోయిన పీసీపల్లి చెత్తసంపద కేంద్రం పైకప్పు

నిరుపయోగంగా చెత్తసంపద కేంద్రం

- కూలిపోయిన పైకప్పు
- కనుమరుగైన నాడెప్ తొట్లు

పీసీపల్లి,జూన్26:చెత్త నుంచి సంపదను సృష్టించాలనే లక్ష్యంతో మండల కేంద్రమైన పీసీపల్లి మేజర్ పంచాయతీలో ఉపాధిహామీ నిధులతో నిర్మించిన చెత్తసంపద కేంద్రం అడ్రస్ లేకుండా పోయింది. దీనిలో నిర్మించిన నాడెప్ తొట్లు కూడా కనుమరుగయ్యాయి. పంచాయతీలోని తడి,పొడి చెత్తను క్లాప్‌మిత్ర ల ద్వారా సేకరించి చెత్తసంపద కేంద్రాలకు తరలించి అక్కడ ప్రాసెసింగ్ చేసి ఎరువును తయారు చేయాలి. తయారుచేసిన సేంద్రియ ఎరువును, ప్లాస్టిక్ వ్యర్థాలను విక్రయించడం ద్వారా సంపదను సమకూర్చి పంచాయతీలకు ఆదాయం చేకూర్చాలని గత ప్రభుత్వంలో ప్రణాళికలు వేశారు. అందుకు సంబంధించిన యంత్రాలను సైతం కొనుగోలు చేశారు.అయితే సంబంధిత అధికారుల నిర్లక్ష్యం, పట్టరానితనం కారణంగా లక్షలు వెచ్చించి నిర్మించిన చెత్తసంపద కేంద్రం పైకప్పు లేచిపోయింది. కేంద్రం యొక్క గుంజలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. అందులో నిర్మించిన నాడప్‌తొట్లు కొన్ని పగిలిపోగా మరికొన్నింటిలో తుమ్మ చెట్లు, రేగుచెట్లు మొలిచాయి.దీనితో ప్రస్తుతం ఆ చెత్తసంపద కేంద్రం నిరుపయోగంగా , అలంకారప్రాయంగా మిగిలింది.పీసీపల్లి బస్టాండు ఎదుట వాటర్‌ట్యాంకు సమీపంలో చెత్త కుప్పలుగా పడి ఉంది. అక్కడ ఖాళీ మద్యం సీసాలు గుట్టలుగా ఉన్నాయి.దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.చెత్తను తీసుకెళ్లమని చెప్పినా క్లాప్‌మిత్రలు పట్టించుకోవడం లేదని, దీంతో తాము రోగాల బారిన పడాల్సి వస్తుందని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పీసీపల్లి ప్రజలు కోరుతున్నారు.



నాడెప్ తొట్లలో మొలిచిన తుమ్మ, రేగు మొక్కలు

ఇనుప పైప్‌లైన్లను సరిచేయాలి

పామూరు, జూన్ 26 : పామూరు పట్టణంలోని ఎర్రచేలువీధుల్లో ఇంటింటికీ కుళాయి పేరుతో వేసిన ఇనుప పైప్‌లైన్ వలన స్థానికులు అష్టకష్టాలు పడుతున్నారని స్థానిక టీడీపీ నాయకులు ఎమ్మెల్యే ఉగ్రకు బుధవారం వినతి పత్రం అందజేశారు. వైసీపీ నాయకులు బిల్లులు పొందడానికి పద్ధతి ప్రకారం కాకుండా మొక్కుబడిగా పైప్‌లైన్లు వేశారని ఆ వినతిపత్రంలో ఆరోపించారు. రోడ్లపైనే పెద్ద పెద్ద స్పీడ్ బ్రేకర్లు మాదిరిగా గట్లు వేయడం వల్ల స్థానికులు అనేక మంది ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజల అవసరాలను పట్టించుకోకుండా పాత చెరువులోని నీరు వదలటంతో భూగర్భజలాలు తగ్గి బోర్లల్లో నీటి మట్టం తగ్గిందని తెలిపారు. అడ్డుదిడ్డంగా వేసిన పైపులను సవరించి సక్రమంగా నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆవినతి పత్రంలోకోరారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకొంటామని ఎమ్మెల్యే ఉగ్ర వారికి హామీ ఇచ్చారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

పామూరు, జూన్ 26 : కస్తూర్బా విద్యాలయంలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినులకు ఇంటి భోజనం వలే మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక కేజీబీవీని బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థినులను తమ బిడ్డలుగా భావించి మంచి విద్యను అందించాలని సూచించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలన్నారు. అనంతరం ఉగ్ర ఆర్థిక సహకారంతో సమకూర్చిన ప్యాడ్‌లను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షాకీర్‌పాష, ఎంఈవో కరుణకుమారి, ప్రిన్సిపాల్ కటకం సృజన, వీరభద్రాపురం సర్పంచ్ పువ్వాడి జయమ్మ, టీడీపీ నాయకులు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎం. గంగరాజుయాదవ్, బి. జయరామిరెడ్డి, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పామూరులో చోరీ

రూ. 95 వేల నగదు, బంగారు ఆభరణాల అపహరణ

పామూరు, జూన్ 26 : పామూరు జాతీయ రహదారి వెంబడి ఉన్న ఇంటిలో ఎవరూలేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు బీరువా తాళాలు పగులకొట్టి బంగారం, వెండి , నగదును దోచుకొని పోయిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు రంజాన్‌బి తెలిపిన వివరాల ప్రకారం తన భర్త ఉద్యోగ రీత్యా బెంగళూరులో ఉంటున్నారని ,నేను సోమవారం ఉదయం 10 గంటలకు ఇంటికి తాళం వేసి పుట్టింటికి వెళ్లానని బుధవారం ఉదయం మా మామగారు పెద్దఖాశీం వచ్చి ఇంటిని పరిశీలించగా మెయిన్‌డోరు, పక్కనున్న కిటికీ అద్దాలు పగులకొట్టి ఉండటాన్ని గుర్తించారని తెలిపింది. డోరు తీసి లోపలికివెళ్లి చూడగా ఇంటిలోని సామాను అంతా చిందరవందంగా పడి ఉండటంతో నాకు ఫోన్ చేయగా వచ్చి చూశానని, ఇంటిలో ఉండవలసిన రూ. 95 వేల నగదు, బీరువాలో ఉండవలసిన 40 గ్రాముల బంగారు చైన్, 3 ఉంగరాలు, 1,130 గ్రాముల వెండి వస్తువులతోపాటు సీసీ కెమెరాలు చోరీ చేశారని గుర్తించామన్నారు. వెంటనే 100 ఫోన్‌చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు. క్లూస్‌టీం సభ్యులు వచ్చి వేలిముద్రలు సేకరించారు.

పిల్లలందరూ బడిలోనే ఉండాలి

పలు చోట్ల 'నేను బడికి పోతా' ర్యాలీలు

దొనకొండ, జూన్ 26 : బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని, మధ్యలో బడి మానేసిన పిల్లలను తల్లిదండ్రులు బాధ్యతగా బడిలో చేర్పాలని మండలంలోని చందవరం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. శ్రీనివాసరెడ్డి కోరారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు, బ్యాగులు, బూట్లతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తోందని తెలిపారు. మనబడి చదువుల గుడి కావాలని, అందరూ చదవాలి, అందరూ ఎదగాలి, పెద్దలు పనిలో- పిల్లలు బడిలో అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న చందవరం జడ్పీ పాఠశాల విద్యార్థులు

వెలుగువారిపాలెంలో..

తాళ్లూరు : బడి వయస్సుగల పిల్లలు చదువు మానుకుని పనుల్లో, ఇంటి పట్టున ఉండరాదని, బడిలోనే వుండి చదువుకోవాలని వెలుగువారిపాలెం ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం పోలంరెడ్డి సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని వెలుగువారిపాలెం గ్రామంలో నేనుబడికి పోతా కార్యక్రమం జరిగింది. ముందుగా ఎంపీపీ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, సచివాలయ సిబ్బంది విద్య ప్రాధాన్యతను వివరిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, నాగసురేష్, మస్తాన్, సుబ్బారెడ్డి, సునీత, మస్తానమ్మ,రమణమ్మ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రిని సన్మానించిన కోటపాటి

పామూరు, జూన్ 26 : మంత్రిగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన స్వామిని అమరావతి లోని సచివాలయ క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు.




మంత్రిని సన్మానిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జనార్దనరావు

నోటు పుస్తకాల పంపిణీ

మండలంలోని నుచ్చుపొద ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 30 మంది విద్యార్థులకు జిల్లా జనగణన అధికారి దుద్దుకూరి రామసుబ్బారావు సమకూర్చిన ఆర్థిక సహకారంతో బుధవారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే ప్రభుత్వం సరఫరా చేసిన స్టూడెంట్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోళ్ల వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నడపాలి

పామూరు, జూన్ 26 : అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నడిపి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొని రావాలని ఎమ్మెల్యే ఉగ్ర అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచి ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా పామూరుకు వచ్చిన ఆయన్ను అంగన్‌వాడీ అధికారులు, కార్యకర్తలు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అంగన్‌వాడీకేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సరోజిని, సూపర్‌వైజర్లు పార్వతి, జి. పద్మజ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



హత్యలు.. దాడులు.. దోపిడీలు.. బెదిరింపులు.. అక్రమ వసూళ్లు.. కేసులు.. అక్రమ వ్యాపారాలు.. భూకబ్జాలకు కేరాఫ్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి. అధికారాన్ని అడ్డంపెట్టుకుని.. వ్యవస్థలను చెరపట్టి.. మాచర్లలో పిన్నెల్లి సోదరులు ఆటవిక రాజ్యం సాగించారు. మాచర్ల నియోజకవర్గాన్ని ఆరాచకాలకు అడ్డాగా మార్చేసి వనరులను దోచుకుంటూ, అక్రమాలను అడ్డుకునే వారిని, ప్రశ్నించే వారిని అంతం చేస్తూ.. ఎదురేలేదన్నట్లుగా చెలరేగిపోయిన పిన్నెల్లి పాపం పండింది. ఇంతకాలం పిన్నెల్లి అరాచకాలకు కొమ్ముకాస్తూ.. సలాం కొడుతూ.. వారు చెప్పినట్లుగా చేస్తూ వచ్చిన పోలీసులే ఎట్టకేలకు బేడీలు వేశారు. కోర్టు రక్షణతో బెయిల్‌పై ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే, వైసీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడైన పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఎట్టకేలకు బుధవారం నరసరావుపేటలో పోలీసులు అరెస్టు చేశారు. పాల్వాయిగేటులో ఈవీఎం ధ్వంసం సీసీ టీవీ ఫుటేజీ బయటకు రావడం.. ఎన్నికల సంఘం కేసులతో పిన్నెల్లి అరాచకాలు ఒక్కోటిగా వెలుగుచూశాయి. ఈవీఎంల ధ్వంసం, మూడు హత్యాయత్నం కేసుల్లో మధ్యంతర బెయిల్‌పై ఉన్న పిన్నెల్లిని పోలీసులు అరెస్టు చేశారు. ఆయన సోదరుడైన పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి మాత్రం ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నాడు.


(పాత చిత్రాలు)
మాచర్ల టీడీపీ కార్యాలయానికి నిప్పుపెట్టిన దృశ్యం


ఈవీఎంను ధ్వంసం చేస్తున్న రామకృష్ణారెడ్డి


పాల్వాయిగేట్ పోలింగ్ బూత్ వద్ద మహిళను హెచ్చరిస్తున్న పిన్నెల్లి


కారంపూడి టీడీపీ ఆఫీసు ధ్వంసం చేస్తూ..

పాపం పండింది



- ఎట్టకేలకు పిన్నెల్లి అరెస్టు
- కండిషన్ బెయిల్ రద్దుతో జైలుకు
- నరసరావుపేటలో అరెస్టు చేసిన పోలీసులు

నరసరావుపేట(ఆంధ్రజ్యోతి), మాచర్ల టౌన్, జూన్ 26: మాచర్ల మాజీ ఎమ్మెల్యే, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. హైకోర్టు కండీషన్ బెయిల్ రద్దుతో బుధవారం నరసరావుపేటలో ఇంటి వద్ద పోలీసులు పిన్నెల్లిని అరెస్టు చేసి ఎస్పీ కార్యాలయానికి తరలించారు. పోలింగ్ రోజున పాల్వాయి గేటులోని పోలింగ్ బూత్‌లో ఈవీఎం ధ్వంసం, 307 సెక్షన్ కింద నమోదైన మూడు కేసుల్లో ముందస్తు బెయిల్ పిటిషన్లను హైకోర్టు తోసిపుచ్చింది. దీంతో పిన్నెల్లిని పోలీసులు అరెస్టు చేశారు. ఈవీఎంల ధ్వంసం, హత్యాయత్నం కేసులు ముండింటిలో పిన్నెల్లి మధ్యంతర బెయిల్‌పై ఉన్న ఆయన దానిని పొడిగించాలని హైకోర్టులో తాజాగా పిటిషన్లు వేశారు. హత్యాయత్నం కేసుల్లో ముందస్తు బెయిల్ కోరగా కోర్టు తిరస్కరించింది. పిన్నెల్లిపై మొత్తం 14 కేసులు నమోదయ్యాయి. అయనపై 15న మాచర్ల పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్ తెరిచిన విషయం తెలిసిందే.



పిన్నెల్లి అరెస్టు ఇలా..

ముందస్తు బెయిల్ కోసం పిన్నెల్లి రామకృష్ణరెడ్డి వేసిన పిటిషన్లను హైకోర్టు బుధవారం మధ్యాహ్నం కొట్టేసింది. దీంతో పిన్నెల్లికి ముందస్తు బెయిల్ రద్దు అయినట్టు పోలీసులకు కోర్టు నుంచి 3.00 గంటల సమయంలో సమాచారం అందింది. నరసరావుపేటలో ఆయన ఉంటున్న ఇంటి వద్దకు చేరుకున్న పోలీసులు 3.47 గంటల సమయంలో అదుపులోకి తీసుకుని ఎస్పీ కార్యాలయానికి తరలించారు. పిన్నెల్లిని అరెస్టు చేసినట్టు ఎస్పీ మల్లికాగార్గ్ రాత్రి 7 గంటల సమయంలో ప్రకటించారు. వైద్య పరీక్షల నిమిత్తం ఎస్పీ కార్యాలయం నుంచి నరసరావుపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి 8 గంటల సమయంలో తరలించారు. అనంతరం 9.13 గంటలకు ఆస్పత్రి నుంచి ఎస్పీ కార్యాలయానికి ఆయన్ను తరలించారు. మాచర్ల నియోజకవర్గంలో కేసులు నమోదు కావడంతో ఆయన్ను మాచర్ల కోర్టులో హాజరు పరచాలని పోలీసులు నిర్ణయించారు. రాత్రి 10 గంటల సమయంలో ఎస్పీ కార్యాలయం నుంచి పిన్నెల్లిని మాచర్ల కోర్టులో హాజరు పరిచేందుకు తరలించారు.

అరెస్టుపై హర్షం.. కారంపూడిలో సంబరాలు

మాచర్లటౌన్: మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టుపై ఆయన బాధితులు హర్షం వ్యక్తం చేశారు. కారంపూడిలోని సినిమాహాలు, ఇందిరా గాంధీ బొమ్మ సెంటర్లో పలువురు బాణాసంచా పేల్చారు. ఐదేళ్లపాటు ఎటువంటి తప్పులు చేయకున్నా అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చేసిన రామకృష్ణారెడ్డికి సరైన శిక్ష పడిందంటూ బాధితులు పలువురు ఆనందం వ్యక్తం చేశారు.

ఎన్నికల్లో గెలుపు కోసం అరాచకాలు..

మాచర్ల నుంచి నాలుగు సార్లు గెలుస్తూ వచ్చిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈ సారి కూడా ఎలాగైనా విజయం సాధించాలని అనేక అరాచకాలకు పాల్పడ్డారు. పిన్నెల్లి ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డితో కలిసి పోలింగ్ రోజున హింసకు పాల్పడ్డారు. పోలింగ్‌కు ముందు రోజు, పోలింగ్ రోజు, ఆ మరుసటి రోజు దారుణాలకు పాల్పడ్డారు. పోలింగ్ ముందు రోజు మే 12న రెంటచింతలలో పిన్నెల్లి అనుచరుడు మోర్తాల ఉమామహేశ్వరరెడ్డి టీడీపీ ఏజెంట్లు మల్లయ్య, సిద్ధయ్యలపై దాడి చేసి గాయపరిచాడు. మే 13 పోలింగ్ రోజున పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రెంటచింతల మండలం పాలువాయిగేటు 202 పోలింగ్ బూత్‌లోకి దౌర్జన్యంగా ప్రవేశించి ఈవీఎం, వీవీప్యాట్లను ధ్వంసం చేశాడు. అడ్డుకోబోయిన టీడీపీ ఏజెంట్ నంబూరి శేషగిరిరావుపై దాడి చేయించారు. ప్రశ్నించిన మరో మహిళ చెరుకూరి నాగశిరోమణిను దూషిస్తూ వేలుచూపి బెదిరించాడు. ఈ ఘటనలో రామకృష్ణారెడ్డిపై 307 సెక్షన్ కింద కేసు నమోదైంది. రెంటాలలో టీడీపీ ఏజెంట్ శేర్రెడ్డి మంజుల, గోపాలరెడ్డిలపై దాడి, కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిపై కారం చల్లి దాడికి యత్నించడం, కారు ధ్వంసం చేసి తగలబెట్టారు. వెల్దుర్తి మండలం కొత్తపుల్లారెడ్డి గూడెంలో టీడీపీ ఏజెంట్ రేఖ్యానాయక్‌పై దాడి చేసిన ఘటనలో కూడా రామకృష్ణారెడ్డిపై 307 సెక్షన్ కింద కేసు నమోదైంది. కండ్లకుంలో టీడీపీ ఏజెంట్‌గా కూర్చున్న నోముల మాణిక్యరావు కుటుంబసభ్యులపై వెంకట్రామిరెడ్డి దాడి చేయించి వీడియో చూపించి ఏజెంట్‌ను బయటకు లాగేశారు. మాచర్ల పీడబ్ల్యూడీ కాలనీలో తన గ్యాంగ్‌ను వెంట వేసుకొచ్చి కారుతో ఢీకొట్టి 8 మందిని త్రీవంగా గాయపరిచాడు. టీడీపీ నేత యెనుముల కేశవరెడ్డి గృహం ధ్వంసం చేశాడు. పోలింగ్ మరుసటి రోజు కారంపూడిలో రౌడీగ్యాంగును వెంటబెట్టుకుని వెళ్లి టీడీపీ కార్యాలయం, టీడీపీ సానుబూతిపరుల దుకాణాలు, కార్లు ధ్వంసం చేసి నిప్పు పెట్టారు. అడ్డుకున్న సీఐ నారాయణస్వామి తలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ దాడిలో రామకృష్ణారెడ్డిపై 307 కేసు నమోదైంది. ఇవి కాక మరో 11 ఘర్షణల్లో వివిధ సెక్షన్ల కింద రామకృష్ణారెడ్డిపై కేసులు నమోదయ్యాయి. ఇలా మొత్తం పిన్నెల్లిపై మాచర్ల నియోజకవర్గంలోని పోలీసు స్టేషన్లలో 14 కేసులు నమోదయ్యాయి.

ఎన్నికల్లో ప్రజలు తిరుగుబాటు

పోలీసులు పిన్నెల్లికి తొత్తుల్లా పనిచేస్తుంటే, అధికారులు అడుగులకు మడుగులొత్తుతుంటే. ఇన్నాళ్లూ వారి ఆరాచకాల్ని మౌనంగా భరించిన నియోజకవర్గ ప్రజలే తాజా ఎన్నికల్లో తిరగబడ్డారు. సామాన్య మహిళలు ఎమ్మెల్యేను నిలదీయడమే కాకుండా, ఎదిరించి, వెంబడించి తరిమేయడం ప్రజల్లో వచ్చిన మార్పునకు నిదర్శనం. పిన్నెల్లి సోదరులు ఐదేళ్లుగా చేసిన అరాచకాల్ని ఇక భరించలేని పరిస్థితితో సహనం నశించిన ప్రజల్లో తెగువ వచ్చింది. బతికిబట్ట కట్టాలంటే ఈ ఎన్నికల్లో పిన్నెల్లిని ఓడించాలన్న కసితో ప్రజలు పనిచేశారు. నియోజకవర్గాన్ని ఇన్నాళ్లూ కనుసైగతో శాసించిన పిన్నెల్లి సోదరులు ప్రజల్లో వచ్చిన మార్పును జీర్ణించుకోలేక.. విచక్షణ కోల్పోయి. ఎక్కడికక్కడ దాడులకు తెగబడ్డారు. పిన్నెల్లిని ఓడించడం ద్వారా అయన నెర సామ్రాజ్యానికి కూకటి వేళ్లతో ప్రజలు పెకలించగా తాజా అరెస్టుతో పోలీసులు పిన్నెల్లి శకానికి ముగింపు పలికారు.


పిన్నెల్లిని అరెస్టు చేసి తీసుకు వెళుతున్న పోలీసులు

పరారీలోనే పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి

షాడో ఎమ్మెల్యేగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి అధికారం అండతో చెలరేగిపోయాడు. నియోజకవర్గంలో పోలీసు వ్యవస్థలను తన చెప్పు చేతల్లో పెట్టుకుని హత్యలు, అరాచకాలకు పాల్పడ్డాడు. తనకు ఎదురే లేదన్న రీతిలో వ్యవహరించిన వెంకట్రామిరెడ్డి పోలింగ్, ఆ తర్వాత విధ్వంసకాండకు పాల్పడ్డాడు. ఈ కేసుల భయంతో మే 14న తన అన్న రామకృష్ణారెడ్డితో కలసి పరారయ్యాడు. అప్పటి నుంచి అజ్ఞాతంలోనే కొనసాగుతున్నాడు. ఆయన్ను అరెస్టు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నియోజకవర్గంలో ప్రత్యర్థులను భయ భ్రాంతులకు గురిచేసిన షాడో ఎమ్మెల్యేగా వ్యవహరించిన వెంకట్రామిరెడ్డి కేసుల భయంతో తలదాచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరు పోలీసు అధికారుల సహకారంతోనే అయన తప్పించుకు తిరుగుతున్నాడన్న ఆరోపణలున్నాయి. వెంకట్రామిరెడ్డిపై రెండు హత్యాయత్నం కేసులతో సహా మొత్తం 9 కేసులు నమోదయ్యాయి. వెంకట్రామిరెడ్డికి ఇంకా కొందరు పోలీసులు సహకరిస్తున్నారన్న విమర్శలున్నాయి. పోలీసులు తలచుకుంటే వెంట్రామిరెడ్డిని పట్టుకోవడం పెద్ద పని కాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

* హత్యలు

వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన టీడీపీ కార్యకర్త తోట చంద్రయ్యను అదే గ్రామానికి చెందిన చింతా శివరామయ్య, ఆదినారాయణతో హత్య చేయించారు. దుర్గి మండలం జంగమహేశ్వరపాడులో కంచర్ల జల్లయ్యను అదే గ్రామానికి చెందిన ఊరిబండి మన్నెయ్యతో హత్య చేయించారు.

* భూకబ్జాలు

మాచర్ల మండలం నాగులవరం పంచాయతీ పరిధిలోని విజయపురిసౌత్ పరిధిలో సుమారు 400 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారు. వెల్దుర్తి మండలం కండ్లకుంటలో 1500 ఎకరాలు, మాచర్ల పట్టణంలోని నెహ్రూనగర్ సమీపంలో చెన్నకేశవస్వామి మాన్యం భూములు 7 ఎకరాలు, నరసరావుపేట రోడ్డులో వేంకటేశ్వరస్వామి మాన్యం 2 ఎకరాలు, కొత్తపల్లి జంక్షన్లో 5 ఎకరాలు కబ్జా చేశారు. పట్టణంలో టీడీపీ దివంగత సీనియర్ నేత వీరమాచినేని సుభాష్‌చంద్రబోస్‌కు చెందిన రూ.కోట్ల విలువైన ఆస్తులను బినామీ పేర్లతో కబ్జా చేశారు.

* భయాందోనలతో ఏకగ్రీవాలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ తరపున నామినేషన్ వేద్దామను కున్న అభ్యర్థులకు పోలీసులే ఫోన్లు చేసి, పోటీ ఆలోచన మానుకోకపోతే గంజాయి వ్యాపారం చేస్తున్నావని కేసులు పెడతామని బెదిరించారు. వాటికీ లొంగని వారిపై భౌతిక దాడులు చేయించి అన్ని పంచాయతీలు, మున్సిపాలిటీ, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ఇలా అన్ని ఎన్నికల్లోనూ ఏకగ్రీవం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల సరళిని పరిశీలించేందుకు వచ్చిన టీడీపీ బృందం బొండా ఉమ, బుద్ధా వెంకన్న, హైకోర్టు న్యాయవాదిపై మాచర్లలోని రింగురోడ్డు సెంటర్లో తురకా కిషోర్‌తో దాడి చేయించారు. దాడికి దిగిన తురకా కిషోర్‌ను ఏకంగా మున్సిపల్ ఛైర్మన్ చేశారు.

* ఆస్తుల ధ్వంసం

2022 డిసెంబరు 16న ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా పిన్నెల్లి రౌడీ గ్యాంగ్ టీడీపీ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డిపై కవ్వింపు చర్యలకు దిగింది. దీంతో పోలీసులు బ్రహ్మారెడ్డిని ఊరు నుంచి బయటకు పంపేశారు. తదుపరి ఎమ్మెల్యే సోదరుడు వెంకట్రామిరెడ్డి తన రౌడీ గ్యాంగుతో పట్టణంలోని టీడీపీ కార్యాలయంపై దాడి చేసి దహనం చేశాడు. ఆ తర్వాత పట్టణంలోని టీడీపీ నాయకులకు చెందిన ఇళ్లపైకి వెళ్లి వారి ఆస్తులను, వాహనాలను ధ్వంసం చేశారు. పట్టణం రావణకాష్టంగా మార్చిన వారిని వదిలేసిన పోలీసులు టీడీపీ వారిపైనే 307 కేసులు కట్టి జైలుపాలు చేశారు.

* అక్రమ వసూళ్లు

గ్రానైట్ లారీల నుంచి అక్రమ వసూళ్లు, రేషన్ బియ్యం, గుట్కా, పాన్‌పరాగ్, గంజాయి, తెలంగాణ మద్యం, బెల్ట్‌షాపులు ద్వారా కోట్లాది రూపాయలు అక్రమంగా కూడబెట్టుకున్నారు. నియోజకవర్గ పరిధిలో వెంచర్లు వేయాలన్నా, నిర్మాణాలు చేపట్టాలన్నా ఐదు శాతం వాటా సమర్పించుకోవాలి. అపార్ట్మెంట్ కట్టేవారి నుంచి రూ.20- 30 లక్షల వరకు వసూలు చేశారు. రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్, సెబ్ తదితర కార్యాలయాల నుంచి ముడుపులు దండుకున్నారు.

మాచర్లలో ఆటవికరాజ్యం

మాచర్లలో ఐదేళ్లు అరాచకం

మాచర్ల మాజీ ఎమ్మెల్యే రాజకీయ జీవితమంతా నేరమయమే. హత్యలు, దాడులు, కబ్జాలతో చెలరేగిపోయి రౌడీ సామ్రాజ్యాన్ని నెలకొల్పారు. నియోజకవర్గ పరిధిలోని వెల్దుర్తి జడ్పీటీగా రాజకీయ జీవితం ప్రారంభించారు. ఆ తర్వాత 2009లో ఎమ్మెల్యేగా మాచర్ల నుంచి పోటీ చేసి అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. ఇక అప్పటి నుంచి వరుసగా 2019 వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తూ వచ్చారు. ఈ క్రమంలో నియోజకవర్గంలో ఆధిపత్యం కోసం, పట్టు కోసం ప్రత్యర్థి పార్టీ నాయకులను టార్గెట్ చేసుకుని అనేక ఇబ్బందులకు గురి చేశాడు. ప్రభుత్వం ఏదైనా నియోజకవర్గంలో తనకు ఎదురులేకుండా చేసుకున్నాడు. ఈ పరిస్థితుల్లో 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇక ఆయనకు తిరుగే లేకుండా పోయింది. దౌర్జన్యాలు, దాడులతో దోపిడీలకు తెగబడ్డాడు. నియోజకవర్గంలోని టీడీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని పోలీసులతో దాడి చేయించి గ్రామాలు విడిచి పోయేలా చేశాడు. 20 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి రాజ్యాంగం, వ్యవస్థలంటే కనీస గౌరవం లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించాడు. ఐదేళ్లుగా మాచర్ల నియోజకవర్గాన్ని తన సొంత సామ్రాజ్యంలా, ఆటవికరాజ్యంలా, ఆరాచకాలకు అడ్డాగా మార్చేశాడు. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీ మూకలు టీడీపీ మద్దతుదారుల్ని గ్రామాల నుంచి తరిమికొట్టాయి. 2020లో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జంగమేశ్వరపాడులో టీడీపీ శ్రేణులపై వైసీపీ వర్గీయులు దాడి చేయడంతో 60 కుటుంబాలు ఊరు విడిచి వెళ్లిపోయాయి. గుండ్లపాడు నుంచి కొన్ని కుటుంబాలు వెళ్లిపోయాయి.


రెంటాలలో దగ్ధమవుతున్న బ్రహ్మారెడ్డి వాహనం

ఇక నియోజకవర్గ పరిధిలోని వనరులన్నీ దోచుకుంటూ, ప్రతిపక్షనాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులపై దాడులకు, హత్యాకాండకు తెగబడుతూ సాగించిన దాష్టీకాలు అన్నీ ఇన్నీకావు. నియోజకవర్గంలో ప్రతిపక్షం అన్నది లేకుండా నిర్మూలించాలన్నట్లుగా బరితెగించాడు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక పిన్నెల్లి సోదరులకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డితో కలిసి ఐదేళ్లలో చేసిన అరాచకాలు, అకృత్యాలు, దారుణాలు, దోపిడీలు అన్ని ఇన్ని కావు. సోదరుల నేర సామ్రాజ్యం విస్తరించుకున్నారు. అన్ని పదవులు, కాంట్రాక్టులు పిన్నెల్లి సోదరులకు, వాళ్ల మనుషులకే దక్కించుకున్నారు. ఐదేళ్లలో నియోజకవర్గాన్ని వారు పీల్చిపిప్పి చేశారు. వెంకట్రామిరెడ్డి కనుసన్నల్లో అక్రమ మద్యం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లింది. తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తెచ్చి విక్రయించేవారు. ప్రభుత్వ దుకాణాలకు వచ్చిన మద్యాన్ని సొంత షాపులు, బార్లకు తరలించుకున్నారు. ప్రతి సీసాపై రూ.60 నుంచి రూ.120 వరకు అధికంగా విక్రయించి సొమ్ము చేసుకున్నారు. తెల్ల రాయి అక్రమ క్వారీయింగ్ చేసి కోట్లు సంపాదించారు. బాపట్ల, ప్రకాశం, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి మాచర్ల నియోజకవర్గం మీదుగా తెలంగాణకు వెళ్లే గ్రానైట్ లారీల నుంచి పిన్నెల్లి అనుచరులు మనుషులు రూ.12 వేల చొప్పున కప్పం కట్టించుకున్నారు. జనాల్ని భయపెట్టి, బెదిరించి వారి ఆస్తులు లాక్కున్నారు. పోలీసులు ఈ ఐదేళ్లలో ఒక్కసారి కూడా పిన్నెల్లి సోదరుల జోలికి వెళ్లలేదు. ఎస్పీ మొదలు హోంగార్డు వరకు పోలీసు వ్యవస్థ మొత్తం వారికి దాసోహమై ఊడిగం చేసింది. ఎమ్మెల్యే, ఆయన సోదరుడు, అనుచరులంటే పోలీసులకు హడల్. ప్రతి స్టేషన్లోనూ పిన్నెల్లి మనుషులు ఇద్దరో, ముగ్గురో హోంగార్డులుగా పనిచేస్తుంటారు. స్టేషన్లో ఏం జరిగినా క్షణాల్లో పిన్నెల్లికి చేరవేసేవారు.

రైతులపై దాడి..పంటలు ధ్వంసం

పిడుగురాళ్ల: మాచవరం మండలం చెన్నాయ పాలెం సమీపంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు సరస్వతి పవర్ ప్రాజెక్టు, సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం కొరకు 2010లో సుమారు 1200 ఎకరాలను రైతుల నుంచి కొనుగోలు చేశారు. అయితే 2014 వరకు ఫ్యాక్టరీ నిర్మణం చేపట్టలేదు. దీంతో రైతులు తమ భూముల్లో సాగు చేసుకుంటామని పనులు మొదలు పెట్టిన తర్వాత అప్పగిస్తామని చెప్పారు. అయితే భూముల్లోకి ఎవరినీ జగన్మోహన్‌రెడ్డి కుటుంబసభ్యులు అడుగుపెట్టనివ్వలేదు. ఈ క్రమంలో 2014లో టీడీపీ అధికారంలోకి రావడంతో రైతులు తమ భూముల్లో పలు రకాల పంటలను సాగుచేశారు. ఆ తర్వాత అదే సంవత్సరం అక్టోబరులో అప్పటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిలు 40 ట్రాక్టర్లలో వందలాది మంది అనుచరులతో చెన్నాయపాలెం చేరుకుని రైతులు సాగుచేస్తున్న పంటలను ట్రాక్టర్లతో దున్నించి ధ్వంసం చేశారు. అడ్డు వచ్చిన రైతులు, ఎస్సీ ఎస్టీ మహిళలను కూడా కులంపేరుతో దూషించడమే కాకుండా పెట్రోలు పోయడం, మారణాయుధాలతో దాడి చేశారు. దీంతో మాచవరం పోలీసులు పిన్నెల్లి సోదరులపై కేసులు నమోదు చేశారు.


చెన్నాయపాలెం వద్ద సరస్వతి సిమెంట్ ఫ్యాక్టరీకి చెందిన భూములు

డయేరియా వ్యాప్తిని అరికట్టాలి

అధికారులను ఆదేశించిన ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీధర్

బాపట్ల, జూన్ 26: డయేరియా వ్యాప్తిని పూర్తి స్థాయిలో అరికట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్ ఆదేశించారు. డయేరియా నిర్మూలనపై బుధవారం అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రజలలో అవగాహన కల్పించటంతోనే డయేరియా వ్యాప్తిని నిర్మూలించగలమన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులు డయేరియా సోకి ఏటా 5.8 శాతం మృతి చెందుతున్నారన్నారు. గత ఏడాది జిల్లాలో 175 కేసులు నమోదయ్యాయన్నారు. చిన్నారుల్లో డయేరియా మరణాలను పూర్తి స్థాయిలో అరికట్టాలని ఆదేశించారు. జిల్లాలో 1.16 లక్షల మంది చిన్నారులు ఉన్నారని ఇంటింటికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింకుమాత్రలు పంపిణీ చేయాలన్నారు. జూలై 1 నుంచి ఆగస్టు చివరి వరకు డయేరియా నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. జూలై 15 నుంచి ఆగస్టు 16 వరకు అన్నిగ్రామాలలో ఆరోగ్య సమితి సమావేశాలు జరపాలన్నారు. శివారుకాలనీల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటిని ఎప్పటికప్పుడు పరిరక్షించాలన్నారు. తాగునీటి చెరువులు శుభ్రంగా ఉంచాలని, నీటిట్యాంక్‌లను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ పంచాయతీశాఖల అధికారులు నిర్లిప్తింగా ఉండరాదని హెచ్చరించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా ఇమ్యూనైజేషనాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, డీపీవో రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విద్యాసాగర్, ఐసీడీఎస్ పీడీ ఉమా తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీధర్

కారం కోరు.. కన్నెర్ర

రోడ్డును తవ్వేసిన గ్రామస్తులు
ఫ్యాక్టరీ మూసివేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటన

మేదరమెట్ల, జూన్ 26: కారం కోరు తట్టుకోలేని గ్రామస్తుల ఆగ్రహంతో కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామంలోని సింథైట్(కారం తయారీ) ఫ్యాక్టరీ తాత్కాలికంగా మూసివేయాలని యాజమాన్యం నిర్ణయించింది. ఫ్యాక్టరీ నుంచి కారం కోరు వస్తున్న నేపథ్యంలో పది రోజుల క్రితం గ్రామ స్తులు ఆందోళన చేయడంతో మూసివేశారు. మూడు రోజుల క్రితం ఫ్యాక్టరీ సిబ్బంది గ్రామస్థులతో మాట్లాడి ఎటువంటి కోరు రాదని హామీ ఇచ్చారు. దీంతో ఫ్యాక్టరీ ప్రారంభమైంది. కానీ మంగళవారం రాత్రి కోరు అధికంగా వచ్చింది. దీంతో గ్రామస్తులు బుధవారం ఉదయం ఫ్యాక్టరీ వద్దకు చేరుకోగా బాయిలర్‌లో మిరపకాయలు వ్యర్థాలతో కలిపి వేస్తుండడం గమనించారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఫ్యాక్టరీని మూసివేయాలని డిమాండ్ చేశారు. కార్మికులను, సిబ్బందిని బయటకు పంపివేశారు. ఫ్యాక్టరీకి వచ్చే రోడ్డును రెండు చోట్ల పగలగొట్టారు. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు యాజమాన్యం గోడలకు నోటీసులు అంటించింది. ఈ సమస్యపై డీజీఎం మహేంద్రను వివరణ కోరగా.. యాజమాన్యం ఆదేశాల ప్రకారం ఫ్యాక్టరీని మూసివేశామని.. తదుపరి కార్యాచరణను త్వరలో వెల్లడిస్తామన్నారు.


ఫ్యాక్టరీకు వెళ్లే దారిలో తీసిన గొయ్యి





మంత్రి స్వామికి శుభాకాంక్షలు చెప్తున్న ఎమ్మెల్యే కొండయ్య

మంత్రి స్వామికి ఎమ్మెల్యే కొండయ్య శుభాకాంక్షలు

చీరాల, జూన్ 26 : సాంఘిక, సంక్షేమ, గ్రామ వలంటీర్లు, సచివాలయాల శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి బుధవారం సెక్రటేరియట్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మంత్రి స్వామిని కలసి శుభాకాంక్షలు తెలిపారు. చీరాల నియోజకవర్గంలో ప్రసిద్ధి చెందిన వేటపాలెం జీడిపప్పుతో తయారు చేసిన దండను స్వామి మెడలో వేసి సత్కరించి అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో చీరాల నియోజకవర్గంకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రిని కోరారు.

జగన్‌ను పాతాళానికి తొక్కినా బుద్ధి మారలే

● బెదిరింపు రాజకీయాలకు కాలం చెల్లింది

● మంత్రి గొట్టిపాటి



మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

అద్దంకి, జూన్ 26 : జగన్‌ను జనం పాతాళానికి తొక్కినా బుద్ధి మారలేదని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. జగన్ తనకు ప్రతిపక్ష హోదా కల్పించాలంటూ స్పీకర్‌కు లేఖ రాయడంపట్ల గొట్టిపాటి స్పందిస్తూ బుధవారం ప్రకటన విడుదల చేశారు. సభాపతిని లక్ష్యంగా చేసుకొని జగన్‌రెడ్డి వక్ర భాష్యంతో లేఖ రరాయడం హాస్యాస్పదం అన్నారు. జగన్ బెదిరింపు రాజకీయాలకు కాలం చెల్లిందన్నారు. ఇప్పటికైనా ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయాలు చేయాలని, లేదంటే ఇప్పుడున్న క్రికె ట్ టీమ్ కాస్తా.. వాలీబాల్ టీమ్ అవుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్ద మనస్సుతో జగన్‌కు గౌరవం ఇవ్వాలని ఆదేశించిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అర్హత లేకున్నా జగన్ వాహనాన్ని లోపలకు అనుమతించారని, అయినా స్పీకర్‌ను లక్ష్యంగా చేసుకుని లేఖ రాసి జగన్ తన వక్ర బుద్ధిని చాటుకున్నారని అన్నారు.

గొట్టిపాటికి ఎమ్మెల్యే తంగిరాల శుభాకాంక్షలు

మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య బుధవారం సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న మురళీకృష్ణ

బాలిక విద్యతో సమాజాభివృద్ధి

విద్యార్థినులకు యూనిఫాం, పుస్తకాల పంపిణీ

పర్చూరు, జూన్ 26 : బాలిక విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఏపీ సోషల్ వెల్ఫేర్ జాయింట్ సెక్రటరీ, సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు ఉప్పుటూరి మురళీకృష్ణ అన్నారు. బుధవారం పర్చూరులోని ఏఎన్‌వీఎస్ బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు దాతల సహకారంతో సమకూర్చిన రూ.1.60 లక్షల విలువ చేసే యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు తదితర సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. ముఖ్య అతిథి ఉప్పుటూరి మురళీ కృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థినులకు ఉచిత విద్యను అందించాలన్న సంకల్పంతో స్వర్గీయ కృష్ణంశెట్టి కనకయ్య నేతృత్వంలో బాలికల పాఠశాలను ఏర్పాటు చేసి ఉచిత విద్యను అందిస్తుండడం అభినందనీయం అన్నారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ క్రిష్ణంశెట్టి రమేష్ బాబు, షేక్ అహ్మద్‌బాషా, కొల్లా రాజేశ్వరరావు(రాజా), సుజాత, లగడపాటి శంకర్, కృష్ణంశెట్టి పార్వతి, హెచ్‌ఎం ఎస్.అవని పాల్గొన్నారు.



దశరథ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బలరాం కుటుంబసభ్యులు

దశరథ సేవా దృక్పథం ఆదర్శనీయం

● మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం

పంగులూరు, జూన్ 26 : ఉన్నత వ్యక్తిత్వంతో నిరంతరం ప్రజలకు సేవలందించిన బెల్లంకొండ దశరథ రామయ్య జీవితం అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. అనారోగ్యంతో మరణించిన చందలూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బెల్లంకొండ దశరథ రామయ్య దశదిన కర్మ బుధవారం వారి స్వగృహంలో జరిగింది. దశరథ చిత్రపటం వద్ద నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేసీహెచ్ పున్నయ్యచౌదరి అధ్యక్షతన జరిగిన సంతాప సభలో బలరాం మాట్లాడుతూ మంచి క్రమశిక్షణ, నిజాయతీ కలిగిన దశరథ అకాల మరణం చాలా బాధాకరమని, దీర్ఘ కాలంగా రాజకీయంగా తనతో ఎంతో సన్నిహితంగా మెలిగిన సందర్భాలను ఆయన గుర్తు చేసుకున్నారు. ఖోఖో అసోషియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేసిన దశరథ క్రీడలను ఎంతో ప్రోత్సహించారని, బాడ్మింటన్ అసోషియేషన్ ప్రతినిధి కరణం పున్నయ్యచౌదరి, ఒలింపిక్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు అన్నారు. దశరథరామయ్య అజాతశత్రువుగా సీపీఎం నేత పెంట్యాల హనుమంతరావు, పెంట్యాల రాధాకృష్ణ ఆయన వ్యక్తిత్వాన్ని కొనియాడారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ విశ్రాంత మేనేజర్ మద్దినేని నాగేంద్రప్రసాద్, విశ్రాంత హెచ్‌ఎం నార్నె తాతయ్య రాఘవరాజు, కొల్లి సురేంద్ర, పెంట్యాల రామలింగస్వామి, కందిమళ్ల నాగేశ్వరరావు, పెంట్యాల సుబ్బారావు, గుర్రం ఆదిశేఖర్, బోరెడ్డి ఓబుల్‌రెడ్డి, గొల్లపూడి అంజయ్య, రామాంజనేయులు, కుటుంబసభ్యులు, పలువురు నేతలు పాల్గొన్నారు.

ఐదు గ్రామాలలో ఆలయ భూముల కౌలు వేలం

పంగులూరు, జూన్ 26 : మండలంలోని ఐదు గ్రామాలలో దేవాలయ భూములకు దేవదాయశాఖ అధికారులు బుధవారం బహిరంగ కౌలు వేలం నిర్వహించారు. మండలంలోని కోటపాడు, జనకవరం, చినమల్లవరం, కొండమంజులూరు, తూర్పు కొప్పెరపాడు గ్రామాలలోని ఆలయ భూములకు కౌలు వేలం నిర్వహించారు. కోటపాడు గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన భూములకు గతంలో రూ.58వేల కౌలు రాగా, బుధవారం నిర్వహించిన వేలంలో కౌలు ఆదాయం రూ.70వేలకు పెరిగింది. అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మంత్రిగా డోలా బాధ్యతల స్వీకరణ

సింగరాయకొండ గురుకుల పాఠశాలలో సైన్సు కోర్సులు పునరుద్ధరిస్తూ తొలిసంతకం

పాల్గొన్న ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు

ఒంగోలు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రిగా జిల్లాకు చెందిన డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలోని మూడో బ్లాక్ ఫస్ట్ ఫ్లోర్‌లో తనకు ప్రభుత్వం కేటాయించిన చాంబర్‌లో పలువురు సన్నిహితులు, శ్రేయోభిలాషులు సమక్షంలో శాస్త్రోక్తంగా ఆయన బాధ్యతలు తీసుకున్నారు. కొండపి నియోజకవర్గం నుంచి వరుసగా మూడుసార్లు విజయం సాధించిన డాక్టర్ స్వామికి ముఖ్యమంత్రి చంద్రబాబు తన కేబినెట్‌లో స్థానం కల్పించిన విషయం విదితమే. ఈనెల 12న మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన స్వామికి రెండు రోజుల అనంతరం సాంఘిక సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమం, సచివాలయాలు, వలంటీర్ల శాఖలను సీఎం కేటాయించారు. బుధవారం ఆ బాధ్యతలను ఆయన స్వీకరించారు. తన నియోజకవర్గ పరిధిలోని సింగరాయకొండ గురుకుల పాఠశాలలో గత ప్రభుత్వం రద్దు చేసిన ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులను పునరుద్ధరిస్తూ తొలి సంతకం చేశారు. అలాగే ఉమ్మడి జిల్లా పర్చూరు నియోజకవర్గం నాగులపాలెంలోని గురుకుల పాఠశాలలో సోలార్ విద్యుత్ ఏర్పాటు, కూరగాయలు నిల్వ చేసే కూలింగ్ చాంబర్‌ల ఏర్పాటు ఫైళ్లపైన కూడా ఆయన సంతకాలు చేశారు.

త్వరలో సాంఘిక సంక్షేమ శాఖ ప్రక్షాళన

బాధ్యతల స్వీకరణ అనంతరం మంత్రి స్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వం సాంఘిక సంక్షేమశాఖలో రూ.వేల కోట్లకుపైగా బకాయిలు పెట్టి వెళ్లిందన్నారు. దాని వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల ప్రభుత్వం అని చెప్పుకొని ఆ వర్గాలను మోసం చేసిందని మండిపడ్డారు. సాంఘిక సంక్షేమశాఖను ప్రక్షాళన చేసే చర్యలు త్వరలోనే చేపడతామన్నారు. పేద విద్యార్థులకు ఉపకరించే సంక్షేమ పథకలను సమర్థవంతంగా అమలు చేస్తామని చెప్పారు.

భారీగా హాజరైన టీడీపీ నేతలు, శ్రేణులు

డాక్టర్ స్వామి మంత్రిగా బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు, పార్టీ కొండపి నియోజకవర్గ శ్రేణులు భారీగా హాజరయ్యారు. రాష్ట్రమంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ఏలూరి సాంబశివరావు, బీఎన్ విజయ్‌కుమార్, ఎం.అశోక్‌రెడ్డి, ఎం.ఎం. కొండయ్య, మాజీ ఎమ్మెల్యేలు పోతుల రామారావు, నారపుశెట్టి పాపారావు, వైపాలెం, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జిలు గొట్టిపాటి లక్ష్మి, గుడూరి ఎరిక్షన్‌బాబు, కొండపి నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత దామచర్ల పూర్ణచంద్రరావు దంపతులు హాజరై డాక్టర్ స్వామికి అభినందనలు తెలిపారు. కాగా టీడీపీ యువనేత దామచర్ల సత్య ఆధ్వర్యంలో సచివాలయంలో మంత్రి స్వామి బాధ్యతలు స్వీకరణ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు జరిగాయి. కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి టీడీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో ఆ కార్యక్రమానికి తరలివెళ్లి పాల్గొన్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన ముఖ్యనాయకులు పలువురు స్వామిని కలిసి అభినందనలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సచివాలయంలో రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల పనితీరు, సాంఘిక సంక్షేమశాఖపై మంత్రి స్వామి సమీక్ష నిర్వహించారు. అలాగే మంత్రికి ఓఎస్‌డీగా నియమితులైన జిల్లాకు చెందిన డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారైన శిరిగిరి కామేశ్వరరావు కూడా బుధవారం అక్కడ బాధ్యతలు స్వీకరించారు.



డాక్టర్ స్వామిని అభినందిస్తున్న జిల్లాకు చెందిన టీడీపీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు

మత్తు పదార్థాల నియంత్రణకు కృషి చేయండి

ప్రతిజ్ఞ చేయించిన ఎస్పీ వకుల్ జిందాల్



ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

చీరాలటౌన్, జూన్ 26 : ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలంటే ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాల నియంత్రణకు కృషి చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. బుధవారం చీరాల కొత్తపేటలోని రావి సుబ్బరాయుడు కల్యాణ మండపంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేఖ దినం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజా యి, కొకైన్ వంటి వివిధ మాదకద్రవ్యాల వలన యువత జీవితాలు నాశనమ వుతున్నాయని అన్నారు. అంతేకాకుండా హత్యలు, దాడులు, వివిధ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడి అవతలి వ్యక్తుల జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నారని జిందాల్ ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల నుంచి పాల్గొన్న విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వక్తలు న్యాయవాదులు ఠాగూర్, భాను, సామాజిక వేత్త ఇమ్మానియేల్‌తో మాట్లాడించారు. కార్యక్రమంలో డీఎస్పీ బేతపూడి ప్రసాద్, ఎస్బీ సీఐ మల్లికార్జునరావు, సీఐలు శేషగిరిరావు, సత్యనారాయణ, ఎస్ఐలు మురళి, శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అద్దంకి : మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేఖ దినం సందర్భంగా బుధవారం పోలీస్, ఎస్ఈబీ అధికారుల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించి, విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. ఎస్ఈబీ ఎస్ఐ సైమన్, ఎస్సై నాగరాజు, ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయవాదులు రఫీ, ఎం.శ్రీను, ప్రకాష్ పాల్గొన్నారు.

పంగులూరు : మత్తు పదార్థాల వల్ల భవిష్యత్ నాశనమవుతుందని, యువత వాటికి దూరంగా ఉండాలని ఎస్ఐ తిరుపతిరావు అన్నారు. పంగులూరులో ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా బుధవారం సంకల్ప ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ యువత గుట్కా, గంజాయికి బానిసై జీవితాలను నాశనం చేసుకుంటుందన్నారు. మత్తు పదార్థాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఐ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిరిగిరి శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాం : మాదకద్రవ్యాల వినియోగంతో ఆరోగ్యంతో పాటు వారి భవిష్యత్‌కు చేటు కలుగుతుందని ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పోలీసులు, పాఠశాల విద్యార్థులు బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సోపిరాల రైల్వే గేటు సెంటర్‌లోని ఆర్‌అండ్‌బీ రహదారిపై పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బల్లికురవ : మత్తు పదార్థాలను విక్రయించే వారిపై చర్యలు తప్పవని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరసింహారావు హెచ్చరించారు. బుధవారం బల్లికురవ మండల కేంద్రంలో యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మత్తుకు బానిసైతే కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో రవి శంకర్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్టూరు : మత్తు పదార్థాలకు యువత బానిస కావద్దని, బంగారు భవితను నాశనం చేసుకోవద్దని సీఐ రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం మార్టూరు సెంటర్లో డ్రగ్స్‌తో అనర్థాలపై విద్యార్థులతో పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుంచి అండరుపాస్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు మహమ్మద్‌బాషా, సైదా, పోలీస్ సిబ్బంది రాయల్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంకొల్లు : మాదకద్రవ్యాల నియంత్రణ దినం సందర్భంగా పోలీసు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ మల్లికార్జునరావు మాట్లాడుతూ మత్తకు బానిసైతే జీవితాలు చిత్తవుతాయన్నారు. ఎవరూ మత్తు జోలికి పోవద్దన్నారు.

పర్చూరు : మాదకద్రవ్యాలు విక్రయాలు నిర్వహించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సి.శీతారామయ్య హెచ్చరించారు. పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అవవాటు పడి జీవితాలను వృధా చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్.రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల చిన్నారులకు అభినందనలు



విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న సుధాకరరావు

అద్దంకిటౌన్, మే 26 : 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన ప్రత్యేక అవసరాలున్న చిన్నారులను ఆయా శాఖల అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి 10వ తరగతిలో అద్దంకిలోని గురకాయపాలెం ఉన్నత పాఠశాలలో కోడూరి జాయ్ హదస్సా (బుద్ధిమాంద్యం) కలిగిన పది పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. అలాగే తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వినికిడి లోపం కలిగిన పందిరి ప్రశాంత్ పదిలో ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు. వీరిని బుధవారం బాపట్ల జిల్లా సమగ్ర శిక్షా కార్యాలయంలో ఐఈ కోఆర్డినేటర్ జ్యోత్స్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సమగ్ర శిక్షా జిల్లా ప్రాజెక్టు అడిషినల్ కోఆర్డినేటర్ వెంకట సుధాకరరావు చేతుల మీదుగా మెమొంటోను అందజేసి అభినందించారు. అలాగే విద్యార్థులతో పాటు ఐఈఆర్టీ ఉపాధ్యాయులు కొంగల శ్రీనివాస్, పాలపర్తి యోనాలను అధికారులు, ఎంఈవోలు గంగాధర్‌రావు, సుధాకరరావు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైనవిద్య

పర్చూరు : ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య దొరుకుతుందని తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొల్లా సుభాష్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని నాగులపాలెం(ఎల్ఈ) పాఠశాలలో ప్రభుత్వం ద్వారా సమకూర్చిన స్కూల్ బ్యాగ్స్, షూస్, పాఠ్యపుస్తకాలు తదితర సామగ్రిని సర్పంచ్ దాసి సుధారాణి చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయి వసతులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బొప్పూడి ప్రసాద్‌బాబు, ఉపాధ్యాయులు వి.రాధిక, గ్రామస్థులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు

● పొలంలో గడ్డి దగ్ధం

అద్దంకి, జూన్ 26 : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు రేగి పొలంలో గడ్డి దగ్ధమైంది. అద్దంకి పట్టణంలోని శ్రీరామ్‌నగర్ ఎస్టీ కాలనీ ఎదురుగా ఉన్న పంటపొలాల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్లు షార్ట్ సర్క్యూట్‌తో బుధవారం మధ్యాహ్నం మంటలు ఏర్పడి గడ్డి కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

● ఒకరి పరిస్థితి విషమం

● అపస్మారక స్థితిలో మాజీ సైనికుడు

చీరాలటౌన్, జూన్ 26 : జాతీయ రహదారిలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. అందిన వివరాల ప్రకారం... చీరాల పరిధిలోని లక్ష్మీపురానికి చెందిన పల్లం బెన్ని, అబ్దుల్ కలామ్ కాలనీకు చెందిన బ్రహ్మ వంశీ, పాత చీరాలకు చెందిన భీమవరపు శ్రీనివాసరావు ముగ్గురు ఒకే ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. వీరు రహదారిలోని మన్నం అపార్ట్‌మెంట్ సమీపంలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టారు. దీంతో వంశీకి కుడి కన్నుతో పాటు తలకు తీవ్ర రక్త గాయాలు కాగా, బెన్ని తల వెనుక భాగం కుడి కన్నుపై అలాగే శ్రీనివాసరావుకు తల వెనుక భాగంలో తీవ్ర రక్త గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వీరిని 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. భీమవరపు శ్రీనివాసరావు మాజీ సైనికుడు, ఇతనిది నాగులుప్పలపాడు మండలం వమ్మెవరం కాగా, గతకొంత కాలంగా పాత చీరాలలో నివాసముంటున్నాడు. మిగిలిన ఇద్దరు మార్బుల్స్ వర్క్ చేస్తుంటారని తెలిసింది.



తీవ్రంగా గాయపడ్డ ఉన్న వంశీ



అపస్మారక స్థితిలో బెన్ని



బండలాగుతున్న ఎద్దు (ఇన్‌సెట్లో) బహుమతి అందజేస్తున్న కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావు

సత్తాచాటిన టంగుటూరు ఎడ్లు

వలేటివారిపాలెం, జూన్ 26 : నెల్లూరు జిల్లా వలేటివారిపాలెం మండలం పోకూరులో ఓసూరమ్మ తిరునాళ్ల సందర్భంగా టీడీపీ సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన మక్కెన కోటేశ్వరరావు ఎడ్లు మొదటి బహుమతిగా రూ.55 వేలను సాధించాయి. ఈ పోటీలకు గుంటూరు, ప్రకాశం. పల్నాడు, కర్నూలు, బాపట్ల జిల్లాల నుంచి 14 ఎడ్ల జతలు వచ్చాయి. సీనియర్ విభాగంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన శివకృష్ణచౌదరి ఎడ్లు రెండవ బహుమతి రూ.35 వేలు, బాపట్ల జిల్లా బల్లికురవ మండలం బల్లికురవకి చెందిన వీరాస్వామి చౌదరి ఎడ్లు మూడవ బహుమతి రూ.20 వేలు సాధించాయి. జూనియర్ విభాగంలో గుంటూరుకు చెందిన సోమిశెట్టి ఆంజనేయులు ఎడ్లు మొదటి బహుమతి రూ.54 వేలు, పల్నాడు జిల్లా రెంటచింతల మండలం రెంటాలకి చెందిన పిన్నెబోయిన సూర్య అప్పిర్ ఎడ్లు రెండవ బహుమతి రూ.30 వేలు, గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొరేడుబాలవారిపాలెంకి చెందిన గూడవల్లి లక్ష్మీదీక్షితాచౌదరి ఎడ్లు మూడవ బహుమతి రూ. 20 వేలు సాధించాయి. సీనియర్ విభాగంలో గెలుపొందిన ఎడ్లజతకు బహుమతులను అత్తోటి వెంకటేశ్వర్లు, నవ్వులూరి రమణయ్యలు అందచేశారు. జూనియర్ విభాగంలో గెలుపొందిన ఎడ్లకు ప్రథమ బహుమతి అత్తోటి హస్పిటల్‌కు చెందిన రాంబాబు, ద్వితీయ బహుమతిని బొల్లినేని ప్రసాద్, తృతీయ బహుమతిని నల్లమోతు రవి అందచేశారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన ఎడ్లజతల యజమానులకు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

అంగన్‌వాడీకేంద్రాలలో పౌష్టికాహారం

పంగులూరు, జూన్ 26 : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతిఒక్కరికీ క్రమం తప్పకుండా అందజేస్తున్నట్లు సూపర్‌వైజర్ జయప్రద తెలిపారు. పంగులూరులోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం సూపర్‌వైజర్ జయప్రద తనిఖీ చేశారు. కేంద్రంలోని పిల్లలు, గర్భిణిలు, బాలింతలు, కిషోర బాలికలకు పౌష్టికాహారం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పి.రజని, డి.స్వర్ణలత, అన్నమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ

యద్దనపూడి, (మార్టూరు) జూన్ 26 : మండలంలోని అనంతవరం ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఒంగోలులో ప్రైవేటు కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్న పెదవల్లి శ్రీనివాసరావు రూ.10వేల విలువ చేసే పుస్తకాలు, ఇతర వస్తువులను పంపిణీ చేశారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో ఎంఈవో చిలుకూరి గోపి చేతులమీదగా విద్యార్థులకు అందించారు.

రిసార్ట్‌ల నిర్వాహకులకు నిబంధనలు పట్టవా..?

» ప్రాణాలు కోల్పోతున్నా వీడని నిర్లక్ష్యం
» పట్టించుకోని అధికారులు




తీరంలో సముద్రం వ్యూ కోసం మాయమైన మడ చెట్లు
విద్యుత్ చౌర్యానికి రిసార్ట్ నిర్వాహకుడు ఏర్పాటు చేసిన సప్లై బోర్డు

చీరాల, జూన్ 26 : రిసార్ట్‌ల నిర్వాహకుల్లో కొందరు నిబంధనలను తుంగలోకి తొక్కుతున్నారు. సముద్ర స్నానాలకు వచ్చిన కొందరు యువకులు ప్రమాదవశాత్తు మృత్యువాత పడుతున్నారు. అలాంటి ఘటనలు జరగకుండా తగిన జాగ్రత్త చర్యలు చేపట్టేందుకు పాలకులు, అధికారులు సంయుక్తంగా కృషి చేస్తున్నారు. అయితే కొందరు రిసార్టుల నిర్వాహకులు మాత్రం పోతున్న ప్రాణాలకు తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. వాడరేవు, రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం మధ్య కొందరు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టటం లేదు. సాధారణంగా పేదల వాడల్లో ఎక్కడన్నా ఎవరన్నా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే వారిపై తక్షణం చర్యలు చేపట్టే విద్యుత్ శాఖ బడాబాబుల విషయంలో ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తుందో వారే చెప్పాలి. రామాపురం, కఠారివారిపాలెం మధ్య నున్న ఓ రిసార్ట్ నిర్వాహకుడు తీరంలో వారు ఏర్పాటు చేసే పార్టీలు, విందు, వినోదాలకుగాను విద్యుత్ సరఫరాకు విద్యుత్ స్తంభాల నుంచి చౌర్యానికి పాల్పడతున్నారు. ఇదెక్కడో మారుమూల ప్రాంతం కాదు. రోడ్డు పక్కనే. ఇదిలావుంటే వారు ఆ విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన సప్లై బోర్డులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. ఆ ప్రాంతంలో జీవాలు, గేదెల కాపర్లు, మత్స్యకారులు తిరుగుతుంటారు. విద్యుత్ వైర్లు తీరం వరకు ఉంటాయి. ఏదన్నా ప్రమాదం జరిగి ప్రాణాలు మూల్యంగా చెల్లించాల్సి వస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ఆ ప్రాంత ప్రజలు, పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే సముద్రంలో దిగిన యువకులు గణనీయంగా మృతి చెందుతున్న క్రమంలో ఇక విద్యుత్ షాక్‌తో కూడా ప్రమాదాలు సంభవించే పరిస్థితి ఉందనే అపప్రదను మూటకట్టుకోవద్దని ప్రజలు సూచిస్తున్నారు.



ఖాజావలిని అభినందిస్తున్న పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ చైర్మన్ దేవరాజ్

పవర్ లిఫ్టర్‌కు అభినందనలు

చీరాల, జూన్ 26 : పవర్ లిఫ్టింగ్ పోటీలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధిస్తున్న ఖాజావలి క్రీడాకారులకు స్ఫూర్తినీయుడని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా చైర్మన్, శ్రీకామాక్షి కేర్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ తాడివలస దేవరాజ్ అన్నారు. పంజాబ్ రాష్ట్రం పాటియాలలో జరిగిన పోటీల్లో జూనియర్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ సాధించిన ఖాజావలిని బుధవారం దేవరాజ్ తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టులో యూరప్‌లో జరిగే అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఖాజావలి ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, సెక్రటరీ అన్నదాత ప్రసాద్, అమరేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

30న సంతాన సాఫల్య వైద్య శిబిరం

ఇంకొల్లు, జూన్ 26 : జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 30న ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రెసిడెంట్ రావినూతల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

పంట కాలువల అభివృద్ధికి నిధులు

ఫలించిన ఎమ్మెల్యే కొండయ్య కృషి



స్టువర్టుపురం చానల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య (ఫైల్)

చీరాల, జూన్ 26 : కొమ్మమూరు ఆయకట్టు పరిధిలోనిపంటకాలువల అభివృద్ధికి రూ.86.96 లక్షలు మంజూరయ్యాయని నీటిపారుదల శాఖ అధికారులు చెప్పారు. చీరాల, పర్చూరు. బాపట్ల నియోజవకర్గాల పరిధిలో నిర్దీత 14 పనులకు సంబంధించి ఆ మొత్తం మంజూరు అయింది. గత వారంలో నియోజవకర్గ ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య నీటిపారుదల శాఖ, మురుగునీటి పారుదలశాఖ, వ్యవసాయశాఖ అధికారులతో కలసి మండల పరిధిలోని స్టువర్టుపురం చానల్‌ను పరిశీలించారు. ఆ సందర్భంగా ఆ చానల్ ద్వారా సుమారు 27 గ్రామాల రైతులకు సాగునీరు సరఫరా అవుతుందని తెలిపారు. ఎగువన బెడ్ లెవల్ పెంచటంతో తమకు దిగువకు సాగునీరు సక్రమంగా రావటం లేదని, జంగిల్ క్లియరెన్స్ లేక ఎదురవుతున్న ఇబ్బందులను రైతులు ఎమ్మెల్యే కొండయ్య ద్వారా అధికారుల దృష్టికి తెచ్చారు. దీనిపై కొండయ్య యుద్ధప్రాతిపదికన స్పందించారు. ఆ క్రమంలో కెడబ్ల్యుడికి సంబంధించి మూడు నియోజకవర్గాల పరిధిలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి వేసే అంచనాలలో చానల్‌ను మెరుగుపరిచే పనులకు కూడా చేర్చారు. దీంతో ఖరీఫ్ వర్షాలు పూర్తిస్థాయిలో ప్రారంభమయి, వ్యవసాయ పనులు ప్రారంభమయ్యే లోపే ఆయా మరమ్మతులు చేపట్టే అవకాశం ఉందని చెప్తున్నారు. అనంతరం పంట కాలువలు మొత్తం పూర్తి స్థాయిలో అభివృద్ధి పరిచేందుకు ఆయా పనులకు సంబంధించిన డీపీఆర్‌ను అధికారులు సిద్ధం చేస్తున్నారు. మొత్తమ్మీద తొలిసారిగా రైతు సమస్యలకు ప్రాధాన్యతను ఇస్తూ అడుగులు వేయడంపై గ్రామీణ ప్రాంతాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

పండ్ల తోటల పెంపకంపై అవగాహన

అద్దంకిటౌన్, జూన్ 26 : ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న సన్న కారు రైతులకు పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యాన శాఖ, ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రా మాల్లో అర్హత కలిగిన రైతులను గుర్తించి వారికి వివిధ రకాల పండ్ల తోటల పెంపకం, వాటి ప్రాధాన్యత, ప్రభుత్వం నుంచి అందుతున్న రాయితీలపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల వారికి ఇచ్చిన లక్ష్యాలను సిబ్బంది అందరు పూర్తి చేయాలని సూచించారు. ఏఏ ప్రాంతాలల్లో ఏఏ పండ్ల మొక్కలు సాగు చేసుకోవచ్చనే విషయాలను ఉద్యాన శాఖ అధికారి దీప్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీవో గాయత్రిదేవి, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ గుడి వార్షికోత్సవం

మార్టూరు, జూన్ 26 : మండలంలోని నాగరాజుపల్లి గ్రామంలో బుధవారం పోలేరమ్మ తల్లి దేవస్థానం వార్షికోత్సవం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయాన్నే విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని మహిళలు ఇంటి నుంచి పొంగళ్లను తీసుకుని గుడికి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మొదట మహిళలు పొంగలిపెట్టిన పాత్రను తలపై పెట్టుకొని ప్రదక్షిణాలు చేశారు. తరువాత అమ్మకు నేవైద్యాన్ని నివేదించారు. అమ్మవారి ఆశీస్సులు కోరుతూ భక్తితో పూజలు చేశారు.

విద్యార్థులు గురువులను పూజించాలి

ఇన్‌చార్జి డీఈవో వెంకటేశ్వర్లు



సుధారాణి దంపతులను సత్కరిస్తున్న ప్రతినిధులు

వాడరేవు(చీరాలటౌన్), జూన్ 26 : విద్యార్థులు గురువులను పూజించాలని తద్వారా ఉన్నతంగా రాణిస్తారని ఇన్‌చార్జి డీఈవో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండల పరిధిలోని వాడరేవు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న పి.సుధారాణి ఇటీవల స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ పొందారు. ఈక్రమంలో బుధవారం పాఠశాలలో సుధారాణి దంపతులకు ఏర్పాటు చేసిన సన్మాన సభలో పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, రాధాకృష్ణ, పవని భానుచంద్రమూర్తి, రామకృష్ణ, జయప్రద, నరసింహారావు, మీర్జాన్, సూరిబాబు, లూకా, నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్వారకపాడులో లాటరీ ద్వారా రేషన్ డీలర్ ఎంపిక

మార్టూరు, జూన్ 26 : వైసీపీ ఘోర ఓటమి, టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామాలలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆనందంలో మునిగిపోయారు. గ్రామాలలో ఆర్థిక వనరులు సంపాదించే పనులకోసం కార్యకర్తలు పోటీపడుతుంటారు. వాటిలో ముఖ్యమైనది రేషన్ దుకాణాలు. మండలంలో ఈ రేషన్ దుకాణాలు కోసం గ్రామాలలో పోటీ ఎక్కువగా ఉంది. గతంలో వైసీపీ పాలనలో రేషన్ దుకాణాలను నిర్వహించినవారు సహజంగా పక్కకు తప్పుకోగా, వాటిని పొందేందుకు టీడీపీ కార్యకర్తలలో పోటీ నెలకుంది. కార్యకర్తలలో ఎవరికి రేషన్ దుకాణం కేటాయించాలో అర్థం కాక నాయకులకు తలనొప్పిగా మారింది. ఒక గ్రామంలో ఏకంగా ఒక రేషన్ దుకాణాన్ని నలుగురు భాగస్వామ్యులుగా నిర్వహించుకోవాలని నాయకులు సర్దుబాటుచేస్తున్నారు. మండలంలోని వలపర్ల గ్రామ పంచాయతీలోని ద్వారకపాడు గ్రామంలో మాత్రం అందరూ ఐక్యంగా కలిసిమెలిసి లాటరీ పద్ధతిలో రేషన్ డీలర్‌ను ఎంపిక చేసుకున్నారు. ఈ గ్రామంలో 400కు పైగా రేషన్ కార్డుదారులు ఉన్నారు. డీలర్ కోసం పోటీపడేవారంతా ఒక స్కీమును ఏర్పాటు చేసుకున్నారు. రేషన్ దుకాణం కావల్సినవారు ఒకొక్కరు రూ.2వేల వంతున పోగేశారు. ఈ విధంగా డీలర్ కోసం 26 మంది పోటీ పడగా వారంతా 52వేల రూపాయలను పోగేశారు. అనంతరం 26 మంది పేర్లతో లాటరీ తీయగా ఒక వ్యక్తి పేరురాగా అతనికి రేషన్ డీలర్‌ను కేటాయించినట్లు అందరూ సమ్మతించారు. ఇంకో విశేషం ఏమిటంటే లాటరీలో డీలర్‌గా ఎంపికైన వ్యక్తి గ్రామానికి లక్ష రూపాయలు విరాళంగా ఇవ్వాలనేది నిబంధన. ఈ లక్ష రూపాయలను గ్రామంలో బడికో.. గుడికో ఖర్చు పెట్టడానికి గ్రామస్థులు నిర్ణయిస్తారు. అందుకు అంగీకరించిన వ్యక్తులే లాటరీలో పాల్గొన్నారు. ఇక 26మంది సభ్యులు చెల్లించిన రూ.52వేలను గంగమ్మ తల్లి గుడి అభివృద్ధి కోసం ఖర్చు చేసేందుకు నిర్ణయించారు. ఏదిఏమైతేనేం గ్రామంలో ఎలాంటి మనస్పర్ధలు లేకుండా, కార్యకర్తల మధ్య అపోహలు ఏర్పడకుండా ప్రశాంతంగా డీలర్ ఎంపిక జరగడంపట్ల గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రాజశేఖర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఏలూరి

రాజశేఖర్ మృతి తీరనిలోటు

ఎమ్మెల్యే ఏలూరి నివాళి

చినగంజాం, జూన్ 26 : టీడీపీ సీనియర్ నాయకుడు తాటి రాజశేఖర్ మృతి పార్టీకి, కుటుంబానికి తీరని లోటుని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. చినగంజాం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు తాటి రాజశేఖర్ ఈనెల 24వ తేదీన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పూలవారిపాలెం గ్రామంలో రాజశేఖర్ స్వగృహం వద్ద మృతదేహాన్ని బుధవారం ఎమ్మెల్యే ఏలూరి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాజశేఖర్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే గుర్తు చేశారు. టీడీపీ చినగంజాం, ఇంకొల్లు మండలాల అధ్యక్షులు పొద వీరయ్య, నాయుడు హనుమంతరావు, నాయకులు పర్వతరెడ్డి సత్యనారాయణ, టీ.జయరావు, అజాద్, బత్తుల శ్రీనివాసరావు, యార్లగడ్డ లక్ష్మీ, నరహరి శ్రీనివాసరావు, మోటుమర్రి రామసుబ్బారావు, పీ.పార్థసారథి, బెల్లంకొండ రమేష్‌బాబు, తుమ్మలపెంట శ్రీనివాసరావు, ధర్మవరపు ఏసునారాయణ, వడ్లమూడి సత్యనారాయణ, కే.విష్ణు, సతీష్, పీ.లక్ష్మీనారయణ, షేక్ ఖాదర్‌బాషా, జి.నరసింహారావు, ఆరే సురేంద్రబాబు, డి.తిరుపతిరావు, షేక్ జిలాని, నీలాయపాలెం గ్రామ సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు, జనసేన మండల అధ్యక్షులు సందు శ్రీనివాసరావు, బీజేపీ సీనియర్ నాయకులు శిఖరం కోటయ్య, పలు గ్రామాలకు చెందిన కూటమి నాయకులు రాజశేఖర్ మృతదేహానికి నివాళులర్పించారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ చక్రవర్తి

సంపూర్ణ పారిశుధ్యమే లక్ష్యం

మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి

చీరాల, జూన్ 26 : రాష్ట్రంలో పలుచోట్ల డయేరియా ప్రబలుతోంది. ఈ నేపథ్యంలో పారిశుధ్య కార్మికులు, శానిటరీ అధికారులు, సిబ్బంది సంపూర్ణ పారిశుధ్యమే లక్ష్యంగా పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి అన్నారు. బుధవారం ఆయన పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలిచారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల ప్రబలకుండా తీసుకవల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ రుసుం వసూలుకు వేలం

మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చీరాల, పేరాల మార్కెట్‌లకు, తోపుడు బండ్ల వ్యాపారులకు సంబంధించి బహిరంగ వేలం పాటలు కమిషనర్ చక్రవర్తి సమక్షంలో నిర్వహించారు. చీరాల నెహ్రూ కూరగాయల మార్కెట్ (9నెలలకాలవ్యవధికి) రూ.70,60,000, పేరాల మార్కెట్‌కు రూ.4,85,000, తోపుడుబండ్లకు రూ.9,79,000 హెచ్చుగా పాడిన పాటదారులకు కేటాయించారు. కార్యక్రమంలో ఆర్వో శ్యామలాదేవి, ఆర్.ఐలు, సిబ్బంది, పాటదారులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖ అదనపు కార్యదర్శికి సన్మానం

పర్చూరు, జూన్ 26 : రాష్ట్ర రెవెన్యూ శాఖలో అదనపు కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న కవల వీరాంజనేయులను పర్చూరులో బుధవారం ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ ఉద్యోగిగా వివిధ శాఖలో ఉన్నత ఉద్యోగిగా విధులు నిర్వహించి ఈనెల 30న ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా రాష్ట్ర సచివాలయ సంఘం మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సోషల్ వెల్ఫేర్ జాయింట్ సెక్రటరీ ఉప్పుటూరి మురళీకృష్ణ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

బెట్టింగ్‌లు కాచిన ఉద్యోగులలో బదిలీ భయం

బల్లికురవ, జూన్ 26 : టీడీపీ ప్రభుత్వం ఏర్పాటై పక్షం రోజులు దాటగా అన్ని శాఖలవారీగా గతంలో వైసీపీ పార్టీకి అనుకులంగా పని చేసిన అధికారులను బదిలీ చేస్తారన్న ప్రచారం విన్పిస్తుండడంతో ఉద్యోగులలో భయం నెలకుంది. కొందరు ఉద్యోగులు వైసీపీ అధికారంలోకి వస్తుందని అతి ధీమాతో బెట్టింగ్‌లు కూడా పెట్టారు. వారి పేర్లు ఇప్పుడు బయటకు రావడంతో వారంతా ఆందోళనలో పడ్డారు. తమను ఉక్కడికి పంపుతారో అని చర్చించుకుంటున్నారు. రెవెన్యూ శాఖకు చెందిన ఒక గ్రామ ఉద్యోగి తిరిగి వైసీపీ అధికారంలోకి వస్తుందని తన తోటి ఉద్యోగితో బెట్టింగ్ పెట్టినట్లు తెలిసింది. ఈ విషయం ఉద్యోగుల మధ్య చర్చ నడుస్తుంది. పంచాయతీ కార్యదర్శులు కూడా తమను ఇక్కడే ఉంచాలని టీడీపీ గ్రామ నేతలను ప్రసన్నం చేసుకుంటున్నారు. మొన్నటి వరకు టీడీపీ నేతలు పిలిచినా రాని ఉద్యోగులు ఇప్పుడు వారి ఇళ్ల వదకు క్యూకడుతున్నారు. తమను ఇక్కడే ఉంచాలని వేడుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు ఇప్పటికే తమ బదిలీ ఖాయమని తెలిసి కొందరు ఇతర ప్రాంతాలకు వెళ్లి అక్కడి రాజకీయ నేతల సిఫార్సులు చేయించుకుంటున్నారు.

బదిలీల వ్యవహరంతో అధికారులు ఎవరూ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో కూడా ఉం డడం లేదు. ఎవరిని అడిగినా తాము బదిలీ అయ్యే అవకాశం ఉందని అ పనిపై ఉన్నామని చెప్తున్నట్లు ప్రజలు అంటున్నారు. మరో పదిరోజుల్లో గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి అధికారుల బదిలీలు జరిగే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.





వడ్డిపాళెం నుంచి పసుపు, కుంకుమను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు (ఇన్‌సర్ట్) వెంగమాంబ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కల్యాణం కమనీయం!

- రమణీయంగా వెంగమాంబ వివాహం
- వడ్డిపాళెం నుంచి పసుపు, కుంకుమ ఊరేగింపు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూన్ 26 : నర్రవాడలో వెంగమాంబ పేరంటాలు, గురవయ్య నాయుడుల కల్యాణం అశేష భక్తజనం నడుమ వేడుకగా జరిగింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా నాల్గవ రోజు బుధవారం జరిగిన ఈ వేడుకను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత వెంగమాంబ ఉత్సవమూర్తులను, ముత్యాల తలంబ్రాలను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కుటుంబ సభ్యులు, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు భాజాభజంత్రీల నడుమ ప్రధాన ఆలయం నుంచి కల్యాణ వేదిక వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. స్వామిఅమ్మవార్లకు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, ధర్మకర్తలు, అర్చకులు పట్టువస్త్రాలు తీసుకొచ్చారు. అమ్మవారి పుట్టినిల్లయిన వడ్డిపాళెం నుంచి పసుపు, కుంకుమను ఊరేగింపుగా దేవస్థానం వద్దకు తీసుకొచ్చారు. చిత్తూరు, గురజాల ఎమ్మెల్యేలు జగన్‌మోహన్‌రావు, యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు యాదవ్, దేవదాయ శాఖ ఏసీ శ్రీనివాసులరెడ్డిలు అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈవో ఉషశ్రీ, మాజీ చైర్మన్ పచ్చవ కరుణాకర్‌బాబు, ఆలయ ధర్మకర్తలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కాగా కల్యాణాన్ని కనులారా వీక్షించేందుకు భక్తజనం తరలిరావడంతో నర్రవాడ గ్రామం కిక్కిరిసి పోయింది.

● అంబరాన్నంటిన ప్రధానోత్సవం

వెంగమాంబ ప్రధానోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. వేలాది మంది అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. వడ్డిపాళెం నుంచి ప్రధానోత్సవం ప్రారంభమై నర్రవాడ వీధుల గుండా కొనసాగింది. భజనలు, కోలాటాలు నృత్యాలు ఆకట్టుకున్నాయి.

● ఉత్సవాల్లో నేడు

వెంగమాంబ ఉత్సవాల్లో చివరి రోజు గురువారం బండ్లపొంగళ్లు, బండలాగుడు పోటీలు జరగనున్నాయి.



ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న ఎమ్మెల్యే కాకర్ల, ఆలయ ధర్మకర్తలు

రొట్టెల పండుగకు విస్తృత ఏర్పాట్లు

- ప్రభుత్వ యంత్రాంగమంతా సమష్టిగా కృషి చేయాలి
- అధికారుల సమీక్షలో మంత్రులు ఆనం, నారాయణ

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 26 : నగరంలోని బారాషహీద్ దర్గాలో వచ్చే నెల 17వ తేదీ నుంచి రాష్ట్ర పండుగగా జరిగే రొట్టెల పండుగకు విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. పండుగ ఏర్పాట్లపై బుధవారం సాయంత్రం దర్గా ప్రాంగణంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కలిసి వారు సమీక్షించారు. మంత్రి ఆనం మాట్లాడుతూ భక్తుల కోరికలు తీరుతున్నందునే ఒకరోజు జరిగే పండుగ ఏడు రోజులకు చేరిందన్నారు. ఈ పండుగ ఏర్పాట్లు నగరానికే పరిమితం కాకుండా ఏఎస్‌పేట, కసుమూరులతోపాటు అన్ని మసీదులు, ఈద్గాల వద్ద భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రమాదాలు జరగకుండా రహదారులు, బీచ్‌ల వద్ద పోలీసులు రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మరో మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ గతంలో ఆగిన అభివృద్ధి పనులను కొంత ఆలస్యంగానైనా పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకముందు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూసీఎం చంద్రబాబును ఒప్పించి దర్గాలో ఆగిన అభివృద్ధి పనులు పూర్తి చేయించాలని మంత్రులకు విజ్ఞప్తి చేశారు. దర్గా పరిసర ప్రాంతాలలో ఎవరూ బ్యానర్లు కట్టరాదని ఆదేశించారు. పండుగ కోసం చేస్తున్న పనులపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్త చూశారా అని అధికారులు ప్రశ్నించారు. పనులు నాణ్యతతో చేసి శాశ్వతంగా ఉండేలా చేయాలన్నారు. నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించవద్దని కమిషనర్‌ను కోరారు. అనంతరం ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్‌లను, ఇతర శాఖ అధికారులను శాఖాపరంగా చేపట్టే భక్తుల సౌకర్యాలను సమీక్షించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను మంత్రులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, భానుశ్రీ, తాళ్లపాక అనురాధ, విజితరెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు, తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణాల చెరువులో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు ఆనం, నారాయణ



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఆనం

వచ్చే నెల 1 నుంచి

డయేరియాపై స్పెషల్ డ్రైవ్

● కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ శ్రీకారం

నెల్లూరు (వైద్యం), జూన్ 26 : వర్షాకాలంలో డయేరియా (అతిసార) వ్యాధి ప్రబలకుండా కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నివారణ చర్యలు చేపడుతోంది. జూలై 1 నుంచి రెండు నెలల పాటు వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ సంయుక్తంగా ఈ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సమాయత్తం అవుతున్నాయి. ఏఎన్ఎంలతోపాటు ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పిస్తారు. వ్యాధిగ్రస్థులను గుర్తించి చికిత్స వివరాలు సేకరించనున్నారు. గతంలో నెల్లూరులోని కుసుమ దళితవాడ, బట్వాడిపాళెంలో నీటి కాలుష్యం కారణంగా 70 మంది డయేరియాకు గురవగా ఇద్దరు మృత్యువాత పడ్డారు. గతేడాది కూడా జిల్లావ్యాప్తంగా డయేరియా కేసులు ఆందోళన కలిగించాయి.

● ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో బాధితులు

ఇప్పటికే ఉమ్మడి నెల్లూరు జిల్లాలో డయేరియా కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. గూడూరు మండలం చెన్నూరుకు చెందిన ట్రైబుల్ వెల్ఫేర్ హాస్టల్‌లో 21 మంది విద్యార్థులు డయేరియాకు గురై చికిత్స పొందుతున్నారు. సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, మర్రిపాడు, బుచ్చిరెడ్డిపాళెం మండలాల్లోనూ కేసులు నమోదయ్యాయి. జిల్లాలో 2వేల మంచినీటి రక్షిత పథకాలు ఉన్నాయి. 15 రోజులకోసారి ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయాల్సి ఉంది. అయితే, ఇటీవల వరకు ఎన్నికల హడావిడి ఉండటంతో చాలా గ్రామాల్లో ట్యాంకులను శుభ్రం చేయలేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఆయా ట్యాంకుల ద్వారా వచ్చే నీరు కలుషితమవుతోంది. తాగునీటి పైపుల్లో మురుగు చేరి కూడా నీరు కలుషితమవుతోంది. వీటి ద్వారా పలువురు డయేరియాకు గురవుతున్నారు.

రామతీర్థం తిరునాళ్ల ప్రారంభం

విడవలూరు, జూన్ 26: విడవలూరు మండలం రామతీర్థంలో వెలసిన కామాక్షీ దేవి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం అంకురారోపణతో ఆరంభమయ్యాయి. ప్రధానార్చకుడు పేరేపి శ్రీకాంత్ శర్మ, అర్చకులు, యాగ్ని కులు 9 రోజుల దీక్ష చేపట్టారు. తిరుపతికి చెందిన కొండూరు నాగరాజన్ ఉభయకర్తగా వ్యవహరించారు. ఆలయ ఈవో రామ కృష్ణ పర్యవేక్షించారు.

చేయి తడిపితేనే సర్వీస్!

నెల్లూరు, (జడ్పీ),జూన్ 26 : విద్యుత్ శాఖను అవినీతి జలగలు పట్టి పీడిస్తున్నాయి. కొంతమంది అధికారుల తీరువల్ల మొత్తం ఆ శాఖకే మచ్చ ఏర్పడుతోంది. జిల్లాలో నూతనంగా వెలుస్తున్న లే అవుట్లు, వాణిజ్య కనెక్షన్లు వారికి కల్పతరువుగా మారుతున్నాయి. కేవలం నిర్ణీత ఫీజులు చెల్లిస్తే చాలు

- విద్యుత్ శాఖలో అవినీతి జలగలు
- కల్పతరువుగా వాణిజ్య కనెక్షన్లు
- కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు వాటాలు
- అధికారుల తీరుపై వినియోగదారుల్లో ఆగ్రహం
- ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తున్న వైనం



విద్యుత్ సర్వీసు ఇవ్వాల్సి ఉండగా ఫీజుతోపాటు అడిగిన మొత్తాన్ని అదనంగా చెల్లిస్తేనే పని అవుతుందని కొంతమంది అధికారులు తేల్చి చెబుతున్నారు. ఇలా వసూలు చేసిన మామూళ్లలో పై స్థాయి అధికారులకూ వాటాలు ఇస్తున్నట్లు సమాచారం. దీంతో వినియోగదారులు ఫిర్యాదు చేసినా ఉపయోగం ఉండదనే భావనతో అడిగిన కాడికి ఇచ్చుకుంటూ కనెక్షన్లు పొందుతున్నారు. అయితే, మరికొందరు అధికారులు అడిగినంత ఇవ్వలేక అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులను ఆశ్రయిస్తున్నారు. ఇందులో భాగంగానే తాజాగా నెల్లూరు శివార్లలోని కొత్తూరు ఏఈ ఓ లే అవుట్ కనెక్షన్‌కి రూ.80 వేలు డిమాండ్ చేసి రూ.50 వేలు తీసుకుంటూ అడ్డంగా ఏసీబీ అధికారులకు దొరికిపోయాడు.

● లే అవుట్లు అంటే కాసులే!

జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతుండటంతో విద్యుత్ శాఖాధికారులకు మామూళ్ల పంట భారీగా పండుతోంది. నెల్లూరు నగరంతోపాటు రూరల్, ఇందుకూరుపేట, కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఆత్మకూరు, ఉదయగిరి, కొడవలూరు, కావలి, వింజమూరు తదితర మండలాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వందల ఎకరాల పంట భూములు లైఅవుట్లుగా మారుస్తున్నారు. ఇలా ఏర్పాటైన లే అవుట్లలో తొలిగా విద్యుత్ కనెక్షన్ తీసుకోవాల్సి ఉంది. ఇందుకు అవసరమైన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల ఏర్పాటుకు ఎంత ఖర్చు అవుతుందో విద్యుత్ శాఖాధికారుల అంచనా ప్రకారం లేఅవుట్ యజమానులు చెల్లించి సర్వీసులు పొందుతారు. అయితే, లే అవుట్లలోని ఒక్కో ఎకరా చొప్పున లెక్కించి రూ.50వేలు నుంచి లక్ష మేర అధికారులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి కొంతమంది ప్రైవేట్ విద్యుత్ కాంట్రాక్టర్లు మధ్యస్తం చేస్తూ రియల్టర్ల నుంచి వసూలు చేసిన నగదును అధికారులు అందజేస్తున్నారు. ఇలా వచ్చిన నగదులో కిందిస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు వాటా ఇవ్వాల్సి ఉంటుందని సాక్షాత్తు అధికారులు చెబుతున్నారు. ఉన్నతాధికారులకూ వాటాలు ఇస్తుండటంతో సర్వీసుల పేరుతో అవినీతి వ్యవహారం జోరుగా సాగుతోంది. అలాగే అపార్టుమెంట్లు, రొయ్యల గుంతలకు, వాణిజ్య భవనాలకు ఒక్కో కనెక్షన్‌కి రూ.15వేల నుంచి 40వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈ అవినీతి వ్యవహారం ఉన్నతాధికారులకు తెలిపినా ప్రయోజనం లేకపోవడంతో బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అవినీతి జలగలపై చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

'డీసీఎంఎస్'లో

ప్రభుత్వ ఆడిట్

● రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలు

నెల్లూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లో సహకార శాఖ ఆడిటర్లతో ఆడిటింగ్ చేయించేందుకు రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. 2021-22, 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన అంతిమ ఆడిట్‌ను చేసేందుకు ప్రభుత్వ ఆడిటర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. త్వరగా ఈ ఆడిట్‌ను పూర్తి చేయవలసిందిగా సహకార శాఖ అదనపు రిజిస్ట్రార్ నుంచి ఆదేశాలు అందినట్లు జిల్లా సహకార శాఖాధికారి బీ గుర్రప్ప తెలిపారు. ఈ నెల 25వ తేదీన 'డీసీఎంఎస్‌లో లెక్కలేని తనం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందిస్తూ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూడేళ్ల నుంచి డీసీఎంఎస్‌లో ప్రైవేటు చార్టెడ్ అకౌంటెంట్లతో ఆడిట్ చేయిస్తున్న మాట వాస్తవమేనని, ఈ ఆడిట్ రిపోర్టును తాము తిరస్కరించినట్లు చెప్పారు. ఇదే విషయాన్ని రాష్ట్ర సహకార శాఖ అదనపు రిజిస్ట్రార్‌కు తెలియజేశామని పేర్కొన్నారు. డీసీఎంఎస్ ప్రభుత్వానికి రూ.17.73 లక్షల రుణ బకాయిలు చెల్లించాల్సి ఉందని వెల్లడించారు. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరగా డీసీఎంఎస్‌లో ఆడిటింగ్ పూర్తి చేస్తామని, ఏవైనా ఆర్థిక అవకతవకలు బయటపడితే బాధ్యులపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని గుర్రప్ప తెలిపారు. 2020-21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆర్థిక అవకతవకలు గుర్తించామని, బాధ్యులపై చర్యల తీసుకునేందుకు చార్జెస్ ఫ్రేమ్ చేయాల్సిందిగా ఒంగోలు సహకార శాఖాధికారిని రాష్ట్ర ఉన్నతాధికారులు నియమించారని పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఇంటర్ సప్లిమెంటరీలో

జిల్లాకు 2వ స్థానం

ప్రథమ సంవత్సరం ఫలితాల విడుదల

నెల్లూరు (విద్య), జూన్ 26 : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లా ద్వితీయస్థానం సాధించింది. బుధవారం విడుదలైన ప్రథమ సంవత్సరం ఫలితాల్లో జిల్లా విద్యార్థులు 55 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆర్ఐవో ఎ.శ్రీనివాసులు తెలిపారు. జనరల్ విభాగంలో పరీక్షలకు 6910 మంది హాజరవగా 3786 మంది ఉత్తీర్ణతతో రాష్ట్రంలో ద్వితీయస్థానం, ఒకేషనల్ విభాగంలో 317 మందికిగాను 211 మంది ఉత్తీర్ణతతో (67 శాతం) ఫలితాలతో రాష్ట్రంలో తృతీయ స్థానాన్ని సాధించిందన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో 16, ప్రైవేట్ విభాగంలో 2 కళాశాలలు వందశాతం ఫలితాలు సాధించాయన్నారు.

● రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

మార్కుల విషయంలో సంతృప్తి చెందని విద్యార్థులు రీవెరిఫికేషన్ బీఐఈ డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆర్ఐఓ తెలిపారు. ఈ నెల 28 నుంచి జులై 4వ తేదీ లోపు రూ.వెయ్యి ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

జిల్లాకు రానున్న ఎస్ఐలు

నెల్లూరు(క్రైం) : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాను వీడిన ఎస్ఐలను తిరిగి వెళ్లాలని గుంటూరు సౌత్ కోస్టల్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాకు చెందిన ఎస్ఐలు ఐ మస్తానయ్య, ఎం రాంబాబు, కె వెంకటాద్రినాయుడు, వీసీహెచ్ సుబ్రహ్మణ్యం, టీ.వెంకటేశ్వర్లు బాపట్లకు, ఎస్ సాయిప్రసాద్, కె బాలకృష్ణ, ఎస్‌డీ అబ్దుల్ రహీమ్, బీ తిరుపతయ్య, వీ వెంకటేశ్వర్లు, కే ఎడ్వర్డ్, ఎల్ రాములు, వి మాల్యాద్రిలు గుంటూరు జిల్లాకు వెళ్లారు. వారందరిని తిరిగి నెల్లూరు జిల్లాకు కేటాయించారు. గుంటూరు జిల్లాకు చెందిన ఎం కోటేశ్వరరావు, టీ వెంకటరావు, పీ వెంకటేశ్వర్లు, పీ సుబ్బారావు, టీ.పెంచలయ్య, ఎం జోజి, వీ.వెంకటరావు, పల్నాడు జిల్లాకు చెందిన వీఆర్‌కె మూర్తి, బి మధుసూదనరావు, బాపట్ల జిల్లాకు చెందిన బి మాణిక్యరావు, ఎం శ్రీనివాసులు, వీ భాస్కర్‌రావు, పి జనార్ధనరావు, కె నాగేశ్వరరావు, వి రాంబాబు, జే రమాదేవిలు జిల్లాకు వచ్చారు. వారందరిని తిరిగి ఆ జిల్లాలకే కేటాయించారు.

ఐటీడీఏ పీఓపై విచారణ

విచారణాధికారిగా జడ్పీ సీఈవో

నెల్లూరు (హరనాథపురం) : ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీవో) మందా రాణిపై విచారణకు జడ్పీ సీఈఓ కన్నమ నాయుడును కలెక్టర్ హరినారాయణన్ విచారణాధికారిగా నియమించారు. దీంతో ఆయన ఐటీడీఏ కార్యాలయానికి వెళ్లి విచారించినట్లు తెలిసింది. పీఓపై ఫిర్యాదు చేసిన గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్యను జడ్పీ కార్యాలయంలోని తన ఛాంబర్‌కు పిలిపించి విచారించారు. పీఓ అవినీతి, నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని, విచారించి చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్, జాతీయ ఎస్టీ కమిషన్‌కు కేసీ పెంచలయ్య ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించాలని వారు కలెక్టర్‌కు ఆదేశించడంతో జడ్పీ సీఈఓ విచారించి, నివేదికను కలెక్టర్‌కు సమర్పిం చినట్లు తెలిసింది.



ఆర్టీసీ బస్టాండు వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు

ఘటికులే!

- జల్సాల కోసం బైక్‌ల అపహరణ
- నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో కేసులు
- చివరకు పోలీసులకు చిక్కిన యువకులు
- రూ.15 లక్షల సొత్తు స్వాధీనం



నిందితుల వివరాలు తెలుపుతున్న ఎస్పీ ఆరీఫ్ హఫీజ్

నెల్లూరు (క్రైం), జూన్ 26: చిన్ననాటి నుంచే స్నేహితులుగా ఉన్న ఆ ముగ్గురు యువకులు చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. జల్సాల కోసం బైక్ దొంగతనాలనే వృత్తిగా మలుచుకున్నారు. వరుసగా బైక్ చోరీలకు పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ఆ ముగ్గురు చివరకు కటకటాలపాలయ్యారు. నెల్లూరు సీసీఎస్, కావలి పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి బుధవారం అరెస్టు చేశారు. నిందితుల వివరాలను ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ కె ఆరీఫ్ హఫీజ్ వెల్లడించారు. బోగోలు మండలం కప్పరాళ్ల తిప్పకు చెందిన పి భానుప్రకాష్, జి గోప్స్, జి హనుమాన్‌లు చెడువ్యసనాలకు బానిసలయ్యారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో బైక్ దొంగతనాలు చేసి వాటిని అమ్మిన నగదుతో జల్సాలు చేస్తున్నారు. కావలి వన్ టౌన్, రూరల్ పోలీసు స్టేషన్లలో అందిన ఫిర్యాదులతో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ కోటేశ్వరరావు, సాంబశివరావు, కావలి ఒకటోపట్టణ ఇన్‌స్పెక్టర్ రాజేష్‌లు తమ సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసుకొని నిందితుల కోసం వేట మొదలు పెట్టారు. సాంకేతికత ఆధారంగా బుధవారం నిందితులను కావలిలోని తుమ్మలపెంట రోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నారు. కావలి, చీరాల, ఒంగోలు రూరల్, కనిగిరి పోలీసు స్టేషన్ల పరిధిలో రూ.15 లక్షలు విలువ చేసే 21 బైక్‌లు దొంగలించినట్లు విచారణలో నిందితులు తెలిపారు. ఆ మేరకు 21 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసిన సీసీఎస్, కావలి డీఎస్పీలు పి రామకృష్ణాచారి, ఎం వెంకటరమణ, సీసీఎస్, కావలి ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు.



స్వాధీనం చేసుకున్న బైక్‌లు

యువతా మేలుకో.. జీవితాన్ని చక్కదిద్దుకో!

నెల్లూరు (క్రైం), జూన్ 26 : 'యువతా మేలుకో.. జీవితాలను చక్కదిద్దుకో..!' అంటూ నెల్లూరులో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. బుధవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలు నుంచి ఆర్టీసీ బస్టాండు మీదుగా తిరిగి పోలీస్ మైదానం వరకు సాగిన ఈ ర్యాలీలో నెల్లూరు నగర టౌన్ డివిజన్, సెబ్ పోలీసు అధికారులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు. ఆర్టీసీ బస్టాండు వద్ద మానవహారంగా ఏర్పడి డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేస్తామంటూ అదనపు ఎస్పీ సౌజన్య ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు విక్రయించి సొమ్ము చేసుకుందామని ఎవరైనా భ్రమపడి అమాయక యువతను, విద్యార్థులను ప్రలోభపెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఏపీఆర్పీటీ ప్రసాద్, శ్రీనివాసరావు, నగర డీఎస్పీ డి శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' అవినీతి నిగ్గుతేలేనా?

- పనులపై తనిఖీలు ప్రారంభం
- సిబ్బంది గుండెల్లో గుబులు
- దొంగ మస్టర్లతో నిధుల స్వాహా

అనంతసాగరం, జూన్ 26: మండలంలో చేపట్టిన ఉపాధిహామీ పనులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసేందుకు 20మంది తనిఖీబృందం సభ్యులు అనంతసాగరంకు చేరుకున్నారు. ఈ మేరకు ఎన్‌ఆర్‌జీఎస్ అధికారులు వారికి రికార్డులు స్వాధీనం చేశారు. 25పంచాయతీలుండగా ఈ ఏడాది జరిగిన పనుల వివరాలతో తనిఖీ సిబ్బంది గ్రామాలకు చేరుకొని గ్రామసభలు నిర్వ హించి వివరాలు సేకరించి పనులు చేసిన ప్రాంతాలకు వెళ్లి పరిశీలన చేయనున్నారు. తాము చేసిన



ఉపాధి పనులపై సమీక్ష చేస్తున్న తనిఖీ బృందం

తప్పులు ఎక్కడ బయట పడుతాయోనన్న ఆలోచనతో ఉపాధి సిబ్బంది గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. పలు గ్రామాల్లో ఎక్కువ మొత్తంలో ఉపాధి నిధులు దుర్వినియోగం అయినట్లు తెలుస్తోంది. గత వైసీపీ పాలనలో నాయకుల అండతో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు రెచ్చిపోయారు. పనులు చేయకనే చేసినట్లు రికార్డులు నమోదు చేశారని, పనులకు రాకపోయిన కొందరు వచ్చినట్లు దొంగ మస్టర్లు నమోదు చేసి నిధులు స్వాహా చేసినట్లు బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నారు. ఈ పరిస్థితిలో తమ అవినీతి బం డారం ఎక్కడ బయట పడుతుందో అని ఉపాధి సిబ్బంది హడలెత్తిపోతున్నారు. ఇక చేసేది లేక తనిఖీ బృందం సభ్యులను మచ్చిక చేసుకొనేలా ఉపాధి సిబ్బంది పావులు కదుపుతున్నారు. తనిఖీ కోసం వారికి మర్యాదలు చేసు కొని వారికి ఎంతో కొంత ఇచ్చి ఆ అవినీతిలో వారిని కూడా భాగ్యసా మ్యం చేసేలా జాగ్రత్తగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితిలో సామాజిక తనిఖీ బృందం ఎలా అడుగులు వేస్తుందో వేచి చూడాలి. నిఖచ్చిగా పనుల్లో జరిగిన అవినీతి వెలికితీస్తారా? లేదా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. పనులు



కాలువ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

తనిఖీ చేసే సిబ్బంది ప్రలోభాలకు లొంగకుండా అవినీతి బహిర్గతం చేసేలా చర్య లు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలల తనిఖీ



విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఈవో జానకిరాం

అనంతసాగరం, జూన్ 26: మంగుపల్లి మెయిన్, గౌరవరం ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో-1 జానకీరాం బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. పలు ప్రశ్నలు అడిగి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. మెనూ ప్రకారం భోజనం అందించేలా దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు.

సామూహిక అక్షరాభ్యాసం



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లులు

ఆత్మకూరు, జూన్ 26: కనుపూరుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, తల్లులు చిన్నారులకు సామూహిక అభ్యాసం చేయించారు. ముందుగా సరస్వతి పూజను నిర్వహిం చారు. తదనంతరం ప్రధానోపాధ్యాయుడు పి.అనిల్‌కు మార్ సొంత నిధులతో పలకులు, నోటుపుస్తకాలు, పెన్సిల్స్ తదితర విద్యాసామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గుర్రం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచుకోని బోరు

ఆత్మకూరు, జూన్ 26: మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు ఎస్సీ కాలనీలో ఐదు నెలల నుంచి బోరు మరమ్మతులకు నోచుకోలేదని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వన్నెం నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించినా వారు స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వాటర్ ట్యాంకుల క్లీనింగ్



వాటర్ ట్యాంకులను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

సీతారామపురం, జూన్ 26: ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్ ఆదేశాలతో బుధవారం స్థానిక గ్రామపంచాయతీలోని హరిజనవాడ, పండ్రంగిలోని వాటర్ ట్యాంకులు క్లీనింగ్, పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు బుధవారం కార్యదర్శులు రామ్‌నాథ్‌రెడ్డి, జీవన్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి మాట్లాడారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు తాగు నీటిని వేడి చేసి వడగట్టి తాగాలన్నారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని మురుగునీరు వీధుల్లోకి వెళ్లకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు నరశింహులు, ఓబులేసు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను పరిరక్షిద్దాం

ఉదయగిరి రూరల్, జూన్ 26: ప్రభుత్వ బడులను పరిరక్షించుకుందామని అందుకు ప్రతి తల్లిదండ్రులు పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిద్దామంటూ యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కె.చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సుబ్బారెడ్డి, ఫణిరాజా, దుర్గాప్రసాద్, రామకృష్ణ, పద్మనాభరెడ్డి, చెన్నకృష్ణయ్య, ఖాదర్‌బాష, రవి పాల్గొన్నారు.

సప్లిమెంటరీలో విద్యార్థుల ప్రతిభ

సీతారామపురం, జూన్ 26: బుధవారం విడుదలైన ఇంటర్ ఫస్ట్ ఇయర్ సప్లిమెంటరీ ఫలితాల్లో మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపల్ ఎస్ఎం రెహమాన్ ఒక ప్రకటలో పేర్కొన్నారు. మే నెలలో జరిగిన ఈ పరీక్షలకు హాజరైన 18 మంది ఉత్తీర్ణత సాధించిందన్నారు. బైపీసీ విభాగంలో నిరీష 440 మార్కులకు 423, ఎంపీసీ విభాగంలో ఎలిజ బెత్ 470 మార్కులకు 435, సీఈసీ విభాగంలో నాలి నాగశాలిని 500లకు 382మార్కులు సాధించారని తెలిపారు.

మాదక ద్రవ్యాలు వినియోగిస్తే జీవితాలు నాశనం

ఆత్మకూరు, జూన్ 26: మత్తు పదార్థాల వినియోగం ప్రాణాంతకం.. ఇది శరీరాన్ని మనకు తెలియకుండానే పీల్చి పిప్పి చేసి రోగాలపాలు చేస్తుంది. వీటికి అలవాటుపడితే మనిషి నాడీవ్యవస్థ పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. యువత వీటి జోలికి వెళ్లకుండా ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలని సీఐ జి.వేణు తెలిపారు. బుధవారం ప్రపంచ మత్తు



ఆత్మకూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో కలిసి పోలీసు, సెబ్ అధికారులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బీఎస్‌ఆర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి మాదకద్రవ్యాలపై యువత జాగ్రత్తగా ఉండాలని, మత్తుకు బానిస కావద్దంటూ నినాదాలతో హోరెత్తిం చారు. కార్యక్రమంలో ఎస్ఐ ము త్యాల రావు, సెబ్ ఎస్ఐ కిరణ్‌కు మార్, అధ్యాపకులు, విద్యార్థులు, సెబ్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరి: మత్తు పదార్థాలు వాడినా.. అమ్మినా చర్యలు తప్పవని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణా నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి బస్టాండ్ వరకు ఈ ర్యాలీని కొనసాగించి అనంతరం మానవహారాన్ని ఏర్పాటు చేశారు. యువత గంజాయి మత్తుకు బానిసలు కావద్దన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడి తమ జీవి తాలను నాశనం చేసుకోవద్దని ని నాదాలు చేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సి పాల్ ఆకుల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో ర్యాలీ చేస్తున్న పోలీసులు

వైసీపీకి.. ఇక భవిష్యత్తు ఉండదు!

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు

ఉదయగిరి రూరల్, జూన్ 26: సాధారణ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చి వైసీపీని బంగాళాఖాతంలో కలిపారని, ఆ పార్టీకి, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఇక రాజకీయ భవిష్యత్తు ఉండదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ అన్నారు. బుధవారం స్థానిక చెంచురామయ్య అతిథిగృహంలో ఆయన



విలేకరులతో మాట్లాడుతున్న చెంచలబాబు యాదవ్

విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడుపై రాష్ట్ర ప్రజలకు ఉన్న అపార నమ్మకంతోనే ఈ ప్రతిష్టాత్మకమైన తీర్పు సాధ్యమైందన్నారు. ఇప్పుడు కూడా తామే అధికారంలో ఉన్నామని భ్రమతో వైసీపీ నేతలు ప్రెస్‌మీట్‌లు పెట్టి లేనిపోని ఆరోపణలు చేస్తుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఐదేళ్ల పాలనలో పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రతిఒక్కర్ని వేధించారన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. రాజధానిగా అమరావతి, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చంద్రబాబు నడుంబిగించారన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ల ఆధ్వర్యంలో ఉదయగిరి అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బయ్యన్న, షేక్ మాబాషా, చల్లగొలుసు రమణయ్య, అరుణమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలి

ఆత్మకూరు, జూన్ 26: 2024-25 విద్యా సంవత్సరంలో బడిఈడు పిల్లలందరీని పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఐటీడీఏ ఏఎంవో శాంతకుమారి, ఉర్దూ డీఐ ఖాజామోహీద్దీన్ తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు సమగ్రశిక్ష, విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని మేదరకాలనీ, టెక్కే మైనార్టీ పాఠశాల



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

ఆవాస ప్రాంతం, వందురుగుంట, మండలంలోని కరటంపాడు గిరిజన కాలనీలో నేను బడికి పోతా అనే కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యంచ ఎంఈవో-2 చలపతి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక హరిజనవాడలో నేను బడికిపోతా కార్యక్రమాన్ని ఎంఈఓ మస్తాన్‌వలి, సర్పంచ్ కొడవటికంటి భాగ్య కుమారి ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు, సీఆర్పీ వెంకటేశ్వర్లుతో కలసి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామాన్ని సందర్శించి బడి బయట పిల్లల వివరాలను సేకరించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారి పిల్లలను పాఠశాలకు పంపిచాలని కోరారు. కార్యక్రమంలో సీతారామ పురం బిట్-2 వెల్ఫేర్ అసిస్టెంట్ నాగరాజు పాల్గొన్నారు.



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో మస్తాన్‌వలి

సైన్స్ ఉపాధ్యాయుడికి ప్రతిభా ప్రశంసాపత్రం

ఉదయగిరి, జూన్ 26: గడ్డంవారిపల్లి జిల్లా ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు షేక్ కరీముల్లాహుస్సేన్‌కు ప్రతిభప్రశంసా పత్రం దక్కింది. ఇటీవల భారత హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరియు మై గవర్నమెంట్ సంయుక్తంగా నిర్వహించిన భారతీయ నాగరిక్ సురక్ష సంహిత-2023 క్విజ్ కార్యక్రమంలో పాల్గొన్నందుకు ప్రతిభా ప్రశంసా పత్రం బుధవారం పోస్ట్ ద్వారా అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను ప్రధానోపాధ్యాయులు మాలకొండయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

నర్రవాడకు తరలిన భక్తులు

వరకుంటపాడు, జూన్ 26: నర్రవాడ వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు బుధవారం మండలంలోని గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో తరలివెళ్లారు. ఉత్సవా ల్లో ప్రధానంగా కల్యాణోత్సవం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు చేరుకున్న వారు కుటుంబ సమేతంగా తరలివెళ్లి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. చాలా గ్రామాల నుంచి ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దుల బండ్లతో దారి పొడవునా కన్పించారు.



కావలి, జూన్26: మాదకద్రవ్యాలు వినియోగించినా, విక్రయించినా, రవాణా చేసినా, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఎం. వెంకటరమణ తెలిపారు. మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం కావలిలో ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా నారాయణ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కావలిలో గంజాయి విక్రయాలు, రవాణాపై గతంలో కొంతమందిపై కేసులు నమోదు చేశామన్నారు. ఎక్కడైనా వాటిని వినియోగిస్తున్నా, కలిగి ఉన్నా, కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐలు రాజేష్, శ్రీనివాసరావు, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు : డీఎస్పీ

కందుకూరు : అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కందుకూరులో సెబ్ అధికారులు స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెబ్ ఇన్స్‌పెక్టర్ డీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు సేవించటం, కలిగి ఉండటం నేరమన్నారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఓ. వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, సెబ్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి : స్థానిక ఏపీ మోడల్‌స్కూల్‌లో బుధవారం మాదకద్రవ్యాల వినియోగం అనే అంశంపై విద్యార్థులకు కలిగిరి సెబ్ స్టేషన్ హౌస్‌ఆఫీసర్ వై వెంకటేశ్వర్లు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు అలవాటుపడిన యువత చెడు మార్గంలో పయనించడానికి ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు ఉన్నతంగా చదివి సంస్కారవంతులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ సెబ్ సిబ్బంది సుధాకర్, గోపాలకృష్ణ, మాల్యాద్రి, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కావలి : డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు



కలిగిరి : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు



కందుకూరులో మాట్లాడుతున్న సెబ్ అధికారులు

గ్రామాల్లో తాగునీటి పరీక్షలు

అల్లూరు, జూన్ 26 : మండలంలోని అన్నీ పంచాయతీల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది బుధవారం తాగునీటి పరీక్షలు నిర్వహించారు. తాగునీటి క్లోరినేషన్‌పై అవగాహన కల్పించారు. ఎంపీడీవో జ్యోతి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొని తాగునీటి కుళాయిలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

- **నాణ్యతా ప్రమాణాలు పాటించాలి**

అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని ఆర్‌వో వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నగర పంచాయతీ కమిషనర్ ఫణి కుమార్ అన్నారు. బుధవారం ఆయన పట్టణ పరిధిలోని కొన్ని వాటర్ ప్లాంట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. నాణ్యతా లోపాలు ఉన్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈ వినోద్, ఆర్ఐ రమేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఐ.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీడీవో జ్యోతి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులను అరికట్టాలంటే తాగునీటి సరఫరా, శుభ్రతపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, ఏఈ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.



అల్లూరు : పైపులైన్ వద్ద తాగునీటిని పరిశీలిస్తున్న పంచాయతీ సిబ్బంది

మంత్రులతో ఇంటూరి భేటీ



మంత్రి బాలాంజనేయ స్వామికి పుష్పగుచ్ఛం అందచేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జూన్ 26: కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం రాష్ట్ర సచివాలయంలో పలువురు మంత్రులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సాంఘిక, సంక్షేమం, సచివాలయాలు, వలంటీర్ల శాఖామంత్రిగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన కొండపి ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామిని ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. అలాగే రాష్ట్ర రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని, రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్రను కూడా కలిసి సన్మానించారు.

- **మంత్రులను కలిసిన రాజేష్**

టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ బుధవారం సచివాలయంలో పలువురు రాష్ట్రమంత్రులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దనరెడ్డి, రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్, గనుల శాఖామంత్రి కొల్లు రవీంద్రలను కలిసి పుష్పగుచ్చాలు అందచేశారు.

కంప చెట్లు, చెత్తాచెదారం తొలగింపు

కావలి,జూన్26: పట్టణంలోని ముసునూరు రాగిచెట్టు గిరిజన కాలనీ నుంచి అండర్ బైపాస్ వరకు రోడ్డు పక్కన ముళ్లచెట్లు,చెత్తా చెదారాలను బుధవారం తొలగించారు. వీటి తొలగింపుపై ఆ ప్రాంత వాసులు కావలి ఎమ్మెల్యే కావ్య దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్‌కు చెప్పారు. దీంతో ఆయన ఎక్స్‌కవేటర్ ద్వారా రోడ్ల పక్కన ఉన్న కంపచెట్లను, చెత్తా చెదారాన్ని తొలగింపచేశారు. పట్టణంలో కూడా పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

లక్ష్మీపురం సర్పంచు మృతి

కలిగిరి : మండలంలోని లక్ష్మీపురం సర్పంచు దాసరి కొండమ్మ(77) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు బుధవారం ఉదయం బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు కనపడడంతో వెంటనే కావలి వైద్యశాలకు తరలించారు. అక్క డ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు.



కొండమ్మ (ఫైల్)

రేపు గురుకులంలో ప్రవేశ పరీక్ష

చిత్రగుంట : బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి శుక్రవారం ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.పద్మావతి బుధవారం తె లిపారు. పాఠశాలలోని 6,7,9 తరగతుల్లో మిగులు సీట్లు ఉన్నందున, ఆసక్తి కలిగిన విద్యార్థులు ప్రవేశపరీక్ష రాయాలన్నారు. పూర్తి వివరాలకు 9440552944 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

టీచర్ పోస్టులు పెరిగేలా కృషి

కావలిటౌన్ : జిల్లాలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల సంఖ్య పెరిగేలా కృషి చేస్తామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం తుమ్మలపెంట రోడ్డులోని జనసేన కార్యాలయంలో నిరుద్యోగ యువకులు ఆయన్ను కలిసి మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ కేబినెట్ ఆమోదం పొందిన మెగా డీఎస్సీలోని ఎస్జీటీ ఖాళీల సంఖ్య 104గా చూపిస్తున్నారన్నారు. అన్ని జిల్లాల్లోనూ ఎస్జీటీ ఖాళీల సంఖ్య పెరిగాయన్నారు. నెల్లూరు జిల్లాలో పెరగకపోవడంతో అభ్యర్థులు ఆందోళనకు గురౌతున్నారన్నారు. కాగా సుధాకర్ డీఈవోతో చరవాణిలో మాట్లాడి ఖాళీల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

వలేటివారిపాలెం : పశువులకు గుండె జబ్బులు రాకుండా ముందస్తుగా హెచ్ఎస్ టీకాలు వేయించాలని పోకూరు పశువైద్యాధికారి పులి వంశీ తెలిపారు. మండలంలోని గురుకుపాలెంలో పశువులకు బుధవారం టీకాలు వేశారు.

సీఎం, డిప్యూటీ సీఎంల చిత్రపటాల ఏర్పాటు



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలు ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

అల్లూరు, జూన్ 26 : ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, ఎమ్మెల్యే కావ్య చిత్రపటాలను బుధవారం టీడీపీ నేతలు ఆవిష్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జ్యోతి ఈ చిత్రపటాలను ఏర్పాటు చే శారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి శ్రీనివాసులు రెడ్డి, అంబటి రాజేంద్ర, కారుమంచి కార్తీక్ శర్మ, తిరుమలశెట్టి శ్రీనివాసులు, తోట శ్రీహరి, ఎండేటి హరికృష్ణ, గుంజి రుద్రయ్య, దాసరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి ఘన సన్మానం

కొండాపురం, జూన్ 26: పదవీ విరమణ చేయనున్న సాయిపేట పంచాయతీ కార్యదర్శి ఎల్ చెన్నకేశవులను బుధవారం జడ్పీటీసీ సభ్యుడు యల్లావుల వెంకట్రావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈనెల 30న పదవీ విరమణ చేయుచున్న సందర్భంగా ముందస్తుగా ఈ కార్యక్రమాన్ని సచివాలయం వద్ద ఏర్పాటు చేశారు. సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు ఆయన సేవలను కొనియాడారు. శాలువాలు, పుష్పగుచ్చాలతో సన్మానించారు. అలాగే వీఆర్వోగా పనిచేసి పదోన్నతిపై బదిలీ అయిన ప్రసాదరావును కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు టీ కోటేశ్వరమ్మ, కావలి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ జీ నరసింహులు, సాగునీటి సంఘ మాజీ అధ్యక్షుడు ఉన్నం రోశయ్య తదితరులు పాల్గొన్నారు.



చెన్నకేశవులను సన్మానిస్తున్న జడ్పీటీసీ యల్లావుల తదితరులు

బులియన్, కుదువ వ్యాపారుల సంఘం అధ్యక్షుల ఎన్నిక

కావలి,జూన్26: పట్టణ బులియన్ మర్చంట్స్ అసోసియేషన్, కుదువ వ్యాపారుల అసోసియేషన్‌ల సమావేశాన్ని బుధవారం కొత్తబజారులోని రామానుజ కూటమి కల్యాణ మండపంలో నిర్వహించారు. రెండు అసోసియేషన్లకు చెందిన వ్యాపారులు తమ సమస్యలపై చర్చించుకుని నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మొగళ్లపల్లి రాజాను, కుదువ వ్యాపార అసోసియేషన్ అధ్యక్షుడిగా కోట రమేష్‌లను ఎన్నుకున్నారు. త్వరలో జరగనున్న ప్రమాణ స్వీకారోత్సవం నాటికి పూర్తి స్థాయిలో కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని అధ్యక్షులు తెలిపారు.



మొగళ్లపల్లి రాజా, కోట రమేష్

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

కందుకూరు, జూన్ 26: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కందుకూరు ఉపవిద్యాశాఖాధికా రి(డీవైఈవో) ఎంవీవీ ప్రసాదరావు, ఎంఈవో కె. సుబ్బారెడ్డి అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోస్టాఫీసు సెంటర్‌లో మానవహారం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం. నరసింహమూర్తి, సీనియర్ ఉపాధ్యాయులు రమణయ్య, విప్రనారాయణ, ప్రసాదరావు, చిత్తారు వెంకటేశ్వర్లు, సుధాకరరావు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కావలి రూరల్ : బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని ఎంఈవో గోవిందయ్య పేర్కొన్నారు. కావలి మండలం జువ్విగుంటపాలెం ఎంపీపీ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం నేను బడికి పోతా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, సీఆర్పీ తదితరులు పాల్గొన్నారు.

నేడు తైక్వాండో క్రీడాకారుల ఎంపిక

కందుకూరు, జూన్ 26: ఈనెల 30న విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొనే ఉమ్మడి ప్రకాశం జిల్లా తైక్వాండో బాలబాలికల ఎంపికలు గురువారం నిర్వహించనున్నట్లు తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్కే అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలు ఉదయం పది గంటలకు టీఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాలలో జరుగుతాయన్నారు. 12 నుంచి 14 ఏళ్ల వయసు కలిగిన తైక్వాండో క్రీడాకారులు ఈ ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ సర్టిఫికెట్లు తీసుకుని ఎంపికలకు హాజరుకావాలన్నారు.ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.